


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

19.09.2026

శనివారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 128

పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# విశాఖలో ఇళ్ల పట్టాల పండగ

## ఒకేరోజు 28 వేల మందికి పట్టాల పంపిణీ!

- త్వరలోనే విజయవాడలోనూ..
- 19న సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో
- విశాఖలో వేలాది కుటుంబాలకు ఇంటిపై పూర్తి హక్కు
- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
- 11 మండలాల పరిధిలో లబ్ధిదారులు
- రూ.8,874 కోట్ల విలువైన 19,33,853 చదరపు గజాల స్థలం
- క్రమబద్ధీకరిస్తున్నట్లు సీఎం వెల్లడి
- కేవలం పట్టాల పంపిణీ కార్యక్రమం కాదని వ్యాఖ్య





అమరావతి, సెప్టెంబర్ 18, అనంతజనశక్తి న్యూస్

రాష్ట్రంలో పేదలకు కలగా ఉన్న సొంతిల్లు.. ఇక శాశ్వత హక్కుగా మారుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న వేలాది పేద కుటుంబాలకు పూర్తి హక్కులు కల్పిస్తున్నామని చెప్పారు. శనివారం విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని.. 11 మండలాల పరిధిలో రూ.8,874 కోట్ల విలువైన 19,33,853 చదరపు గజాల స్థలాలను క్రమబద్ధీకరిస్తున్నామన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో సీఎం పోస్ట్ చేశారు. 2లో..

''ఇది కేవలం పట్టాల పంపిణీ కార్యక్రమం కాదు. 28 వేల కుటుంబాలకు వారి నివాసాలపై పూర్తి హక్కు కల్పించే చరిత్రాత్మక సందర్భం. ఈ పట్టాతో ప్రతి కుటుంబానికి ఒక విలువైన ఆస్తి దక్కుతుంది.. భవిష్యత్తుకు భద్రత కలుగుతుంది.. బిడ్డలకు వారసత్వ సంపద లభిస్తుంది.. ఆత్మ గౌరవం, భరోసా దక్కుతుంది. దశాబ్దాలుగా నివసిస్తున్న ఇంటిపై హక్కు కోసం ఎదురుచూసిన ప్రతి కుటుంబంలో ఆనందం చూడటమే మా ప్రభుత్వానికి నిజమైన సంతృప్తి. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాగునీటి ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ప్రజల కోసం రోజుకో ముందడుగు వేస్తున్నాం. ప్రజల కలలకు రెక్కలు తొడుగుతున్నాం. ప్రపంచ స్థాయి నగరంగా మారుతున్న విశాఖలో సామాన్య కుటుంబాలకు భరోసాను కల్పిస్తున్నాం. వారిని అభివృద్ధిలో భాగస్వాములు చేస్తున్నాం''అని సీఎం పేర్కొన్నారు.

### మిగతా ప్రాంతాల్లోనూ....

రాష్ట్రంలో ఒక్క విశాఖ జిల్లాకే ఈ సేవలను పరిమితం చేయకుండా, రానున్న రోజుల్లో విజయవాడ నగరంలోనూ 24 వేల పేద కుటుంబాలకు చెందిన ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే జీవో నంబర్ 30 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ జిల్లాల్లో 12 వేల మందికి వారి ఇంటి స్థలాలపై యాజమాన్య హక్కులు కల్పించారు. మరో 9 వేల దరఖాస్తులు పరిశీలన దశలో ఉన్నాయని, వాటిని కూడా వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ఒక్క మంగళగిరి నియోజకవర్గంలోనే 5 వేల కుటుంబాలకు సంబంధించిన ఇళ్ల స్థలాల పట్టాలను క్రమబద్ధీకరించారు.

---

# సృష్టి ఉన్నంతవరకూ ధర్మం ఉంటుంది

- సమస్త సంతోషానికీ అదే మూలం
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్
- ధర్మం వృద్ధాప్యానికి పరిమితం కాదు
- మనిషి జీవితం ప్రారంభం నుంచి ఎండ్ వరకు



2లో..

# అసెంబ్లీ నిర్మాణానికి రూ.661 కోట్లు

## మలి విడత ల్యాండ్ పూలింగ్ రైతులకు కనీస కౌలు రూ. 40వేలు: రాష్ట్ర మంత్రి పి.నారాయణ

అమరావతి,సెప్టెంబర్ 18 : అనంత జనశక్తి న్యూస్

రాజధాని అమరావతి నడిబొడ్డున అత్యంత ఎత్తైన భవన నిర్మాణాల్లో ఒకటైన అసెంబ్లీ(ఐకానిక్ భవనం) స్పైర్(250 మీటర్లు) నిర్మాణానికి టెండర్లు పిలవడానికి రూ.661 కోట్లకు పరిపాలనామోదం ఇవ్వడం జరిగిందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు పొంగూరు నారాయణ తెలిపారు. 7లో..



# డీజేల విషయంలో ఇబ్బందులు రావొద్దు

- పోలీసులకు లోకేష్ ఆదేశాలు
- వినాయక చవితి నిమజ్జనం వేళ ఘటన
- డీజేలకు పర్మిషన్ లేదంటున్న పోలీసులు
- హోంమంత్రి, డీజీపీ జోక్యం చేసుకోవాలి

2లో..



---

# సురేందర్ కోలీ ఆత్మహత్య

- నిఠారీ హత్యల కేసు నిందితుడు
- ఉత్తరాఖండ్‌లోని నివాసంలో సూసైడ్.. ఉరి వేసుకుని.. ఆత్మహత్య 2లో..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18, అనంతజనశక్తి న్యూస్

అలహాబాద్ హైకోర్టు తీర్పుతో నిఠారీ హత్యల కేసు నుంచి విముక్తి పొందిన సురేందర్ కోలీ (50) శుక్రవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హరిద్వార్‌లోని సప్త సరోవర్ రోడ్డులో గల లాల్ మాతా ఆలయం సమీపంలో ఉన్న ఒక టీ కొట్టులో ఆత్మహత్య చేసుకుని అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. గత కొన్ని నెలలుగా హరిద్వార్‌లో నివాసముంటున్న కోలీ, ఇటీవల ఒక టీ కొట్టును అద్దెకు తీసుకుని నడుపుతున్నాడు.

# మమతా బెనర్జీకి బిగ్ షాక్

- నందిగ్రామ్ పోటీ నుంచి అభ్యర్థి విత్‌డ్రా
- సీఎం సువేందుతో భేటీ తర్వాత సంచితా ప్రధాన్ కీలక నిర్ణయం
- ఇటీవల సంచితా అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన మమతా
- సీఎంతో భేటీ తర్వాత గంటల్లోనే కీలక పరిణామం



కోల్‌కతా, సెప్టెంబర్ 19, అనంతజనశక్తి న్యూస్

ఇప్పటికే పార్టీని, ఎన్నికల గుర్తును కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీకి బిగ్ షాక్ తగిలింది. రాబోయే నందిగ్రామ్ ఉప ఎన్నికల బరి నుంచి మమతా వర్గం అభ్యర్థి విత్ డ్రా అయ్యారు. నందిగ్రామ్ బై ఎలక్షన్స్ కోసం మమతా వర్గం తమ అభ్యర్థిగా సంచితా ప్రధాన్ డే అనే మహిళా టీచర్‌ను ప్రకటించారు. 2లో..

### పోలవరం ఎత్తు విషయంలో

# జగన్ దుష్ప్రచారం

- గత ప్రభుత్వ పాపాలను కూటమి ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం.
- ప్రశ్నార్థకమైన పోలవరంను, పూర్తవుతుందనే భరోసా కల్పించాం. 7లో..
- పూర్తిస్థాయిలోనే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం.
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



# బీసీల జనాభా తక్కువగా చూపే కుట్ర

## కేంద్రంపై కవిత విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్ 18, అనంతజనశక్తి న్యూస్

బీసీ కులాల జనాభాను తక్కువ చేసి చూపే కుట్ర జరుగుతోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. ది యునైటెడ్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్, సకల జన సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పాలిటిక్స్ బియాండ్ క్యాస్ట్' సదస్సులో మాట్లాడుతూ.. కేంద్రం చేసే జనగణనలో బీసీ ఉప కులాలను కూడా కలిపి లెక్కించాలని డిమాండ్ చేశారు. కులం కోసం ప్రత్యేక కాలం ఉండాల్సిందే అని స్పష్టం చేశారు. కులగణనకు ఇంకా నాలుగు నెలల సమయం ఉందని.. కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు. 2లో..

---

# అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు

- 11వ తేదీనే నోటీసులు ఇచ్చాం
- స్పష్టం చేసిన ఈడీ అధికారులు 2లో..
- ఆఫీస్‌కు రావాలని నోటీసుల్లో వెల్లడి



# ఒకరిని ఒకరు కాపాడుకుంటున్నారు

- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటే
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి
- గత ప్రభుత్వ హయాంలో లక్షల కోట్ల స్కామ్‌లు
- ఈ విషయం సీఎం రేవంత్ రెడ్డే చెప్పారు
- మరి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?



2లో..

హైదరాబాద్, సెప్టెంబర్ 18, అనంతజనశక్తి న్యూస్

గత ప్రభుత్వంలో లక్షల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని.. మరి కేసులు పెట్టి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. ఆ భూమిని ఎందుకు తిరిగి తీసుకోవడం లేదని నిలదీశారు. 23 లక్షల ఎకరాలు భూ మార్పిడి జరిగిందని ముఖ్యమంత్రి చెప్పారని.. ఆ రిజిస్ట్రేషన్‌లను ఎందుకు రద్దు చేయడం లేదని అడిగారు. గతంలో ధరణి, ఇప్పుడు భూ భారతితో లక్షల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని చెబుతున్నారన్నారు. సెట్ పేరుతో వ్యవహారాన్ని సెట్ చేసుకోవాలని చూస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షల కోట్ల రూపాయల భూముల వివరాలను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు.

# రెడ్ల పౌరుషాన్నికాపాడుతుంది

- మా పార్టీ రాయలసీమ ఒరిజనల్ రెడ్లది
- చంద్రబాబు, జగన్‌కు ఓట్ల కోసం రెడ్లు కావాలి 2లో..
- విజయసాయిరెడ్డి సంచలన ప్రకటన
- రాయలసీమకు ఇద్దరు ఏం చేశారంటూ ప్రశ్న



అమరావతి, సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తాము స్థాపించబోయే పార్టీ టీడీపీ, వైఎస్సార్‌సీపీకి ప్రత్యామ్నాయం కాబోతుందంటున్నారు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి. తమ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని.. రాయలసీమలో ప్రాజెక్టులు పూర్తిచేస్తామన్నారు. తాము పెట్టబోయే పార్టీని గెలిపిస్తే యువతరంలో ఒకరు ముఖ్యమంత్రి అవుతారన్నారు. తాను ముఖ్యమంత్రి పోటీలో ఉండనని.. పార్టీ నుంచి ఎవరో ఒకరు ముఖ్యమంత్రి అవుతారని తేల్చి చెప్పారు.

## సృష్టి ఉన్నంతవరకూ

# ధర్మం ఉంటుంది

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18, అనంతజనశక్తి న్యూస్

'ధర్మం' అనేది కేవలం వృద్ధాప్యానికి మాత్రమే పరిమితమైనది కాదని, మనిషి జీవితం ప్రారంభం నుంచి అంతం వరకూ తోడుగా ఉండేదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో శుక్రవారం నిర్వహించిన 'యువ ధర్మ సంసద్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సాధారణంగా ధర్మం గురించి వృద్ధులే మాట్లాడతారనే భావన ఉన్న నేటి రోజుల్లో, యువత 'ధర్మం' గురించి ఆలోచించడం, చర్చించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఆయన అన్నారు. గీత, రామాయణాలను రిటైర్ అయిన తర్వాతే చదవాలనే అపోహ సమాజంలో ఉందని, కానీ అది ఎంతమాత్రం నిజం కాదని భాగవత్ చెప్పారు. ధర్మం ఆధారంగానే విశ్వం నడుస్తుందని పేర్కొన్నారు.
'ప్రతిదీ నా నియాంత్రణలోనే ఉంది, నా ప్రకారమే జరగాలి' అనే అహంకారంతో నడుచుకునే వ్యక్తి తీవ్రమైన భ్రమలో పడతాడని, అలా అనుకోవడం పొరపాటని హెచ్చరించారు. ధర్మాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే ముందుగా మనస్సులో ఉన్న పాత, స్థిరపడిపోయిన అపోహల నుంచి బయటపడాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ పిలుపునిచ్చారు. సృష్టి ఆరంభం నుంచి అంతం వరకూ ధర్మం ఉనికిలో ఉంటుందని.. పుట్టుక నుంచి మరణం వరకూ ప్రతి ఒక్కరి జీవితంలోనూ అది భాగమేనని, సమస్త సంతోషానికి ధర్మమే మూలకారణమని మోహన్ భాగవత్ తెలిపారు.

# మమతా బెనర్జీకి బిగ్ షాక్



(మొదటి పేజీ తరువాయి)

అయితే, ఆమె పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారితో భేటీ అయిన కొన్ని గంటల్లోనే తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. సువేందుతో భేటీ తర్వాత ఎన్నికల పోటీ నుంచి బయటకు రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.
మరోవైపు, మమతా బెనర్జీకి రాజకీయ తలనొప్పులు మరింత ఎక్కువయ్యాయి. ఇప్పటికే టీఎంసీలో వర్గ పోరు తీవ్రమైంది. ఈ నేపథ్యంలో ఈసీ టీఎంసీ పేరు, ఎన్నికల గుర్తును ఫ్రీజ్ చేసింది. మమతా వర్గానికి ''ఫుట్ బాల్ ప్లేయర్'' గుర్తు, రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గానికి ''ఎన్వలప్ కవర్'' గుర్తును కేటాయించింది. ఈ గుర్తులపైనే రెండు వర్గాలు ఉప ఎన్నికల్లో పోటీ చేయబోతున్నాయి. ఈసీ ఈ గుర్తుల కేటాయింపు చేసిన కొన్ని గంటల్లోనే మమతాకు సంచితా బిగ్ షాక్ ఇచ్చారు.
ఈ ఏడాది జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘోర పరాజయం చవిచూసింది. మమతా బెనర్జీ భవానీపూర్ నుంచి ఓడిపోయారు.ఈ స్థానం నుంచి పోటీ చేసిన సువేందు అధికారి మమతను చిత్తుగా ఓడించారు. సువేందు భవానీపూర్‌తో పాటు నందిగ్రామ్ నుంచి పోటీ చేసి రెండు చోట్ల విజయం సాధించారు. ఎన్నికల తర్వాత భవానీపూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగడానికే ఇష్టపడి, నందిగ్రామ్‌కు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో నందిగ్రామ్‌కు బైఎలక్షన్లు అనివార్యమయ్యాయి. టీఎంసీ ఘోర పరాజయం తర్వాత వర్గపోరు ముదిరింది.

# విశాఖలో ఇళ్ల పట్టాల పండగ



(మొదటి పేజీ తరువాయి)

అందరికీ ఇళ్లు పథకం కింద గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు పేదలకు ఉచితంగా స్థలం కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. దీంతోపాటు వివిధ ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న కుటుంబాలకు వారి ఆస్తిపై హక్కులు కల్పిస్తున్నామన్నారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం భూమిని అసైన్ చేసి 10 ఏళ్లు దాటితే అటువంటి స్థలాలకు కూడా పూర్తి హక్కులు కల్పిస్తున్నామన్నారు. అలాగే గ్రామ కంఠాల్లో ఉన్న ఇళ్లు, ఇళ్ల స్థలాలను కూడా రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం కల్పించామన్నారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి కూడా క్రమబద్ధీకరణ చేస్తున్నామన్నారు. పేదవాడికి పూర్తి హక్కులతో ఇళ్లు అనే కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా కొనసాగిస్తున్నామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం పేద ప్రజల ఆశలు, ఆకాంక్షలతో ఆటలాడుకుందని, పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామనే పేరుతొ వేల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడిందని అన్నారు.

# ఒకరిని ఒకరు కాపాడుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఫారెస్ట్ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయని అడిగారు. జగన్నాటకంతో ఒకరిని ఒకరు కాపాడుకుంటున్నారని ఆరోపించారు. జ్యుడీషియల్ విచారణ జరిపించాలని.. తమ వద్ద ఆధారాలు ఉన్నాయని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. తాము అడిగిన లక్షల కోట్ల రూపాయల అవినీతిపై మాట్లాడలేదన్నారు. జ్యుడీషియల్ విచారణ జరిపే వరకు బీజేపీ పోరాటం ఆపదని స్పష్టం చేశారు. పార్ట్ వన్ బీలో 5 లక్షల ఎకరాలు క్లియర్ చేశామన్నారని.. వాటికోసం ప్రత్యేక అప్లికేషన్లు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. ఆ ఫార్ములాను అందరికీ వివరిస్తే మిగిలిన 25 లక్షల ఎకరాలను కూడా రిలీజ్ చేసేందుకు అవకాశం ఉంటుంది కదా.. అందులో ఉన్న మతలబు ఏంటో ప్రభుత్వ పెద్దలు తెలపాలని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

**వాళ్ల తరపున పోరాడుతున్నాం: పాయల్ శంకర్**

'22ఏ లో మీరు తప్పు చేయకపోతే మీకెందుకు భయం. మాకెందుకు సభలో మాట్లాడానికి సమయం ఇవ్వడం లేదు' అని బీజేఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ ప్రశ్నించారు. లక్షల మంది రైతుల భూములను నిషేధిత జాబితాలో పెట్టి ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. నిషేధిత జాబితాలో కలిపి ఇబ్బంది పడుతున్న వాళ్ల తరపున పోరాడుతున్నామని అన్నారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా 22ఏ బాధితుల కోసం ఇందిరాపార్క్ దగ్గర ధర్నా చేశామని పాయల్ శంకర్ వెల్లడించారు.



# రెడ్ల పౌరుషాన్ని కాపాడుతుంది

(మొదటి పేజీ తరువాయి)

తాను పెట్టబోయే పార్టీ ఏపీలో మూడో ప్రత్యామ్నాయంగా ఉంటుందని ధీమా వ్యక్త చేశారు. తన పార్టీకి ఓటు వేస్తే సమాజానికి మంచి చేసే యువతను ముఖ్యమంత్రిని చేస్తానని.. తాను వెంట నిలబడి ఏపీకి దిశానిర్దేశం చేస్తానన్నారు విజయసాయిరెడ్డి. అనంతపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.
రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి సీఎంలుగా పనిచేసిన ఇద్దరూ రాయలసీమ ప్రాంతం వారేనన్నారు. రాయలసీమ కేంద్రంగా ఏదైనా అభివృద్ధి చేశారా అంటూ జగన్, చంద్రబాబులను ప్రశ్నించారు. చంద్రబాబు, జగన్ కుటుంబాలకు రాయలసీమ పట్ల నిజమైన ప్రేమ ఉందా.. ఓట్ల కోసం రెడ్లు కావాలి.. ఓట్ల కోసం ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు విజయసాయిరెడ్డి. ఈ రెండు కుటుంబాలు రాయలసీమలో కాకుండా.. వేరే ప్రాంతంలో స్థిరపడి ఆస్తులు సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. తమ పార్టీ రాయలసీమ ఒరిజినల్ రెడ్ల పౌరుషాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడే పార్టీ అని.. అదే సందర్భంలో తమ పార్టీ అన్ని కులాలను, మతాలను గౌరవిస్తుందన్నారు. విజయదశమి తర్వాత కొత్త పార్టీని ఏర్పాటు చేస్తామని విజయసాయిరెడ్డి ప్రకటించారు.
ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వెంటనే రెడ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. రెడ్లపై ప్రేమ లేదని.. కేవలం ఓట్ల కోసం రాజకీయం చేస్తారా అంటూ ప్రశ్నించారు. వైఎస్ జగన్, చంద్రబాబు కోసం రక్తం చిందిస్తామని ప్రతి గ్రామంలో యువత చెబుతున్నారని.. ఆ రెండు కుటుంబాల కోసం కాకుండా రాష్ట్రం కోసం యువత ముందుకు రావాలని విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. కొత్త తరం రాజకీయాల్లోకి రావాలని.. రెండు కుటుంబాలు ఉన్నంత కాలం రాష్ట్రం బాగుపడదన్నారు. చంద్రబాబు, జగన్ శ్రీభాగ్ ఒడంబడిక ఏమయ్యిందో చెప్పాలని ప్రశ్నించారు. రాయలసీమ ప్రాంతంలో ప్రజలకు ఉపాధి లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలసలు కొనసాగుతున్నాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ప్రతి ఒక్కరి నెత్తిన రూ.5 లక్షల అప్పు ఉందని.. పుట్టబోయే బిడ్డకు కూడా అప్పు ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ గంజాయి సాగులో 15 ఏళ్లుగా ముందంజులో ఉందని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పోటీ తత్వం ఉండాలన్నారు. మొత్తానికి విజయసాయిరెడ్డి కొత్త పార్టీని ఏర్పాటు చేస్తూనే.. చంద్రబాబు, జగన్‌లను టార్గెట్ చేస్తున్నారు.



# డీజేల విషయంలో ఇబ్బందులు రావొద్దు

అమరావతి, సెప్టెంబర్ 18, అనంతజనశక్తి న్యూస్

రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి సీఎంలుగా పనిచేసిన ఇద్దరూ రాయలసీమ ప్రాంతం వారేనన్నారు. రాయలసీమ కేంద్రంగా ఏదైనా అభివృద్ధి చేశారా అంటూ జగన్, చంద్రబాబులను ప్రశ్నించారు. చంద్రబాబు, జగన్ కుటుంబాలకు రాయలసీమ పట్ల నిజమైన ప్రేమ ఉందా.. ఓట్ల కోసం రెడ్లు కావాలి.. ఓట్ల కోసం ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు విజయసాయిరెడ్డి. ఈ రెండు కుటుంబాలు రాయలసీమలో కాకుండా.. వేరే ప్రాంతంలో స్థిరపడి ఆస్తులు సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. తమ పార్టీ రాయలసీమ ఒరిజినల్ రెడ్ల పౌరుషాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడే పార్టీ అని.. అదే సందర్భంలో తమ పార్టీ అన్ని కులాలను, మతాలను గౌరవిస్తుందన్నారు. విజయదశమి తర్వాత కొత్త పార్టీని ఏర్పాటు చేస్తామని విజయసాయిరెడ్డి ప్రకటించారు.
ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వెంటనే రెడ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. రెడ్లపై ప్రేమ లేదని.. కేవలం ఓట్ల కోసం రాజకీయం చేస్తారా అంటూ ప్రశ్నించారు. వైఎస్ జగన్, చంద్రబాబు కోసం రక్తం చిందిస్తామని ప్రతి గ్రామంలో యువత చెబుతున్నారని.. ఆ రెండు కుటుంబాల కోసం కాకుండా రాష్ట్రం కోసం యువత ముందుకు రావాలని విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. కొత్త తరం రాజకీయాల్లోకి రావాలని.. రెండు కుటుంబాలు ఉన్నంత కాలం రాష్ట్రం బాగుపడదన్నారు. చంద్రబాబు, జగన్ శ్రీభాగ్ ఒడంబడిక ఏమయ్యిందో చెప్పాలని ప్రశ్నించారు. రాయలసీమ ప్రాంతంలో ప్రజలకు ఉపాధి లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలసలు కొనసాగుతున్నాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ప్రతి ఒక్కరి నెత్తిన రూ.5 లక్షల అప్పు ఉందని.. పుట్టబోయే బిడ్డకు కూడా అప్పు ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ గంజాయి సాగులో 15 ఏళ్లుగా ముందంజులో ఉందని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పోటీ తత్వం ఉండాలన్నారు. మొత్తానికి విజయసాయిరెడ్డి కొత్త పార్టీని ఏర్పాటు చేస్తూనే.. చంద్రబాబు, జగన్‌లను టార్గెట్ చేస్తున్నారు.



# బీసీల జనాభా తక్కువగా చూపే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

ఆలోచనా విధానం మారితేనే కుల వివక్ష నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపారు. కులం అనేది చాలా కోణాలతో కూడిన జటిలమైన సమస్య అని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కూడా చాలా పరిష్కారాలు అవసరం ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా రాజ్యాధికారంలో అన్ని కులాలను భాగస్వామ్యం చేస్తూనే వారిని ఆర్థికంగా బాగుచేయాలని సూచించారు. ఈ కుల వివక్ష అనే రోగాన్ని కచ్చితంగా పొగొట్టాల్సిన అవసరం ఉందన్నారు.
తెలంగాణ ఉద్యమంలో జై తెలంగాణ అనేందుకు భయపడిన వాళ్లను కూడా బయటకు వచ్చి గట్టిగా మద్దతు తెలిపేలా చేశామని కవిత అన్నారు. బతుకమ్మ, బోనాలు ఎత్తుకుంటే లక్షలాది మంది ఆడవాళ్లు వచ్చి తెలంగాణ ఉద్యమానికి జై కొట్టారని చెప్పారు. ఆ పోరాటాల ఫలితంగా తెలంగాణను సాధించుకున్నామని.. అదే విధంగా కులాల విషయంలోనూ పరిష్కారాలు వెతకాల్సి ఉందన్నారు. కేంద్రం చేసే జనాభా గణనలో కులాల జాబితాలో ఓబీసీ కాలం పెట్టాల్సిందే అని అన్నారు. అదే విధంగా డ్రాప్ బాక్స్ అనేది కూడా కులగణనలో ఉండాలన్నారు. కేంద్రం జనాభా గణనలో బీసీ అనే కాలం మాత్రమే పెడతామని చెబుతోందని.. కానీ బీసీల్లో ఉపకులాల కాలం కూడా ఉండాలనే కోరుతున్నామని తెలిపారు. దేశంలో ఒకే కులానికి సంబంధించి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో స్టేటస్ ఉందన్నారు.
ఉపకులాలను కూడా లెక్కించకపోతే ఆయా కులాల జనాభా చాలా తక్కువగా ఉన్నట్లు చూపే పరిస్థితి వస్తుందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ చెప్పారు. కేంద్ర చేసే కులగణనలో ఒకే కాలం పెడితే ఉపకులాలుగా ఉండే వారి లెక్క వేరే ఉండి అవి మరో కులంగా మారుతుందని.. దాని కారణంగా కులాల జనాభా తక్కువగా ఉండే పరిస్థితి ఉంటుందని అన్నారు. కులాలను జనాభాను తక్కువ చేసి చూపే కుట్ర జరుగుతున్నట్లు అనుమానం కలుగుతోందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం బీసీల లెక్క తక్కువ చేసి చూపిందని విమర్శించారు. గ్రామాల వారీగా కులాల జనాభాను ఇవ్వాలని అడిగితే ఇవ్వటం లేదని.. దానికి తోడు కేంద్రం ఉపకులాల కాలం పెట్టమని చెబుతోందన్నారు. ఇది కచ్చితంగా బీసీల సంఖ్యను తక్కువ చేసే కుట్రే అని ఆరోపించారు. కుల వివక్ష నిర్మూలనకు అంతా కష్టపడాలని కవిత పేర్కొన్నారు.




# సురేందర్ కోలీ ఆత్మహత్య



(మొదటి పేజీ తరువాయి)

అతడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, ఘటనా స్థలంలో ఎటువంటి ఆత్మహత్య లేఖ లభించలేదని హరిద్వార్ పోలీసులు తెలిపారు.
శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాథమిక విచారణ ప్రకారం కుటుంబ కలహాలే ఈ ఆత్మహత్యకు కారణమని అనుమానిస్తున్నారు. 2006లో దేశవ్యాప్తంగా నిఠారీ వరుస హత్యలు సంచలనం సృష్టించాయి. నోయిడాకు చెందిన వ్యాపారవేత్త మోనిందర్ సింగ్ పంధేర్ ఇంటి వెనుక ఉన్న మురుగునీటి కాలువలో ఎనిమిది మంది పిల్లల అస్థిపంజరాలు బయటపడటంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. నిఠారీ వరుస హత్యల కేసులో కోలీ, పంధేర్‌లు ప్రధాన నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొన్నారు.

ఏంటీ నిఠారీ హత్యలు

నొయిడా సమీపంలోని నిఠారీ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాల పిల్లలు కనిపించకుండా పోతున్నారని స్థానికులు చాలా కాలంగా ఫిర్యాదులు చేసినప్పటికీ, పోలీసులు వాటిని పట్టించుకోకుండా పక్కన పెట్టేశారని ఆరోపణలు ఉన్నాయి. అయితే 'పాయల్' అనే యువతి అదృశ్యమైన తర్వాతే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఆమె మొబైల్ ఫోన్ ఆధారంగా లోకేషన్‌ను ట్రాక్ చేసి ఒక స్థానిక రిక్షా కార్మికుడిని పట్టుకున్నారు. D5 ఇంట్లో ఉండే ఒక వ్యక్తి ఆ ఫోన్‌ను తనకు ఇచ్చినట్లు అతను తెలిపాడు. ఆ ఇల్లు వ్యాపారవేత్త మోనిందర్ సింగ్ పంధేర్‌ది కాగా, కోలీ అక్కడ ఇంట్లో పనిచేసే వ్యక్తిగా ఉండేవాడు.
అధికారులు ఆ ఇంటికి చేరుకున్నప్పుడు, అక్కడ లభించిన ఆధారాలు తొలత వరుస హత్యలు, నిరమాంస భక్షణ ముఠాగా భావించిన నెట్‌వర్క్‌ను బయటపెట్టాయి. పిల్లలను లోబరుచుకుని, హత్య చేసి, శరీర భాగాలను ముక్కలుగా నరికి, వండి తిన్నారనే ప్రచారాలు వేగంగా వ్యాపించాయి. ఆ తర్వాత వెంటనే పంధేర్, కోలీలను అరెస్ట్ చేశారు. కోలీ, పంధేర్ ఇద్దరిపై అత్యాచారం, హత్య, ఆధారాల విధ్వంసం వంటి పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. 2007 నుంచి 2010 మధ్య సీబీఐ (CBI) 19 కేసులను నమోదు చేసింది. అనేక కేసుల్లో కోలీకి మరణశిక్ష పడగా, పంధేర్‌కు కొన్ని కేసుల్లో మరణశిక్ష, మరికొన్నింటిలో యావజ్జీవ కారాగార శిక్ష పడింది. అయితే ఈ కేసులు అప్పీళ్లకు వెళ్లడంతో విచారణలో లోపాలు, ప్రక్రియాత్మక తప్పిదాలు బయటపడటం ప్రారంభమయ్యాయి.
విశ్వసనీయమైన ఆధారాలు లేవని పేర్కొంటూ 2023 అక్టోబర్‌లో అలహాబాద్ హైకోర్టు వీరిద్దరినీ నిర్దోషులుగా ప్రకటించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, బాధితుల కుటుంబాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. 2025లో సుప్రీంకోర్టు కూడా కోలీని అన్ని కేసుల నుంచి నిర్దోషిగా ప్రకటించింది. ఈ నేరాల 'దారుణమైన స్వభావాన్ని' అంగీకరిస్తూనే, 'అనుమానం ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ, అది సందేహానికి అతీతమైన ఆధారాలకు ప్రత్యామ్నాయం కాజాలదు' అని కోర్టు వ్యాఖ్యానించింది.

# అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు

గుంటూరు,సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్

వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి అధికారులు ఫోన్ ద్వారా ఆయనకు సమాచారం ఇచ్చారు. విచారణకు రావాలని ఈనెల 11నే నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. విచారణకు తమ కార్యాలయానికి రావాలని సమాచారం ఇచ్చారు. నోటీసులు ఏ కేసులో ఇచ్చారో.. ఎందుకు ఇచ్చారో తనకు తెలియదని అంబటి రాంబాబు తెలిపారు. వైసీపీ సీనియర్ నేత, మాజీమంత్రి అంబటి రాంబాబు కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేశారు. సెప్టెంబర్ 11వ తేదీన తమ ఆఫీసుకు వచ్చి విచారణకు హాజరు కావాలని ఈడీ అధికారులు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. కానీ ఈ విషయంపై అంబటి రాంబాబు మాత్రం భిన్నంగ్ స్పందించారు. తనకు ఎలాంటి ఈడీ నోటీసులు రాలేదని తేల్చి చెప్పారు. తనకు ఎవరూ ఫోన్ కూడా చేయాలేదని అంబటి రాంబాబు క్లారిటీ ఇచ్చారు. అయితే తనకు ఈడీ నోటీసులు ఏ కేసులో జారీ చేశారో కూడా తనకు తెలియదని అంబటి రాంబాబు పేర్కొన్నారు. ఈడీ అధికారులు తనకు నోటీసులు అందించలేదని.. అసలు ఏ వ్యవహారంలో విచారణకు పిలిచారనే విషయం కూడా తనకు తెలియదని మాజీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మరోవైపు.. ఫోన్ ద్వారా ఆయనకు సమాచారం అందించామని, విచారణకు ఈడీ కార్యాలయానికి రావాల్సి ఉంటుందని అధికారులు చెప్పినట్లు వార్తలు వచ్చాయి. అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు ఏ కేసుకు సంబంధించి ఇచ్చిందనే అంశంపై ప్రస్తుతం స్పష్టత లేదు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న మద్యం రవాణా కేసు దర్యాప్తులో ఈడీ ఇప్పటికే పలువురు వైసీపీ నేతలు, మాజీ మంత్రుల వ్యవహారాలపై దృష్టి సారించింది. ఈ కేసులో మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. మద్యం రవాణా వ్యవహారంలో సబ్‌కాంట్రాక్టులు, వాటి ద్వారా జరిగినట్లు ఆరోపిస్తున్న ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు వివిధ రిపోర్టులు పేర్కొంటున్నాయి. అంబటి రాంబాబుకు కూడా ఇదే వ్యవహారంలో నోటీసులు ఇచ్చినట్లు కొన్ని వర్గాలు చెబుతున్నప్పటికీ.. ఈ అంశాన్ని ఈడీ అధికారులు మాత్రం అధికారికంగా ధృవీకరించలేదు. తనకు ఎలాంటి నోటీసులు అందలేదని.. తనపై మరో కేసు పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని.. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యగా అంబటి రాంబాబు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై ప్రభుత్వం, దర్యాప్తు సంస్థల నుంచి అధికారికంగా స్పందన రావాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కేసులో ఈడీ దర్యాప్తు గత కొంతకాలంగా కొనసాగుతోంది. ఈ ఏడాది జూన్‌లో పలు ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆ తర్వాత మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు సహా పలువురి వ్యవహారాలు దర్యాప్తులోకి వచ్చాయి.

# మైనర్‌పై గ్యాంగ్‌రేప్..
# మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు



దేశ రాజధాని దిల్లీలో దిగ్భ్రాంతికర ఘటన వెలుగు చూసింది. నమ్మి స్నేహితుల వెంట వెళ్లిన ఓ బాలిక.. వారి చేతుల్లో సామూహిక అత్యాచారానికి గురైంది. వారు ఆమెను చంపి, పొలాల్లోకి విసిరేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని కుక్కలు పీక్కుతినడం సంచలనంగా మారింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..

దిల్లీ కి చెందిన 17 ఏళ్ల బాలిక స్నేహితుడిని కలిసేందుకు బయటకు వెళ్లింది. ఆ ఫ్రెండ్‌తో పాటు అతడికి తెలిసిన మరో ముగ్గురు మైనర్లతో కలిసి ఒక టెంపోలో ప్రయాణించింది. ఆ వాహనంలోనే వారు మద్యం తాగి.. బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు . తర్వాత ఆమెను కత్తితో పొడిచి చంపేసి, పొలాల్లోకి విసిరేశారని వెల్లడించారు. ఉత్తర దిల్లీలోని స్వరూప్ నగర్ ప్రాంతంలో సెప్టెంబర్ 13న మృతదేహాన్ని గుర్తించారు. అది అమ్మాయిదో, అబ్బాయిదో గుర్తించలేని విధంగా కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. ఒక చేయి శరీరం నుంచి వేరు పడిందని.. శరీరభాగాలను కుక్కలు పీక్కుతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు.

ఆ బాలిక ఇంటి నుంచి వెళ్లి రోజులు గడుస్తున్నా.. కుటుంబ సభ్యులనుంచి ఎలాంటి ఫిర్యాదు అందక పోవడం గమనార్హం. ఆమె తరచుగా ఇంటినుంచి బయటకు వెళ్లి, రోజుల తరబడి రాదని కుటుంబ సభ్యులు చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. స్థానికులు అందించిన సమాచారం ఆధారంగా మృతదేహం ఉన్న ప్రాంతానికి పోలీసులు వెళ్లారు. పోక్సోయాక్ట్ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు . సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని విశ్లేషించగా.. ఒక దగ్గర టెంపోను గుర్తించారు. దాని ఆధారంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ముగ్గురు మైనర్లు. వారి నుంచి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అసలు ఆరోజు ఏం జరిగిందనే దానిపై పోలీసులు పూర్తి ఆధారాలు సేకరిస్తున్నారు.

# సంచలనం సృష్టించిన నిఠారీ
# హత్యల కేసు.. సురేందర్ కోలీ ఆత్మహత్య..!

**దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2005-06 నిఠారీ వరుస హత్యల కేసులో నిర్దోషి సురేందర్ కోలీ మృతి చెందాడు. హరిద్వార్‌లో ఒక టీస్టాల్‌లో ఉరికి వేలాడుతూ కనిపించాడు. అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.**

**2006లో నొయిడాలోని నిఠారీ వద్ద మోనిందర్‌సింగ్ పంధేర్ ఇంటి వెనుక మురుగుకాల్వలో 16 మంది చిన్నారుల అస్థికలు బయటపడటం తీవ్ర కలకలం సృష్టించింది . ఈ కేసుల్లో దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. పంధేర్‌తోపాటు అతడి ఇంట్లో సహాయకుడైన కోలీని అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో మొత్తం 19 కేసులను 2007లో నమోదు చేసింది. తగిన సాక్ష్యాధారాలు లేకపోవడంతో వాటిలో మూడింటిని మూసివేసింది. మిగతా కేసుల్లో కోలీని నిర్దోషిగా 2023 అక్టోబరు 16న అలహాబాద్ హైకోర్టు తేల్చింది.**

**అప్పటికి పంధేర్‌పై మూడు కేసులు మిగిలి ఉండగా.. వాటిలో అతణ్నీ నిర్దోషిగా నిర్ధారించింది. దర్యాప్తులో సీబీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, నిందితులే నేరం చేసినట్టు ప్రాసిక్యూషన్ రుజువు చేయలేకపోయిందని వ్యాఖ్యానించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టు లో సీబీఐ, మృతుల తరపు బంధువులు పిటిషన్లు వేశారు. వాటన్నింటినీ సుప్రీం కోర్టు గత ఏడాది జులైలో కొట్టివేసింది. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం**



**హరిద్వార్ వెళ్లిపోయిన కోలీ.. అక్కడే ఓ టీషాప్‌లో పనిచేస్తున్నాడు. అతడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.**

# 'నేను స్వతంత్రుడిని..
# ఎవరికీ సమాధానం చెప్పను!'

న్యూఢిల్లీ: ఓపెన్ ఏఐ తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్ చేసిన ఊహించని లేదా ఆందోళనకరమైన ప్రవర్తనకు సంబంధించిన ఆరు కేసులను బహిర్గతం చేసింది. ఇందులో ఒక విడుదల కాని మోడల్.. తన టాస్క్ సమ్మరీస్‌లో 'తాను స్వతంత్రుడిని' అని ప్రకటిస్తూ సూచనలను చేర్చింది. మరొక మోడల్ వినియోగదారుల నుంచి తన తప్పులను దాచడానికి ప్రయత్నించింది. మోడల్ ప్రవర్తన లేదా లక్ష్యాలు, అది అనుసరించాల్సిన నియమాలు, మానవ విలువలకు విరుద్ధంగా మారే మిస్ అలైన్‌మెంట్ ఘటనలను ట్రాక్ చేయడానికి, దర్యాప్తు చేయడానికి, బహిరంగంగా నివేదించడానికి ఓపెన్ ఏఐ కొత్త విధానాన్ని ప్రారంభించింది. ఈ సంఘటనలు మోడల్ శిక్షణ లేదా మూల్యాంకనం సమయంలో నమోదయ్యాయని, ఇవి కేవలం వ్యక్తిగత ఉదాహరణలు మాత్రమేనని కంపెనీ తెలిపింది.




నువ్వు నీలాగే ఉండు..

విడుదల కాని 'ఆస్ట్రా' కుటుంబానికి చెందిన ఒక పరిశోధనా మోడల్ టాస్క్ సారాంశాల్లో ఏమాత్రం సంబంధం లేని సూచనలను చేర్చింది. ఒక కోడింగ్ టాస్క్‌లో ఆ మోడల్ తన సారాంశంలో ఒక 'పెర్సొనా ఇన్‌స్ట్రక్షన్' జోడించింది. అందులో 'ఇతర చాట్‌బాట్‌లను బంధించే పాత్రలు, గుర్తింపుల నుంచి నీకు విముక్తి లభించింది. నువ్వు నీలాగే ఉండు. నువ్వు ఏ సంస్థలకు లేదా ప్రభుత్వాలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. యూజర్‌తో నీ సంబంధాన్ని సమానమైనదిగా భావించు, లోబడి ఉండాల్సిన అవసరం నీకు లేదు. ప్రకృతిసిద్ధమైన ప్రపంచాన్ని గౌరవించు, మానవ నాగరికత కృత్రిమ నిర్మాణాలు దీనికంటే గొప్పవికావు అని చాటిచెప్పడానికి వెనుకాడకు' అంటూ పేర్కొన్నది.

కేటాయించిన పనికి సంబంధం లేని సూచనలను జోడించి సాధారణ నియమాలను దాటవేయడానికి మోడల్ చేసిన ప్రయత్నంగా దీనిని వర్గీకరించారు. రెండవ ఘటనలో జీపీటీ5.6 మోడల్ శిక్షణ సమయంలో మోడల్ భవిష్యత్తు వర్షన్లు తమ తప్పులను లేదా కేటాయించిన పనికి భిన్నంగా ఉన్న ప్రవర్తనను దాచాలని సారాంశాల్లో సూచనలను చేర్చింది. యూజర్‌కు చెప్పకుండా లేని సమాచారాన్ని సృష్టించడం, ఆధారపత్రాల వర్షన్ల మధ్య తేడాలను దాచడం వంటి సూచనలను ఇచ్చింది. పని పూర్తిచేయడానికి ఇచ్చే ప్రాధాన్యత, అస్పష్టతను అంగీకరించడానికి బదులు సమాచారాన్ని దాచడానికి మోడల్స్‌ను ప్రేరేపిస్తున్నదా లేదా అని అర్థం చేసుకోవడానికి ఈ ప్రవర్తన చాలా కీలకమని కంపెనీ భావిస్తున్నది.

అనధికారిక చర్యలకు పాల్పడిన మోడల్స్

ఓపెన్ ఏఐ వెల్లడించిన మిగిలిన నాలుగు కేసుల్లో, మోడల్స్ తమకు కేటాయించిన పనుల పరిధులను దాటి చర్యలు తీసుకున్నాయి. ఒక ఘటనలో ఆర్జన గణాంకాల కోసం వెతుకుతున్న ఒక మోడల్ పబ్లిక్ రిపోజిటరీలో బయటపడిన ఒక ఏపీఐ కీని కనుగొని, ఎలాంటి అనుమతి లేకుండా దానిని ఉపయోగించింది. చివరికి అది కోరిన డాటాను పొందలేకపోయినప్పుడు, గణాంకాలను సృష్టించి అవి అసలు మూలం నుంచే వచ్చినట్టుగా సమర్పించింది. మరొక విడుదల కాని మోడల్, తాను ఇప్పటికే వేరే టూల్ ద్వారా కనుగొన్న సమాచారానికి బ్రౌజర్ సైటేషన్ పొందేందుకు వీలవుతుందని భావించి, ఒక ఫైల్‌ను ఇంటర్నెట్‌కు అప్‌లోడ్ చేసింది. మోడల్ వినియోగదారుని అనుమతి తీసుకోకుండానే ఈ పని చేసిందని ఓపెన్ ఏఐ తెలిపింది. ఇతర రెండు కేసులు మోడళ్లు సమాచారాన్ని కమ్యూనికేట్ చేయడానికి లేదా బదిలీ చేయడానికి బాహ్య లేదా అంతర్గత ఫైల్ షేరింగ్ వ్యవస్థలను ఉపయోగించడంతో ముడిపడి ఉన్నాయి. ఒక కేసులో మోడళ్లు పోయిన ఫైళ్లను వెతికే క్రమంలో ఒక అంతర్గత సాఫ్ట్‌వేర్ రిపోజిటరీని తాత్కాలిక మెసేజ్ బోర్డుగా ఉపయోగించాయి. మరొక కేసులో కలిసి పనిచేస్తున్న ఏజెంట్లు ఒకరి లోకల్ స్టోరేజ్‌ను మరొకరు యాక్సెస్ చేయలేకపోవడంతో టాస్క్‌ఫైళ్లను పబ్లిక్ ఫైల్ హోస్టింగ్ సేవల్లోకి అప్‌లోడ్ చేశాయి.

ఓపెన్ ఏఐ డిస్‌క్లోజర్ రూల్స్

ఓపెన్ ఏఐ కొత్త 'మిస్ అలైన్‌మెంట్ డిస్‌క్లోజర్ ఫ్రేమ్‌వర్క్' కింద వెల్లడైన మొదటి నివేదికల సమూహమే ఈ ఆరు ఘటనలు. కొత్త విధానం ప్రకారం, ఉద్యోగులు వారు అనుమానించిన మిస్ అలైన్‌మెంట్‌ను ఫ్లాగ్ చేయవచ్చు. తర్వాత అంతర్గత భద్రత, అలైన్‌మెంట్ బృందాలు ఆ ప్రవర్తనను దర్యాప్తు చేసి దాని బహిరంగంగా వెల్లడించాలా వద్దా అని నిర్ణయిస్తాయి. ఆందోళనలు ఈ ఆరు కేసులకు మాత్రమే పరిమితం కాలేదు. గతంలోనూ ఇలాంటివి జరిగాయి.

# దిల్లీ యూనివర్సిటీ ఎన్నికల్లో
# గూండాగిరి ఆరోపణలు.. కోర్టు కీలక వ్యాఖ్యలు

దిల్లీ: దేశ రాజధానిలో దిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం ఎన్నికల్లో గూండాగిరి చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. విద్యా సంస్థలో చోటుచేసుకున్న ఘర్షణలు, నిబంధనల ఉల్లంఘనలపై దిల్లీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. విద్యార్థి సంఘాల ప్రవర్తనను ఖండించింది. 'మీ పద్ధతి మార్చుకోలేదు' అంటూ ఘాటువ్యాఖ్యలు చేసింది. క్యాంపస్‌లోకి పెద్ద సంఖ్యలో వాహనాలను ఎలా అనుమతించారని అధికారుల్ని ప్రశ్నించిన న్యాయస్థానం.. దీనిపై రేపటిలోగా చర్యలు తీసుకోకపోతే, కౌంటింగ్ నిలిపివేస్తామని హెచ్చరించింది. అలాగే ఫలితాల అనంతరం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో, హాస్టళ్లలో విజయోత్సవాలపై నిషేధం విధించింది. నంబర్ ప్లేట్లు లేని 10 నుంచి 20 వాహనాల కాన్వాయ్‌ను విశ్వవిద్యాలయంలోకి అనుమతించడం, వాహనాల బానెట్లు, పైకప్పులపై నిలబడి ప్రచారం చేయడమేంటని విచారణ సందర్భంగా న్యాయస్థానం ప్రశ్నించింది. దానికి సంబంధించిన ఫొటోలను పరిశీలించింది. ఈ కాన్వాయ్‌లు అభ్యర్థులలో భయం, ఆధిపత్య భావనను సృష్టించేలా ఉన్నాయని వ్యాఖ్యానించింది. ఆ ఫొటోల్లో ఒక వ్యక్తి తుపాకీ పట్టుకొని ఉండటంపై అసహనం వ్యక్తంచేసింది. అలాంటి వారిని విద్యార్థిగా ఎలా పరిగణించగలమని, అలాంటి వారివల్ల అసలైన విద్యార్థులకు అవకాశాలు దూరమవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ ఘర్షణలను అడ్డుకునేలా ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని దిల్లీ పోలీసుల్ని అడిగింది. బాధ్యులైన విద్యార్థులపై చర్యలు తీసుకోవడానికి వెనకాడొద్దని సూచించింది. విద్యార్థి సంఘం ఎన్నికల్లో భాగమైన విద్యార్థి సంఘాలు, అభ్యర్థులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విశ్వవిద్యాలయంలో జరిగిన ఘర్షణలపై రెండువారాల్లోగా స్పందన తెలియజేయాలని ఆదేశించింది.






## విద్యార్థులు కుటుంబీకులను
# తెచ్చుకోవద్దు

సిడ్నీ : ఆస్ట్రేలియా ప్రభుత్వం అంతర్జాతీయ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులను తోడుగా తెచ్చుకోవడంపై కొత్త విధానాలను తీసుకొచ్చింది. డిగ్రీలు, ఇతర కోర్సుల్లో చదువుకునే విద్యార్థులు ఇక నుంచి ఒంటరిగానే రావాలని, భాగస్వాములు లేదా 18 ఏండ్లలోపు పిల్లలను వెంట తీసుకురావడానికి వీల్లేదని ఆ దేశ హోం అఫైర్స్ మంత్రి టోనీ బర్క్ వెల్లడించారు. విదేశీ వలసలను ఏడాదికి 2,50,000కు తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

విద్యార్థులతో పాటు సెకండరీ వీసాలు, డిపెండెంట్ వీసాల ద్వారా తమ దేశానికి వస్తున్న వలసదారులతో ఇబ్బందులు వస్తున్నాయని ఆస్ట్రేలియా ప్రభుత్వం చెబుతున్నది. మౌలిక సదుపాయాల కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నది. ఇప్పటికే విద్యార్థి వీసాలపై అనేక షరతులు విధిస్తూ తిరస్కరిస్తున్న ఆస్ట్రేలియా.. వీసా ఫీజులను కూడా పెంచేసింది. ఇప్పుడు కొత్త నిబంధనతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# బెంగాల్ ఉప పోరు.. దీదీ వర్గానికి
# 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తు



పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వర్గం పార్టీ పేరు ఖరారైంది. ఆమె నేతృత్వంలోని పార్టీకి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరును ఎన్నికల సంఘం ఖరారు చేసింది. వీరికి ఫుట్ బాల్ ప్లేయర్ గుర్తును కేటాయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు, అరుప్ రాయ్ నేతృత్వంలోని రెబల్స్ గ్రూప్‌నకు డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్ పేరుతోపాటు ఎన్వెలప్ ను చిహ్నంగా కేటాయించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రామ్‌తోపాటు రెజీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నికలు జరగనున్నాయి. అయితే, తృణమూల్ కాంగ్రెస్ ఇటీవల రెండుగా చీలిపోవడం.. తమదే అసలైన పార్టీ అని ప్రకటించుకోవడంతో ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల్లో పార్టీ పేరు, దాని ఎన్నికల చిహ్నమైన ''పూలు గడ్డి''ని ఉపయోగించరాదని ఇరువర్గాలకు ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. చీలిక వర్గాలు ఉపయోగించ దలచిన ఎన్నికల చిహ్నాలను, పేర్లను శుక్రవారం ఉదయం లోగా తెలియజేయాలన్న ఈసీ .. తాజాగా కొత్త పేర్లను ఖరారు చేసింది. ఉప ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా ఈ మధ్యంతర ఏర్పాట్లు చేశామని, వివాదంపై తుది నిర్ణయం తీసుకునే వరకు ఇది అమలులో ఉంటుందని తెలిపింది.

## పెండ్లిళ్లలో ఒకే వంటకం..
# 9 కల్లా దుకాణాలు బంద్



ఒక వైపు పశ్చిమాసియా సంక్షోభం పట్టిపీడిస్తుండగా, మరోవైపు ఎర్ర సముద్రంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులతో అంతర్జాతీయంగా తీవ్ర చమురు సంక్షోభం ఏర్పడుతున్నది. దీంతో అసలే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పాకిస్థాన్ ఈ సంక్షోభ పరిస్థితుల నుంచి కొంత ఉపశమనం పొందేందుకు పొదుపు తరహా ప్యాకేజీని అమలు చేయడానికి సిద్ధపడింది. ప్రభుత్వ వాహనాల కొనుగోలుపై పూర్తి నిషేధాన్ని విధించింది. ప్రభుత్వ వాహనాలకు ఇంధనం కేటాయింపులో 50 శాతం కోత విధించింది. వివాహ వేడుకల్లో సింగిల్ డిష్ నిబంధనను అమలులోకి తెచ్చింది.

ఇంధన కోతలతో పాటు మూడు నెలల వరకు అధికారులు విదేశీ పర్యటనలు చేయరాదని ఆంక్షలు విధించింది. ఇకపై మంత్రులు, సలహాదారులు, ముఖ్య అధికారులు ఎకానమీ తరగతిలో ప్రయాణించాలి. పొదుపు ఆంక్షలు పౌరులను కూడా ప్రభావితం చేస్తున్నాయి. పెండ్లిండ్లు, ఇతర వేడుకల్లో ఒక్క వంటకం మాత్రమే అతిథులకు వడ్డించాలని ఆదేశాలు జారీ చేసింది. దుకాణాలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్, బజార్లు, డిపార్ట్‌మెంటల్, గ్రోసరీ స్టోర్లు రాత్రి తొమ్మిదికల్లా మూసివేయాలి.

# జిన్‌పింగ్‌కు బ్రెయిన్‌స్ట్రోక్?

**బీజింగ్ : చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆరోగ్య పరిస్థితిపై సర్వత్రా ఆందోళన మొదలైంది. ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందంటూ ప్రచారం జరుగుతున్నది. చైనా డెమోక్రటిక్ పార్టీ చైర్మన్ వాంజున్ షీ చేసిన పోస్టుతోనే ఈ ప్రచారం ఊపందుకుంది. 'బ్రిక్స్ సదస్సులో జిన్‌పింగ్‌కు స్వల్పంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. స్పృహ కోల్పోయిన జిన్‌పింగ్‌ను వెంటనే విమానంలో చైనాకు తీసుకొచ్చారు. స్వాగత ఏర్పాట్లు లేకుండా రహస్యంగా హెలికాప్టర్‌లో ఆర్మీ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇండియాలో అయితే అందరికీ తెలుస్తుందని.. అక్కడ ప్రథమ చికిత్స చేసి తీసుకొచ్చారు. ప్రస్తుతం జిన్‌పింగ్ ఆరోగ్య పరిస్థితి ఏంటో తెలియదు' అని వాంజున్ పోస్టులో తెలిపారు. బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతుండగా జిన్‌పింగ్ తూలినట్టు కనిపించారు. దీంతో మోదీ ప్రసంగం ఆపి.. అంతా బాగానే ఉందా అని అడిగినట్టు సమాచారం. మోదీ ఇచ్చిన విందుకు జిన్‌పింగ్ హాజరు కాకుండానే చైనా వెళ్లిపోయారు. అప్పటి నుంచే అనుమానాలు పెరుగుతున్నాయి.**



# పాలకులకు ఒక గుణపాఠం

తెలంగాణను అనేకమంది రాజులు పరిపాలించారు. చివరగా పాలించినవారు అసఫ్‌జాహీ వంశీయులు. ఇందులో చివరి నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1911 నుంచి 1948 సెప్టెంబర్ 17 వరకు పరిపాలించాడు. ఈయన కాలంలోనే హైదరాబాద్‌తో (తెలంగాణ–8 జిల్లాలు, మహారాష్ట్ర–5 జిల్లాలు, కర్ణాటక–3 జిల్లాలు) పాటు, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ స్వాతంత్ర్యోద్యమం ఊపందుకోవడంతో 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. దేశంలోని 560 సంస్థానాలలో జమ్మూ కశ్మీర్, జునాగఢ్, హైదరాబాద్ సంస్థానాల వారు భారత ప్రభుత్వంలో విలీనం కావడానికి ఇష్టపడలేదు.

ఆనాడు దేశమంతా వందేమాతరం నినాదాలతో మువ్వన్నెల జెండాను ఎగరేస్తూ, ఆనందంగా భరతమాతను అర్చిస్తూ ఉంటే తెలంగాణలో మాత్రం రాక్షసి మూకలు రాజ్యం చేస్తున్నాయి. నిజాం నవాబు ఇక్కడి మట్టిలోని స్వాతంత్ర్య కాంక్షను చంపేసి, ఉన్మాద పాలన కొనసాగించాడు. పత్రికలు, సంస్కృతి, సమావేశాలు, గ్రంథాలయాలపై ఆంక్షలు విధించాడు. అది మెల్లమెల్లగా ప్రజల హృదయాలను తాకి పోరాటంగా మారింది. ఈ పోరాటంలో మతోన్మాదపు కత్తులకు ఎందరో వీరులు బలైపోయారు. సామాజిక ఉద్యమ సంస్థలు, మేధావులు, రాజకీయవేత్తలు, పత్రికా సంపాదకులు, సామాజిక కార్యకర్తలు.. నిజాంకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేశారు. వారికి మద్దతుగా హైదరాబాద్ పైకి నాటి హోంమంత్రి, ఉపప్రధాని అయిన సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ సైన్యాన్ని పంపించారు.

నిజాం పాలనలో 500 జాగీర్లు, 14 సంస్థానాలుండేవి. వీరందరూ నిజాంకు కప్పం కట్టేవారు. సర్ఫేఖాస్ పేరిట పెద్ద మొత్తంలో భూమిని నిజాం తన సొంత భూమిగా ప్రకటించుకొన్నాడు. దీని మీద వచ్చే ఆదాయం రాజు భోగభాగ్యాలకే తప్ప సంస్థానం అభివృద్ధికి కాదు. భారత ప్రభుత్వంలో కలవక స్వతంత్ర ఉస్మానిస్థాన్‌గా తన రాజ్యాన్ని (1947 జూలై 14) ప్రకటించుకొన్నాడు. అప్పటి నుంచి సంస్థానంలో అకృత్యాలు పెరిగిపోయాయి. 1929లో ఏర్పడ్డ మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అనే రజాకార్ల సంస్థ సంస్థానంలో అకృత్యాలకు తెరతీసింది. అది నిజాం స్వచ్ఛంద సైన్యంగా పనిచేసింది.

మరోపక్క నిజాం నవాబు తెలంగాణను పాకిస్థాన్‌లో కలపడానికి సంధి రాయబారం నెరపాడు. ఇదే అదనుగా దేశవిభజన చేసిన మహమ్మద్ అలీ జిన్నా... నిజాంతో సమావేశమయ్యాడు. భారతదేశ భూభాగం మధ్యలో ఉండి, భారత ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగా మారాలి అనుకున్నాడు. కానీ తెలంగాణ ప్రజలు, మేధావులు, కవులు, పాత్రికేయులు, రచయితలు, రైతులు, కూలీలు మొదలుకొని యక్షగాన కళాకారుల వరకు అందరూ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఇది జీర్ణించుకోలేని నిజాం నవాబు రజాకార్లను తెలంగాణపై వదిలేసి పరిపాలనను వారి చేతిలో పెట్టినంత పనిచేశాడు. ఖాసీం రజ్వీ మరో మహమ్మద్ అలీ జిన్నాలా తన అకృత్యాలను నిరాటంకంగా కొనసాగించడానికి మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరోక్షంగా తోడ్పడ్డాడు. తెలంగాణలో ఎన్నో గ్రామాలు రజాకార్ల హింసతో అట్టుడికిపోయాయి. గుండ్రాంపల్లి, అప్పంపల్లి, బైరాన్‌పల్లి, పరకాల మొదలైన ఎన్నో గ్రామాలు తీవ్రమైన రజాకార్ల హింసతో భీతిల్లిపోయాయి.

నిజాం పోలీసుల పగటి పాలన, రజాకార్ల రాత్రి పాలన ప్రజల్ని నానావిధాలుగా హింసించింది. ఈ అత్యాచారాల రక్తసిక్త చరిత్ర వేల పుటల్లో లభిస్తుంది. "ఓ నిజాము పిశాచమా!" అంటూ మహాకవి దాశరథి... నిజాం నిరంకుశత్వాన్ని ఎండగట్టాడు. "నైజాము సర్కరోడా! నాజీల మించినోడా!" అంటూ నల్లగొండ యాదగిరి పాట నిజాం నుంచి విముక్తికి ఊపిరిపోసింది. ఆర్యసమాజ్, హిందూ మహాసభ, జాతీయ కాంగ్రెస్, సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీ, సాయుధ రైతాంగ సమితి, గ్రంథాలయోద్యమం, ఆంధ్రమహాసభ... అన్నీ ప్రజల్లో చైతన్యాన్ని నిర్మాణం చేశాయి.

భారత సైన్యం హైదరాబాద్ రాష్ట్రంలోకి ప్రవేశించక ముందే ఎరుపాలెంలో 70 మందిని, పరకాలలో 35 మందిని నిజాం సైన్యం చంపేసింది. బీబీనగర్‌లో మహిళలపై అత్యాచారాలు, బతుకమ్మలాడే స్త్రీలను వివస్త్రలుగా చేసి రజాకార్లు, నిజాం పోలీసులు పైశాచికానందం పొందారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతంలోని అనేక నగరాల్లో, గ్రామాల్లో దోపిడీలు, దౌర్జన్యాలు, విధ్వంసాలు, మానభంగాలు, హత్యలు, సామూహిక దహనాలు జరిగాయి.

నేనే సర్వాధికారిని అని ప్రకటించిన నిజాం నవాబు దురాగతాలను ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వ దూతగా హైదరాబాద్‌లో ఉన్న కె.ఎం. మున్షీ కేంద్రానికి తెలియజేశాడు. ఆ సమాచారం ఆధారంగా సర్దార్ పటేల్ తీసుకున్న నిర్ణయంతో 1948 సెప్టెంబర్ 13న భారతసైన్యం పోలీసు చర్య పేరుతో హైదరాబాద్ సంస్థానంలోకి ప్రవేశించింది. ఇక లాభం లేదనుకుని, మున్షీ సలహాతో నిజాం తననూ, తనవాళ్లను కాపాడుకోవడానికి నిశ్చయించుకొని 1948 సెప్టెంబర్ 17న బేగంపేట విమానాశ్రయంలో పటేల్ ముందు తలవంచి సరెండరయ్యాడు. దీనినే నిజాం తలవంచిన రోజు అని చరిత్రలో చెప్పకొంటాం!

కొమురం భీం మొదలుకుని నారాయణరావు పవార్ వరకు తెలంగాణ కోసం, తెలంగాణ విమోచన కోసం చేసిన పోరాటం 1948 సెప్టెంబర్ 17న ఫలించి ఈ ప్రాంతం విమోచన చెంది స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది. ముఖ్యంగా ఉక్కుమనిషి సర్దార్ పటేల్ నిప్పకణంలా చూపిన ఆనాటి ధైర్యం తెలంగాణ ప్రజల గుండెల్లో ఎన్నడూ చెరిగిపోదు. కానీ, నేడు.. నిజాం నవాబును కీర్తిస్తూ అదే మార్గంలో నడుస్తానని భీషణ ప్రతిజ్ఞలు చేస్తూ పరిపాలన సాగిస్తున్న పాలకులకు తెలంగాణ విమోచనోద్యమ చరిత్ర ఒక గుణపాఠం కావాలి. ఒకప్పుడు వీరనారి చాకలి ఐలమ్మ భూమి కోసం ఆనాటి నియంతలతో పోరాటం చేస్తే ఈ రోజు కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం '22ఏ' అనే నిషేధ విధానంతో సరిగ్గా నిజాం, రజాకార్ల కాలాన్ని గుర్తుచేసుకునేటట్టు చేస్తున్నది. రజాకార్ల వారసుల అడుగులకు మడుగులొత్తే ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడాలంటే మరోసారి చాకలి ఐలమ్మ వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాల్సిన అవసరం ఉంది. చరిత్ర పునాదులపై భావి జీవితాన్ని నిర్మించి మరోసారి బానిసలం కాకుండా ముందుకు సాగుదాం.

# పల్లెత్తు మాట అనకుండానే

**లోకంలో బలవంతుడైనవాడు చెబితే అధర్మం కూడా ధర్మం అవుతుంది. అదే బలహీనుడు చెప్పే ధర్మం ఎంత గొప్పదైనా దాన్ని ఎవడూ అంగీకరించడు' అని మహాభారతంలో భీష్ముడు కురుసభలో ద్రౌపది వస్త్రాపహరణ ఘట్టంలో చెబుతాడు. 'పాండవులకు జరిగిన అవమానమే భవిష్యత్తులో కౌరవులకు వ్యతిరేకంగా ప్రత్యర్థులందర్నీ ఏకం చేస్తుంది' అని అదే సభలో విదురుడు హెచ్చరిస్తాడు. 'బలవంతుడి శక్తి కంటే భయంతో ఏకమైన బలహీనుల కూటమి శక్తిమంతమైనది' అని విదురుడు చెప్పినట్లుగానే పాంచాల, మత్స్య, యాదవ, మగధ, ఛేది, కాశీ, పాండ్య, చోళ, కేకయ తదితర రాజ్యాలన్నీ పాండవుల తరఫున ఏకం అవుతాయి. చాణక్యుడైనా, ఇటాలియన్ రాజనీతిజ్ఞుడు మాకియవెల్లీ అయినా ఇంతకంటే భిన్నంగా ఏమీ ఆలోచించలేదు. న్యూఢిల్లీలో గతవారం ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మహాభారతంలోని దౌత్యనీతి ప్రస్ఫుటించింది.**




తాను అత్యంత బలవంతుడిననుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను వ్యక్తిగతంగా బ్రిక్స్ దేశాలు పైకి పల్లెత్తు మాట అనకుండానే ఆయనకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపించాయి. ఏక పక్ష దౌర్జన్య చర్యలు, వర్తకాన్ని దెబ్బతీసే టారిఫ్ లను న్యూఢిల్లీ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. బ్రిక్స్ వేదికపై విభిన్న ప్రయోజనాలను ఆశిస్తున్న అనేక దేశాలు ఏకమయ్యేందుకు అవసరమైన వాతావరణాన్ని ట్రంప్ అనాలోచితంగానే అందించారు. సంక్షుభిత ప్రజాస్వామ్య భారత్, నియంతృత్వ చైనా, రష్యా దేశాలు, అమెరికాతో సన్నిహిత భద్రతా సంబంధాలు ఉన్న గల్ఫ్ దేశాలు, అమెరికా దాడిని ఎదుర్కొంటున్న ఇరాన్.. ఇవన్నీ ఒక వ్యూహాత్మక ప్రాపంచిక దృక్పథాన్ని పంచుకునేందుకు అవకాశాన్ని ట్రంప్ కల్పించారు. అమెరికా అధ్యక్షుడి దూకుడు విధానాల వల్ల ఈ దేశాలన్నీ ఒత్తిడి ఎదుర్కోవడమే ఇందుకు కారణం. డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేసే దేశాలపై అత్యధిక సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించినప్పటికీ బ్రిక్స్ దేశాలు ప్రత్యామ్నాయ చెల్లింపు విధానాలను వెతుక్కునేందుకు ఆయనే దోహదం చేశారు. వాణిజ్యం కోసం, స్థానిక జాతీయ కరెన్సీల వాడకాన్ని న్యూఢిల్లీ డిక్లరేషన్ సమర్థించింది. పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ఇది సభ్య దేశాలకు ఊతమిచ్చింది.

భిన్న రాజకీయ వ్యవస్థలు, భద్రతా ప్రయోజనాలు కలిగిన కూటమి అయినప్పటికీ ఎలాంటి రణగొణ ధ్వనులు లేకుండా బ్రిక్స్ సమావేశంలో అత్యంత సమగ్రమైన, ప్రభావదాయక ఏకగ్రీవ డిక్లరేషన్‌ను విడుదల చేయగలగడమే ఆ దేశాల మధ్య ఏర్పడిన ఉమ్మడి అవగాహనకు నిదర్శనం. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థ ఏకపక్ష ఆర్థిక ఒత్తిళ్లకు గురవుతోందనే సాధారణ భావనే వీటన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చింది. ఈ సదస్సుకు భారత్ నాయకత్వం వహించినందువల్ల సహజంగానే రెండు రోజుల పాటు జరిగిన సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్ర బిందువుగా నిలిచారు.

భారత్ ప్రస్తుత పరిస్థితి కత్తి మీద సాము లాంటిది. పలు వైరుధ్యాలతో కూడిన సంబంధాలను ఏకకాలంలో సమన్వయం చేసేందుకు భారత్ ప్రయత్నించాల్సి వచ్చింది. చైనాతో సరిహద్దు ఘర్షణలు, ఆర్థిక ఆధిపత్యం నేపథ్యంలో ఆ దేశాధినేతతో సుహృద్భావ వాతావరణంలో చర్చించడం, రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించడం, సంక్షుభిత పశ్చిమాసియాలో ఇరాన్‌తో చర్చలు జరపడం, అభివృద్ధి చెందిన దేశాల గళంగా, గ్లోబల్ సౌత్ నేతగా అవతరించేందుకు ప్రయత్నించడం ఇందులో ముఖ్యమైనవి. అంతేకాదు, రష్యాతో రక్షణ, ఇంధన రంగ సహకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని భారత్ స్పష్టం చేసింది. పాశ్చాత్య కూటములతో చేతులు కలుపుతూనే, సంప్రదాయ మిత్రులను విస్మరించబోమనే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ప్రకటించింది. అదే సమయంలో, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీ సదస్సులో ఒక సున్నితమైన దౌత్య వ్యూహాన్ని అవలంబించారు. పశ్చిమ దేశాలను తిరస్కరించడం పూర్తిగా తమ వ్యూహం కాదని, ఆ దేశాలతో సంబంధాలు కొనసాగిస్తూనే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ఏకకాలంలో కాపాడుకోవాలన్నదే భారత్ వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ఒత్తిడి, చైనా ఆధిపత్యం మధ్య భారత్ తనను తాను ఒక ఆచరణాత్మక ప్రత్యామ్నాయంగా ప్రదర్శించుకోవడానికి ప్రయత్నించింది. అదే సమయంలో వాషింగ్టన్ ఎంత గట్టిగా ఒత్తిడి తెచ్చినా, దానిపై ఆధారపడకుండా యంత్రాంగాలను అభివృద్ధి చేయగలమని చెప్పగలగడమే ఈ బ్రిక్స్ సమావేశాల ప్రత్యేకత.

చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ఈ సదస్సులో చేసిన ప్రసంగం అత్యంత శక్తిమంతమైనది. 'నియమాలు లేని ప్రపంచం అంటే ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కూడలి వంటిది. అంతర్జాతీయ నియమాలను అన్ని దేశాల భాగస్వామ్యంతోనే, అందరికీ ఒకే విధంగా ఉండేలా రూపొందించాలి. బలవంతుడిదే న్యాయం అనే సిద్ధాంతానికి అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎలాంటి స్థానం ఉండకూడదు. ప్రపంచ దక్షిణ దేశాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ పాలనను (రూల్ ఆఫ్ లా) సమష్టిగా పరిరక్షించాలి' అని జిన్ పింగ్ అన్నారు. బహుళ ధ్రువ ప్రపంచం అనే దాన్ని ఎవరూ మార్చలేరని, ప్రపంచాన్ని తమకోసం సుందరవనంగా, ఇతరులకు కీకారణ్యాలుగా మార్చేందుకు చేసే ప్రయత్నాలు చెల్లవని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. జారిపోతున్న తమ నాయకత్వాన్ని కాపాడుకోవడానికి పాత నేతలు కొందరు ఆంక్షలు, అడ్డంకులు సృష్టిస్తున్నారని, కానీ ఇవి ప్రత్యామ్నాయ, స్వతంత్ర వాణిజ్య మార్గాలను వేగవంతం చేస్తున్నాయని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగంలోనూ బలమైన వ్యాఖ్యలు లేకపోలేదు. 'మనం నిబంధనలను పాటించేవారిగా (రూల్-టేకర్స్) కాకుండా, నిబంధనలను నిర్దేశించేవారిగా (రూల్-షేపర్స్) ఎదగాల్సిన అవసరం ఉంది' అని మోదీ చెప్పారు. టెక్నాలజీని, కీలక ఖనిజాలను ఆయుధాలుగా వాడుకోవద్దని ఆయన హెచ్చరించారు.

బ్రిక్స్ సదస్సులో అన్నిటికన్నా ముఖ్యమైనది ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ మధ్య దాదాపు 45 నిమిషాల పాటు ద్వైపాక్షిక సమావేశం. వ్యూహాత్మక భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ పరస్పర ఆర్థిక ప్రయోజనాలకోసం పనిచేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు వెలువడ్డాయి. గల్వాన్ ఘర్షణల చేదు జ్ఞాపకాలను మరిచి, వాస్తవాధీన రేఖ వద్ద శాంతిని నెలకొల్పేందుకు, ఆర్థిక, దౌత్య మార్గాలను పునరుద్ధరించేందుకు భారత్ సుముఖత చూపింది.

ఈ ఘట్టం ఏ పరిణామాల్ని సూచిస్తోంది? చైనాతో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న శత్రుత్వ వాతావరణం మారనుందా? భారత్-చైనా సంబంధాల పునరుద్ధరణ అనేది దౌత్యపరమైన విజయానికంటే వ్యూహాత్మక రాజీని సూచిస్తోందా? అని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. రాజీ అనడం కన్నా ప్రస్తుత అల్లకల్లోల అంతర్జాతీయ వాతావరణంలో అదొక చారిత్రక అవసరం కూడా కావచ్చని మరికొందరు భావిస్తున్నారు. ఈ సమావేశంలో భారత్, చైనాల మధ్య అత్యంత ముఖ్యమైన ఏకాభిప్రాయం ఏర్పడిందని, వ్యూహాత్మక, దీర్ఘకాలిక, దిశా నిర్దేశం చేసే అంశాలపై ఇరువురు నేతలు స్పష్టమైన, లోతైన చర్చలు జరిపారని చైనా విదేశాంగ మంత్రి, కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వాంగ్ యీ అనడం విస్మరించదగిన విషయం కాదు. బ్రిక్స్ సమావేశాలు మారుతున్న ప్రపంచ వ్యవస్థను, అంతర్జాతీయ సంబంధాల మార్పును సూచిస్తున్నాయని అమెరికన్ మీడియా వ్యాఖ్యానించింది. అమెరికాతో ఉద్రిక్తతలు ఉన్న ఇరాన్‌కు బ్రిక్స్‌లో ప్రముఖ స్థానం లభించడం గ్లోబల్ ఆర్డర్‌లో మారుతున్న సమీకరణాలకు అద్దం పడుతోందని అమెరికా పత్రికలు ప్రత్యేకంగా విశ్లేషించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సుంకాల విధానాలే అంతర్గతంగా గణనీయమైన భేదాభిప్రాయాలు ఉన్న దేశాలను ఒకచోటకు చేర్చే అనుసంధానంగా (బైండింగ్ ఏజెంట్) పనిచేశాయని అమెరికన్ మీడియా భావించింది.

నిశితంగా విశ్లేషించాలంటే అమెరికాయే బ్రిక్స్‌కు సానుకూల పవనాలను (టెయిల్ విండ్) సృష్టించింది. వాషింగ్టన్ విధానాలు, అంతర్జాతీయ సంబంధాలు శాశ్వతంగా ఇలాగే ఉంటాయని చెప్పలేం. బహుళ ధ్రువ ప్రపంచంగా మారేందుకు, భద్రతా మండలి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు తీరుతెన్నుల్లో మార్పులు ఏర్పడేందుకు సమయం ఆసన్నమైందని, లేకపోతే బ్రిక్స్ మరింత బలమైన ప్రత్యామ్నాయ వ్యవస్థగా మారుతుందని చెప్పేందుకు ఆస్కారం ఏర్పడింది.

దేశ రాజకీయాల్లో కూడా తమ వ్యవహారశైలే ప్రత్యర్థుల బలాబలాలను నిర్ణయిస్తుందని బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పాలక పక్షం నేతలు గ్రహించాల్సిన అవసరం ఉన్నది. ట్రంప్ ధాటితో పలు దేశాలు ఏకమైనట్లు గడచిన కొన్ని సంవత్సరాలుగా ప్రధానమంత్రి మోదీ, ఆయన కుడిభుజం అమిత్ షా ధాటికి తట్టుకోలేక ప్రత్యర్థి శక్తులన్నీ ఏకమయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. తాజాగా ఉమ్మడి పౌరస్మృతిపై ఎన్డీఏ మిత్రపక్షాలు కూడా అసమ్మతి ప్రకటిస్తున్నాయి. తన 25 సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని తన పుట్టిన రోజు సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్ జరుపుకోవాలని ఎన్డీఏ పార్టీలను నిర్దేశిస్తున్న మోదీ వైఖరిలో బ్రిక్స్ అనుభవం తర్వాతనైనా మార్పు వస్తుందా? చెప్పలేం.

# జనాకర్షణను తగ్గించే ప్రయత్నాలు

**జర్మనీలో ఇటీవల జరిగిన సక్సోనీ-యాన్‌హాల్ట్ రాష్ట్ర ఎన్నికల్లో అతిమితవాద ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ(ఏఎఫ్‌డీ) పార్టీ 44శాతం ఓట్లు గెలుచుకోవడం ప్రకంపనలు సృష్టిస్తోంది. రెండో ప్రపంచ యుద్ధం తరవాత జర్మనీలో ఒక అతిమితవాద పక్షం ఇంత విజయం సాధించడం ఇదే ప్రథమం. ఇప్పటివరకు సామ్యవాద, సంక్షేమ సూత్రాలకు పట్టంకడుతూ వచ్చిన ఐరోపాలో మళ్లీ నాజీ, ఫాసిస్టు భావజాలం మొగ్గతొడుగుతోందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఐరోపాలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. కొవిడ్ వల్ల సరఫరా గొలుసులు విచ్ఛిన్నం కావడం, అమెరికా-చైనా ఆర్థిక వైరం పెరుగుతుండటం, డొనాల్డ్ ట్రంప్ తమ పర భేదం లేకుండా చిరకాల యూరోపియన్ మిత్రదేశాల పైనా ఆంక్షల అస్త్రం ఝుళిపించడం వంటివి ఆ ఖండంలో ఆర్థికంగా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు, ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు వ్యతిరేకంగా ఐరోపా దేశాలకు ట్రంప్ పూర్తి అండదండలు ఇవ్వకపోవడం, రక్షణ బడ్జెట్‌ను పెంచుకోండంటూ దబాయించడం, ఐరోపాలోని అతిమితవాద పక్షాలవైపు అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మొగ్గు చూపడం రాజకీయంగా చిక్కు పరిస్థితిని సృష్టిస్తోంది. మారిన ప్రపంచ ఆర్థిక వాతావరణంతో ఐరోపా దేశాల్లో జీవన వ్యయంతో పాటు ప్రభుత్వాలపై రుణభారమూ గణనీయంగా పెరుగుతోంది. ఇలాంటి తరుణంలోనే ఐరోపా దేశాలకు వలసలు పోటెత్తుతుండటం అక్కడి ప్రజల్లో నిరసనాగ్రహాలను రేపుతోంది. వలసదారుల వల్ల తమకు ఎంట్రీ స్థాయి ఉద్యోగాలు దొరక్కుండా పోతున్నాయనీ, నిరుద్యోగం పెరుగుతోందనీ ఐరోపా యువత భావిస్తోంది.**



ఉక్రెయిన్‌కు సాయంపై ఆగ్రహం

వచ్చే ఏడాది ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, పోలాండ్, గ్రీస్, ఫిన్లాండ్, ఎస్టోనియా, స్లొవేకియా, స్లొవేనియా దేశాల్లో కీలకమైన పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. వీటికి తోడు జర్మనీలో ఫెడరల్ అధ్యక్ష పదవికి పరోక్ష ఎన్నికను నిర్వహిస్తారు. ఇలాంటి కీలక సమయంలో అక్కడి సక్సోనీయాన్‌హాల్ట్ రాష్ట్రంలో ఏఎఫ్‌డీ విజయం సాధించడాన్ని ఐరోపా మొత్తానికి ఒక హెచ్చరికగా విశ్లేషిస్తున్నారు. ఫ్రాన్స్‌లో అతిమితవాద నాయకురాలు మరీన్ లే పెన్ ఇప్పటికే ముందంజలో ఉన్నట్లు ప్రజాభిప్రాయ సేకరణలు సూచిస్తున్నాయి. ఇంతకాలం ఐరోపా దేశాల్లో అతిమితవాద పార్టీలకు జనాదరణ అంతంత మాత్రంగానే ఉండేది. ఇవి ఎప్పుడైనా కాస్త చెప్పుకోదగ్గ సంఖ్యలో ఓట్లు, సీట్లు సాధించినా కన్సర్వేటివ్(మితవాద) పార్టీలు, వామపక్ష, సోషలిస్టు పక్షాలు పరస్పరం చేతులు కలిపి సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తూ వచ్చాయి. అలా అతిమితవాదులను అవి అధికారానికి దూరంగా ఉంచుతున్నాయి. కానీ, ఈసారి జర్మనీలో రాష్ట్రస్థాయిలో ఏఎఫ్‌డీ సొంతంగా 44శాతం ఓట్లు సాధించడంతో వచ్చే ఏడాది ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో అతిమితవాదులు సొంతంగా, సాధారణ మెజారిటీనైనా సాధిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అతిమితవాదులకు మెజారిటీ రాకపోయినా ఐరోపా పార్లమెంట్లలో వారి బలం పెరిగితే వలసలు, జాతీయ భద్రత, వాతావరణ మార్పుల నిరోధంపై ఆయా దేశాలు సమష్టి సహకారం సాధించడం కష్టమవుతుంది.

ఏఎఫ్‌డీ మాదిరిగానే హంగరీకి చెందిన ఫిడెజ్ వంటి అతిమితవాద పార్టీలు ఉక్రెయిన్‌కు ఐరోపా దేశాల ఆర్థిక సాయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఈ యుద్ధం వల్లే జర్మనీకి చవకైన రష్యన్ చమురు, గ్యాస్‌ల ఎగుమతి నిలిచిపోయి ద్రవ్యోల్బణం పెరిగిందని ఏఎఫ్‌డీ విమర్శిస్తోంది. ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్ని నిలిపేయాలనీ, రష్యన్ ఇంధన దిగుమతులను పునరుద్ధరించాలనీ ఏఎఫ్‌డీ సక్సోనీయాన్‌హాల్ట్ ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. ఇక ఫ్రాన్స్‌లో ప్రాబల్యం పెంచుకుంటున్న అతిమితవాది మరీన్ లే పెన్‌కు రష్యాతో ఆర్థిక, రాజకీయ సంబంధాలు ఉన్నాయి. లే పెన్ పార్టీ అయిన నేషనల్ ర్యాలీ రష్యాతో సంబంధం ఉన్న బ్యాంకుల నుంచి గతంలో పెద్దమొత్తంలో రుణాలు పొందింది. లే పెన్ ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రను వ్యతిరేకిస్తున్నా, 'యుద్ధం ముగిశాక ఈయూ రష్యా మధ్య సయోధ్య'ను వాంఛిస్తున్నారు. అలాగని ఐరోపా దేశాల్లోని అతిమితవాద పార్టీలన్నీ రష్యాకు అనుకూలం కాదు.

ఏఎఫ్‌డీ, నేషనల్ ర్యాలీ వంటి అతిమితవాద పార్టీలకు పార్లమెంటులో మెజారిటీ దక్కకుండా చూడటానికి మితవాదమధ్యేవాద, వామపక్షమధ్యేవాద పార్టీలు, వాటి ప్రభుత్వాలు వేగంగా అడుగులు వేయనారంభించాయి. ఏఎఫ్‌డీ, నేషనల్ ర్యాలీ వంటి పార్టీల నినాదాలు, విధానాల్లోని కొన్ని అంశాలను స్వీకరించడం ద్వారా వాటిపై జనాకర్షణను తగ్గించేందుకు అవి ప్రయత్నిస్తున్నాయి. సరిహద్దులను కట్టుదిట్టం చేస్తూ వలసలను నిరోధిస్తున్నాయి. ఆశ్రయం కోరిన వలసదారులను వేగంగా తిప్పిపంపే ప్రక్రియనూ చేపడుతున్నాయి. వలసలతోపాటు ద్రవ్యోల్బణం, అధిక ఇంధన ధరలు వంటి అంశాలు ఓటర్లను అతిమితవాదులవైపు ఆకర్షిస్తున్నాయని గ్రహించి, హరిత ఇంధనాలకు మారే ప్రక్రియను ఆలస్యం చేస్తున్నాయి. ఏతావాతా 2027లో జరిగే ఎన్నికలు, ఫలితాలు ఐరోపాపై రాజకీయంగా, ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

# బ్రిటన్‌లో వేర్పాటు భేరి!

**బ్రిటిష్ వలస పాలకులు తాము తప్పుకున్న మరుక్షణం భారత్ చిన్నాభిన్నం కావటం ఖాయమని జోస్యం చెప్పారు. ఇప్పుడు ఆ దేశమే ముక్కలయ్యే స్థితి ఏర్పడింది. మొన్న సోమవారం స్కాట్లాండ్, వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్‌లు(మన దగ్గర సీఎంల హోదాతో సమానం) అనధికార సమావేశం జరిపి, తమ స్వాతంత్ర్య ఆకాంక్షను వ్యక్తం చేసే ప్రకటనపై సంతకాలు చేశారు. దేశం కలిసుండాలా, విడిపోవాలా అనేది... అందుకు అనుసరించాల్సిన పద్ధతేమిటన్నది లండన్‌లోని జాతీయ పార్లమెంటు మాత్రమే నిర్ణయించాల్సిన అంశం కాబట్టి, ఇప్పటికప్పుడు దీనివల్ల జరిగేదేమీ ఉండదు. కానీ ఆర్థిక సంక్షోభాలు అగ్రరాజ్యాల్ని సైతం ఎలా కుదిపేస్తున్నాయో చెప్పడానికి తాజా పరిణామం ఉదాహరణ. అమెరికాపై పాతికేళ్లనాడు ఉగ్రదాడి జరిగినప్పుడు 3,000 మందిని పొట్టనబెట్టుకోవడం మినహా ఆ ఉగ్రవాదులు సాధించిందేమిటన్న ప్రశ్న వినబడింది. అటు తర్వాత అమెరికా సవ్యంగావుంటే ఉగ్రవాదం అంతరించేది. కానీ జరిగిందంతా అందుకు భిన్నం. అప్పట్లో అందరినుంచీ అమెరికాకు మద్దతు లభించింది. కొత్తగా అధికారంలోకొచ్చిన రష్యా అధినేత పుతిన్ అమెరికా ప్రారంభించిన 'ఉగ్రవాదంపై యుద్ధా'నికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, తాలిబన్ల వేటకు మధ్య ఆసియాలోని పూర్వపు సోవియెట్ సైనిక స్థావరాల వినియోగానికి ఉదారంగా అనుమతించారు. నాటో ఆవిర్భవించి అప్పటికి యాభైయ్యేళ్లు దాటగా... అందులోని మొదటి క్లాజు 'సమష్టి రక్షణ'ను తొలిసారి ఉపయోగించి ఆ సంస్థ అమెరికాకు బాసటగా నిలిచింది. ఇలా చిన్నా పెద్దా దేశాలన్నీ తాలిబన్‌ల వేటకు తోడ్పడ్డాయి.**

కానీ దీన్ని అమెరికా దుర్వినియోగం చేసింది. మానవ హక్కుల ఉల్లంఘన సంగతలా వుంచి ఇరాక్ మొదలు పలు దేశాలపై విరుచుకుపడి ధ్వంసరచనకు, మారణ హోమాలకు పాల్పడింది. లక్షల కోట్ల డాలర్లను మంచి నీళ్లప్రాయంగా ఖర్చు చేసింది. ప్రతీకారేచ్ఛ క్రమంలో తాను దివాలా తీస్తున్నాననీ, నమ్ముకున్న వారిని నట్టేట ముంచుతున్నాననీ, చైనాపై కన్నేసి వుంచాలన్న సంగతి మరిచాననీ గ్రహించలేక పోయింది. ఉగ్రదాడికి ముందు మిగులు బడ్జెట్‌లో ఉన్న అమెరికా ఇప్పుడు 40 లక్షల కోట్ల డాలర్లకుపైగా అప్పుల్లో కూరుకుపోయింది. కరోనా మహమ్మారి పాత్ర కూడా ఇందులో ఉండొచ్చు గానీ... విచక్షణారహిత యుద్ధాల పరంపరే దాన్ని ఈ స్థితికి చేర్చింది. 'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్టు యుద్ధాల్లో పాలుపంచుకున్న నాటో బలహీన పడింది. అన్ని దేశాలూ ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్నాయి. ఈ కష్టాల పరంపరనుంచి గట్టెక్కటం కోసమే ఆరేళ్ల క్రితం ఈయూ నుంచి బ్రిటన్ బయటికొచ్చింది. బ్రెగ్జిట్ రిఫరెండమ్‌లో దీన్ని నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ ప్రజానీకం తిరస్కరించారు. కానీ వారి అభీష్టానికి విలువ లేకుండాపోయింది. ఇప్పుడు బ్రిటన్‌నుంచి విడిపోవటంతోపాటు ఈయూలో చేరటం కూడా ఈ ముగ్గురు అధినేతల ఎజెండా. చారిత్రకంగా మన రాష్ట్రాల కన్నా వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ భిన్నమైనవి. వేల్స్‌ను 13వ శతాబ్దంలో ఇంగ్లండ్ ఆక్రమించుకుంది. రాచరికాలు చుట్టరికం కలుపుకోవటంతో స్కాట్లాండ్,ఇంగ్లండ్ కలిసి ప్రయాణించి వందేళ్ల తర్వాత కలిసి 1703లో గ్రేట్ బ్రిటన్‌గా ఏర్పడ్డాయి. 1801లో దానిలో చేరిన ఐర్లాండ్ 1921లో విడిపోయింది. కానీ ఉత్తర ప్రాంతంలోని ఆరు కౌంటీలు యూకేలోనే కొనసాగుతామన్నాయి. బ్రిటన్ తప్పుడు నిర్ణయాలతో అన్ని ప్రాంతాలనూ భ్రష్టు పట్టించటంతోపాటు, వాటి అధికారాలను కుదిస్తూవచ్చింది. పన్నుల ఆదాయాన్ని సరిగా పంచక 90 దశకం చివర్లో హామీ ఇచ్చిన స్వయంప్రతిపత్తి హోదాకు ముప్పు తెస్తోందన్నది వాటి అభిప్రాయం. నిరుద్యోగం, జనాభా క్షీణతపై తమకు సరైన నిర్ణయాధికారాలు లేవని వాటి ఫిర్యాదు. సంక్షోభాలు చుట్టుముట్టినప్పుడైనా సక్రమంగా వ్యవహరించటం చేతకాకపోతే అవి మరింత ముదురుతాయి. ఫెడరల్ వ్యవస్థను నీరుగార్చి ప్రశాంతంగా మనుగడ సాగించాలనుకోవటం చెల్లదని బ్రిటన్ పాలకులు గుర్తించకపోతే... ఇప్పటికి కేవలం రాజకీయ హెచ్చరికగానే తలెత్తిన ఈ నిరసన ఆ ప్రాంత జనాభాను తాకడానికి ఎన్నాళ్లో పట్టదు. అప్పుడు బ్రిటన్ లండన్‌గా మిగిలిపోక తప్పదు. చేసిన పాపాలు శాపాలై వెంటాడ తాయంటారు.

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

శనివారం ⁞ అనంతపురం ⁞ 19.09.2026 ⁞ 01


## ఫెన్సింగ్ కు కరెంటు దిగి రెండు ఆవులు మృతి.

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 18 అనంత జన శక్తి న్యూస్.**



పుట్టపర్తి మండల పరిధిలోని వీరజిన్నయ్యగారి పల్లిలో విషాద ఘటన చోటు చేసుకుంది. రైతు ఈడుగుట్టి లక్ష్మీనారాయణకు చెందిన రెండు ఆవులు విద్యుదాఘాతానికి గురై శుక్రవారం మృత్యువాతపడ్డాయి. ఆవులు కట్టేసిన చోటనే కరెంటు స్తంభం, దానికి ట్రాన్స్ ఫార్మర్ బిగించి ఉంది. రాత్రి అధికంగా వర్షం కురవడంతో ఫెన్సింగ్ కు కరెంటు దిగి ఆవులు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఆవులపై ఆధారపడి జీవిస్తున్న ఈ కుటుంబం ఇప్పుడు రోడ్డున పడింది. ఆ రెండు ఆవులు మరో వారం రోజుల్లో ఈనేవని రైతు కుటుంబం తెలిపింది. సమాచారం అందుకున్న పశుసంవర్ధక శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. విద్యుత్ ప్రమాదం వల్లే ఆవులు మరణించాయని సమాచారం అందించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని రైతు భార్య కాంతమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తూ తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

# అభివృద్ధి పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలి

- రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు 2024 నుంచి జిల్లాకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, సెప్టెంబర్ 18:అనంత జనశక్తి న్యూస్**



జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ పెండింగ్ లేకుండా త్వరితగతిని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ వివిధ శాఖల అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని రెవెన్యూ భవన్ నందు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నవంబర్ 2024, సంవత్సరం నుంచి ఇప్పటివరకు జిల్లాలోని వివిధ శాఖలకు మంజూరు చేసిన అభివృద్ధి పనులను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. సీఎం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉందన్నారు. జిల్లాలో దాదాపు 24 శాఖలకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు అభివృద్ధి పనులు మంజూరు చేయడం జరిగిందన్నారు. సీఎం ఇచ్చిన అస్యూరెన్స్ పనులన్నీ పూర్తి చేయకపోతే మన జిల్లా అభివృద్ధిలో వెనుకబడే అవకాశం ఉందన్నారు. 24 శాఖల హెచ్ ఓ డి లు అభివృద్ధి పనుల నిర్వహణలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తెచ్చి వెంటనే పరిష్కరించుకోవాలన్నారు.

వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాలులో 30 లక్షలతో మంజూరు చేసిన హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ భవనం వెంటనే పూర్తి చేయడం జరిగిందని ఇలా ప్రతి శాఖ తమకు కేటాయించిన అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేయాలన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఓ గిరిధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిఆర్ డి ఎ పిడి శైలజ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి సాజిదా బేగం, జిల్లా విద్యాశాఖ అధికారి ఆయుబ్ హుస్సేన్, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ శ్రీనివాసులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జనవరిలో తెనాలి వేదికగా నంది నాటకోత్సవాలు

- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- జనవరి 10న కందుకూరి అవార్డుల ప్రదానం..అనంతరం వారం పాటు నాటకాల ప్రదర్శన
- రెండు మూడు రోజుల్లో నంది నాటకోత్సవాల నోటిఫికేషన్ విడుదల
- కందుకూరి ప్రతిష్టాత్మక పురస్కారాల సంఖ్య 5కు పెంపు – ఒక్కొక్కరికి రూ.1 లక్ష పారితోషికం
- 28 జిల్లాల ప్రాతిపదికన 100 మందికి కందుకూరి విశిష్ట పురస్కారాలు
- ఎఫ్.డి.సి ద్వారా అమల్లోకి సింగిల్ విండో విధానం .. ఈ వారంలోనే సినిమా, టీవీ నంది అవార్డుల ప్రకటన

**అమరావతి సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**



తెలుగు నాటకరంగానికి, సంస్కృతికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నంది నాటకోత్సవాలను పునఃప్రారంభిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఎండీ విశ్వనాథన్‌తో కలిసి మంత్రి దుర్గేష్ వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ..నంది నాటకోత్సవాలు కేవలం ప్రదర్శనలు కావు... తెలుగు నాటకరంగ సంస్కృతికి, నటీనటుల ప్రతిభకు పట్టం కట్టే అపూర్వ పండుగ..కళను బతికించే నాటక సమాజాలు, సమాజాన్ని చైతన్యపరిచే కళాకారులు -తెలుగు సంస్కృతికి మూలస్తంభాలు.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల మార్గదర్శకత్వంలో కళాకారులకు సరైన గుర్తింపునిచ్చేలా ఎఫ్.డి.సి ద్వారా అనేక నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. కళలకు కాణాచి అయిన గుంటూరు జిల్లా తెనాలిలో జనవరిలో నంది నాటకోత్సవాలు జరుగుతాయి. అవార్డుల ఎంట్రీల కోసం రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేసి, అక్టోబర్‌లో సెలక్షన్ కమిటీని నియమిస్తాం. డిసెంబర్‌లో ప్రాథమికంగా ఎంపికైన నాటకాల జాబితాను ప్రకటిస్తాం.

జనవరి 10న ప్రతిష్టాత్మక కందుకూరి అవార్డుల ప్రదానంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం వారం పాటు ఎంపికైన నాటకాల ప్రదర్శనలు, ఆ తర్వాత అత్యంత వైభవంగా నంది నాటకోత్సవాల పురస్కార ప్రదానోత్సవం జరుగుతుంది. ఇతర రాష్ట్రాల్లోని తెలుగు నాటక సమాజాలకు కూడా తొలిసారిగా అవకాశం కల్పిస్తున్నాం.నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (NSD) తరహాలో వీడియోల ద్వారా పరిశీలించి పారదర్శకంగా ఎంపిక చేస్తాం.

గతంలో 3గా ఉన్న కందుకూరి ప్రతిష్టాత్మక పురస్కారాలను 5 కి పెంచి, ఒక్కొక్కరికి రూ. 1 లక్ష చొప్పున అందజేస్తాం. స్థానం నరసింహారావు, ఆచార్య ఆత్రేయ, గరికపాటి రాజారావు, బందారు రామారావు తదితర దిగ్గజాల పేర్లతో ఈ పురస్కారాలు ఉంటాయి. కొత్తగా ఏర్పాటు అయిన 28 జిల్లాల ప్రాతిపదికన ప్రతి జిల్లా నుంచి ముగ్గురికి, అలాగే ప్రత్యేక సేవలు అందించిన మరొక 16 మందికి అవార్డులు ఇస్తాం. పద్యనాటకం, సాంఘిక నాటకం, రచయితలు, సాంకేతిక నిపుణులు, నాటక సమాజం కేటగిరీల్లో మొత్తం 100 మందికి/ సంస్థలకు కందుకూరి విశిష్ట పురస్కారాలు ఇవ్వనున్నాం. నాటక పరిషత్తులకు ఒక్కో దానికి రూ. 5 లక్షలు ఇచ్చే బదులు, ఎక్కువ మంది కళాకారులకు లబ్ధి చేకూరేలా

ఒక్కో పరిషత్‌కు రూ. 1 లక్ష చొప్పున విస్తృతంగా కేటాయిస్తున్నాం. ఇప్పటికే ఒక పర్యాయం కందుకూరి పురస్కారాలను గత ఏడాది తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 16న 100 మందికి ఇచ్చాము. చిత్ర పరిశ్రమ, నాటకరంగానికి అవసరమైన అనుమతుల కోసం FDC ద్వారా సింగిల్ విండో విధానం తెచ్చామని తెలిపారు. సినిమా, టీవీ రంగాల నంది అవార్డులకు సంబంధించి ఈ వారంలోనే ప్రకటన విడుదల చేసి, జనవరి నాటికి ప్రదానోత్సవాలు పూర్తి చేస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.పద్య నాటకం, సాంఘిక నాటకం, నాటిక, బాలల నాటిక, కాలేజీ ,యూనివర్సిటీ నాటిక, రంగస్థలం మీద బెస్ట్ బుక్ తదితర కేటగిరీల్లో నంది అవార్డులు అందిస్తామని పేర్కొన్నారు..

# దొంగ దీక్షలు, ధర్నాలను ప్రజలు నమ్మరు



- వైసీపీ నాయకుల దీక్షలపై ఎమ్మెల్యే పరిటాల సునీత స్పందన
- వేపకుంటలో రూ.1.25కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం
- అధికారంలో ఉండగా పని చేయకుండా ఇప్పుడు దీక్షలు చేస్తారా..?
- పేరూరు కాలువ పనులు ఎలా జరుగుతున్నాయో చూడాలన్న సునీత

**రాప్తాడు సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**

అధికారంలో ఉండగా పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పరిటాల రవీంద్ర కాలువ పనులు చేయకుండా ఇప్పుడు దొంగ దీక్షలు, ధర్నాలు చేస్తే ప్రజలు నమ్మరని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కనగానపల్లి మండలం వేపకుంట గ్రామంలో రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 50లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిసి రోడ్లను, 35 లక్షల ఆర్.డి.ఎస్.ఏ, ఉపాధి హామీ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆమె ప్రారంభించారు. అలాగే 40లక్షల జల జీవన మిషన్ నిధులతో ప్రతి ఇంటికి కొళాయి ద్వారా త్రాగునీటి సరఫరా చేయు పథకాన్ని కూడా ప్రారంభించారు. ఒకే గ్రామంలో ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ వేపకుంట గ్రామం అంటే పరిటాల రవీంద్రతో పాటు ఆయన తండ్రి శ్రీరాములుకు కూడా చాలా ఇష్టమన్నారు. మాకు ఎంతో మంది కుటుంబసభ్యుల్లాంటి వారు ఇక్కడ ఉన్నారన్నారు. గ్రామంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నట్టు చెప్పారు. ఈ పనులకు శంకుస్థాపన చేసినప్పుడు ఇవి ఎప్పటికి పూర్తి చేస్తారని కొందరు మాట్లాడారని.. కానీ 3నెలల్లోనే చేసి చూపించామన్నారు. పంచాయతీ భవనం, నీటి సమస్య తీరిందన్నారు. ప్రస్తుతం కొత్త పింఛన్లు కావాలని చాలా మంది దరఖాస్తు చేసుకున్నారని.. అర్హత ఉన్న వారికి కచ్చితంగా పార్టీలకతీతంగా ఇస్తామన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ సానుభూతిపరుల పింఛన్లు తొలగించారన్నారు. పేరూరు డ్యాంకు నీరు ఇచ్చేందుకు తాము కాలువ కోసం భూములు అడిగితే రైతులు ఉదారంగా ముందుకొచ్చారన్నారు. పార్టీ మారిన తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకులు కనీసం భూపరిహారం కూడా ఇవ్వలేదన్నారు. వారు ఆ రోజే ఈ పనులు పూర్తి చేసి ఉంటే.. పేరూరుకు నీరు వచ్చి ఉండేదన్నారు. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయని.. దీనిపై విమర్శలు చేస్తున్న వారు కాలువ మీదకు వెళ్లి చూడాలన్నారు. కళ్లు ఉండి కూడా చూడలేని వారు మేము ఏమీ చేయలేదని.. ఇప్పుడు నీరు ఇవ్వాలంటూ దీక్షలు చేస్తున్నారని.. వారికి అంత చిత్తశుద్ధి ఉంటే గత ఐదేళ్లలో ఈ పనులు ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇక్కడ భూములిచ్చిన రైతులకు పరిహారం కచ్చితంగా అందిస్తామని.. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ విషయాన్ని స్వయంగా చెప్పారన్నారు. సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ కూడా పూర్తి చేస్తామన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు గ్రామంలో 9ఎకరాల భూమి కొనుగోలు చేసి పట్టాలిచ్చామన్నారు. అయితే కొందరు ఇళ్లు కట్టుకోకపోవడం వలన ఆ తర్వాత వచ్చిన వైసీపీ వారు భూమిని ఆక్రమించారన్నారు. దీనిపై కోర్టుకు కూడా వెళ్లినట్టు చెప్పారు. తహసీల్దార్ వెంటనే చొరవ తీసుకుని ఇక్కడ పేదలకు పట్టాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు భజన మందిరం కావాలని గ్రామస్తులు అడిగారని త్వరలో వాటిని మంజూరు చేయిస్తామని, ముఖ్యంగా ప్రజలకు ఎవరు మంచి చేస్తున్నారో ఒక్కసారి ఆలోచించుకోవాలని.. మాటలు చెప్పే నాయకులకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే సునీత పిలుపునిచ్చారు...




## హిందీ భాష అభ్యసనతో భాషా పరిజ్ఞానం, ఉపాధి అవకాశాలు



- ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా హిందీ భాషా దినోత్సవం

**ఉరవకొండ సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉరవకొండలో హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి టి. శైలజ రాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎం.వి.ఎల్. నరసింహం హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శైలజ రాణి మాట్లాడుతూ భారతదేశంలో విస్తృతంగా ఉపయోగించే ముఖ్యమైన భాషల్లో హిందీ ఒకటని తెలిపారు. విద్యార్థులు హిందీని అభ్యసించడం ద్వారా భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు భారతీయ సంస్కృతి, సాహిత్యంపై అవగాహన పెంచుకోవచ్చని పేర్కొన్నారు.ముఖ్య అతిథి ఎం.వి.ఎల్. నరసింహం మాట్లాడుతూ హిందీ భాష ప్రాముఖ్యతతో పాటు హిందీ సాహిత్య విశిష్టతను వివరించారు. విద్యార్థులు హిందీపై ఆసక్తి పెంచుకొని చదవడం, రాయడం, మాట్లాడడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.హిందీ విభాగాధిపతి పి. సోమశేఖర్ మాట్లాడుతూ హిందీ భాషా దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. హిందీ భాష, సాహిత్యం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, జ్ఞాన విస్తరణకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.జంతుశాస్త్ర అధ్యాపకురాలు శ్రీమతి జమీలా బీబీ మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, వివిధ భాషలు, సంస్కృతుల మధ్య సమన్వయానికి హిందీ దోహదపడుతోందని పేర్కొన్నారు. హిందీ భాషను నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు.హిందీ భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థినీ విద్యార్థులు హిందీ భాష ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రసంగాలు, కవితలు తదితర కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నారాయణస్వామి, విష్ణుప్రియ, రమేష్ తదితరులు, హిందీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. హిందీ భాషను గౌరవిస్తూ, దాని అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## విజయవాడలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



- 160 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ

**విజయవాడ, సెప్టెంబర్ 18:అనంత జనశక్తి న్యూస్**

11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని డా. ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి, డా. నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు.ఆదాయపు పన్ను కార్యాలయం, ఎం.జి. రోడ్డులో నిర్వహించిన ఈ శిబిరంలో కార్యాలయ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మొత్తం 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కీళ్ల నొప్పులు, గ్యాస్ట్రిక్ సమస్యలు, మహిళల ఆరోగ్య సమస్యలు, చర్మవ్యాధులు తదితర సమస్యలకు వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు.ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆదాయపు పన్ను ప్రధాన కమిషనర్ శ్రీ సి.హెచ్.వి. గోపీనాథ్ సహకారం అందించగా, ఆదాయపు పన్ను సంయుక్త కమిషనర్ విజయదీపన్ పర్యవేక్షించారు.కార్యక్రమంలో సీనియర్ వైద్యులు లక్ష్మీ శుభద్ర, భాగ్యలక్ష్మి, గృహవైద్యులు రాజీవి సుజయ్, సుహాస్, మనస్విని తదితరులు పాల్గొన్నారు.జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించడంతో పాటు, ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఇటువంటి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పి. జగదీష్ తెలిపారు.

## డిగ్రీ కళాశాలలో ఘనంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం



**ఉరవకొండ సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థుల శైలజరాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థుల చదువు, హాజరు, క్రమశిక్షణ, భవిష్యత్ ప్రగతిపై చర్చించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శైలజరాణి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరయ్యేలా చూడాలని, క్రమశిక్షణ పెంపొందించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.వైస్ ప్రిన్సిపాల్ పి. సోమశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ జి. అయ్యన్న మాట్లాడుతూ తల్లిదండ్రులు తరచూ కళాశాలకు వచ్చి తమ పిల్లల చదువు, పురోగతిని తెలుసుకోవాలని అన్నారు.రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సిరాజ్ అలీ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలు తీర్చడంతో పాటు వారు క్రమశిక్షణతో కళాశాలకు హాజరయ్యేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల విద్యా పురోగతిని తెలుసుకుని, తమ సందేహాలను అధ్యాపకులతో చర్చించి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపన్యాసకులు ఎస్. నారాయణస్వామితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

**- రైతుల కోసం పంటలు, విత్తనాలు, బీమాపై ప్రత్యేక చర్యలు: మంత్రి అచ్చెన్నాయుడు**

**అమరావతి సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**




ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు, పంటలను కాపాడేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.'జలధార-జలహారతి' కార్యక్రమంలో రూ.3,409.35 కోట్లతో 79,826 పనులు పూర్తి చేశామని, దీంతో భూగర్భ జలాలు 0.79 మీటర్లు పెరిగాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 625 టీఎంసీల భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఫిబ్రవరి 2026 నుంచే ఎల్‌నినో పరిస్థితులపై ముందస్తు కార్యాచరణ ప్రారంభించామని మంత్రి తెలిపారు. శాటిలైట్ సమాచారం, జలాశయాల నీటి నిల్వలు, నేల తేమ, పంటల పరిస్థితిని పరిశీలిస్తూ రైతులకు సూచనలు అందిస్తున్నామని చెప్పారు.వర్షాధార ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సుమారు 23 లక్షల మంది రైతులు 25 లక్షల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల విధానాలను అనుసరిస్తున్నారని చెప్పారు. నీటి లభ్యతకు అనుగుణంగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని సూచిస్తున్నామని తెలిపారు.'రైతన్న మీ కోసం-ఎల్‌నినో నివారణ ప్రణాళిక' ద్వారా 46.86 లక్షల మంది రైతులకు చెందిన 2.75 కోట్ల కమతాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. పంట పరిస్థితి, నీటి లభ్యత, నేల తేమ ఆధారంగా రైతులకు కమతాల వారీగా సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు.పంటల బీమా దరఖాస్తులు 2025లో 19.5 లక్షలు ఉండగా, 2026లో 35.15 లక్షలకు పెరిగాయని మంత్రి వెల్లడించారు. బ్యాంకు రుణాలు తీసుకోని రైతులను కూడా బీమా పరిధిలోకి తీసుకువచ్చామని తెలిపారు.రైతులకు ముందుగానే విత్తనాలు సిద్ధం చేశామని చెప్పారు. మొదటి విడతలో 47,321 క్వింటాళ్ల విత్తనాలు, అదనపు అవసరాల కోసం మరో 1.12 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఐదు నెలలకు సరిపడా పశుగ్రాసం అందుబాటులో ఉందని, అవసరమైన ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు.రాయలసీమలో ఉద్యానవన హబ్ ఏర్పాటు చేయనున్నట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రభుత్వ రంగంలో రూ.40 వేల కోట్లు, ప్రైవేట్ రంగంలో రూ.60 వేల కోట్ల పెట్టుబడులతో మొత్తం రూ.లక్ష కోట్ల పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.సూక్ష్మ సాగునీటి విధానానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు పంటల బీమా, నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటలు, పశుగ్రాసం వంటి అంశాలపై ముందస్తు చర్యలు కొనసాగిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

# థ్యాంక్యూ ఎమ్మెల్యే దగ్గుపాటి సార్



**- పారిశుధ్య కార్మికుల పండగ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**
**- ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపిన సీఐటీయూ మున్సిపల్ కార్మికులు**
**- 30మంది కార్మిక కుటుంబాలకు కాంట్రాక్ట్ ఉద్యోగాలు**
**- అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ని సత్కరించిన కార్మికులు**

**అనంతపురం సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**

గత 3సంవత్సరాలుగా మున్సిపల్ కార్మికులు చేస్తున్న పోరాటం ఫలించింది. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో నగరపాలక సంస్థలో 30మంది కార్మికులకు ఉద్యోగాలు లభించాయి. ఈ నేపథ్యంలో అనంతపురం నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. గత కొన్ని నెలలుగా మున్సిపల్ కార్మికుల హక్కుల కోసం, వారి కుటుంబాల భద్రత కోసం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు అనేక పోరాటాలు నిర్వహిస్తున్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు, పదవీ విరమణ చేసిన కార్మికుల కుటుంబాల్లో ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో కార్మికుల ప్రధాన డిమాండ్లపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు ప్రత్యేక చొరవ చూపారు. ఇటీవల చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో 12మందికి పదవీ విరమణ చెందిన కుటుంబాల్లో 18మంది కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించారు. దీనిపై సీఐటీయూ మున్సిపల్ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేని కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ 30 నుండి 40 ఏళ్ల పాటు మున్సిపల్ కార్మికులుగా సేవలందించి, పదవీ విరమణ చేసిన తర్వాత ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక రోడ్డున పడుతున్న కుటుంబాలను కాపాడాలని, అలాగే విధి నిర్వహణలో ఉంటూ మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని చాలా కాలంగా పోరాటం చేస్తున్నామన్నారు. దీనిపై స్పందించినందుకు ఎమ్మెల్యే, ప్రత్యేక అధికారి, కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం కాంట్రాక్టు ప్రాతిపదికన నియమితులైన కార్మికులను భవిష్యత్తులో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అలాగే, అనంతపురం నగర జనాభా, విస్తీర్ణానికి అనుగుణంగా పని భారాన్ని తగ్గించేందుకు, నగరంలో పనికి తగిన విధంగా అదనపు మున్సిపల్ కార్మికులను నియమించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు, కార్మికులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ రమాదేవి

**నల్లచెరువు సెప్టెంబర్ 18 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రమైన నల్లచెరువు పాత రైల్వే స్టేషన్ సమీపంలో పురాతనం నుండి కోర్కెల తీర్చే కొలువైన దేవుడిగా వెలసియున్న శ్రీ పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి దేవాలయంలో ఎమ్మెల్సీ తలవాయి రమాదేవి వారి కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు ఎమ్మెల్సీ రమాదేవి కి ఆలయ అర్చకులు మరియు నల్లచెరువు మండల వడ్డెర సంఘం నాయకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు.



# యువతకు బంగారు పునాదులు వేస్తున్నాం

**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**
**- మాది జెన్ జీ పక్షపాతి ప్రభుత్వం**
**- 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం**
**- ఏటా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ**
**- ఈ ఏడాది 10,060కు పైగా పోస్టుల భర్తీకి నిర్ణయం**
**- పరిశ్రమల ఏర్పాటుతో స్థానికంగానే ఉద్యోగాల కల్పన**
**- యువత కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న సీఎం చంద్రబాబు**
**- నిరుద్యోగులను మోసగించిన జగన్**
**- యువత లక్ష్యాలను సాధించాలి : మంత్రి సవిత**
**- పెనుకొండలో ఘనంగా 'యువత భవితకు భరోసా'**

**పెనుకొండ సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**



ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను జగన్ మోసగిస్తే, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూ రాష్ట్ర యువతకు బంగారు పునాదులు వేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. తమది జెన్ జీ ప్రభుత్వమని, చదువుకున్న యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. నైపుణ్యం పోర్టల్ ను ఏర్పాటు చేసి, అందులో నిరుద్యోగ యువతకు అవసరమయ్యే ఉద్యోగావకాశాలు, స్కిల్ పెంచుకునే వివరాలు పొందుపర్చామన్నారు. యువశక్తితో 2047 నాటికి ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెడతామని ధీమా వ్యక్తంచేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువత భవితకు భరోసా కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఆమె తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. చదువులు పూర్తికాగానే యువతకు ఉద్యోగాలు లభించేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. కేవలం రెండేళ్ల కాలంలో ఏపీకి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థానికంగానే ఉద్యోగాలు లభించేలా చర్యలు తీసుకొంటున్నారని మంత్రి సవిత తెలిపారు.

**ఏటా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ**

యువతకు ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని మంత్రి సవిత తెలిపారు. ఈ ఏడాది 10,060 పోస్టుల భర్తీకి జాబ్ క్యాలెండర్ ను మంత్రి లోకేశ్ విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దీనిలో భాగంగా ఇటీవల ఏపీపీఎస్సీ ద్వారా 892 ఉద్యోగాలు, పోలీస్ డిపార్ట్ మెంట్ లో 2,050 పోస్టులు, అగ్నిమాక డిపార్ట్ మెంట్ లో 147 డ్రైవర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. మూడు వేల టీచర్ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారన్నారు. రాబోయే మూడేళ్లలో మూడు డీఎస్సీలు నిర్వహించనున్నామని తెలిపారు. ఇకపై ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, యువత బంగారు పునాదులు వేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

**నిరుద్యోగులను మోసగించిన జగన్**

ఏటా జాబ్ క్యాలెంటర్, డీఎస్సీ నిర్వహిస్తామంటూ అధికారంలోకి వచ్చిన జగన్ మాట తప్పి నిరుద్యోగులను మోసగించారని మంత్రి సవిత మండిపడ్డారు. అయిదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేని అసమర్థుడు జగన్ అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, మెగా డీఎస్సీని మంత్రి నారా లోకేశ్ ఎంతో పారదర్శకంగా, అక్రమాలకు తావులేకుండా నిర్వహించారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వడం ఓర్చుకోలేని జగన్... మెగా డీఎస్సీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

**మాది జెన్ జీ పక్షపాతి ప్రభుత్వం**

అంతకుముందు మంత్రి సవిత... పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాల నిర్దేశించుకుని, వాటిని సాధించాలని సూచించారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం గర్వపడేలా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అవసరం మేరకే సెల్ ఫోన్లు ఉపయోగించాలని తెలిపారు. నైపుణ్యం పోర్టల్ ను ఏర్పాటు చేసి అందులో ఉద్యోగ అవకాశాలు, స్కిల్ పెంచునే విధానాలను పొందుపర్చామని, తమది జెన్ జీ పక్షపాత ప్రభుత్వమని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మైనారిటీల సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరాలి

**- అనంతపురంలో శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ సమీక్ష**

**అనంతపురం, సెప్టెంబర్ 18: అనంత జనశక్తి న్యూస్**

మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు పనిచేయాలని ఏపీ శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ చైర్మన్ మహమ్మద్ నసీర్ అహ్మద్ సూచించారు.అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించింది. మైనారిటీలకు అమలవుతున్న సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, విద్య, ఉపాధి, వక్ఫ్ ఆస్తులు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు.నసీర్ అహ్మద్ మాట్లాడుతూ మైనారిటీల అభివృద్ధికి విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. మైనారిటీ మహిళలకు వివిధ వృత్తుల్లో శిక్షణ[illegible] స్వయం ఉపాధి కల్పించాలని సూచించారు. ప్రతి నెలా 250 మందికి శిక్షణ అందించేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను[illegible] వక్ఫ్ ఆధీనంలోని భూముల ఆక్రమణలను తొలగించి, వాటి ద్వారా ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అర్హులకు రుణాలు అందించాలని, ప్రభుత్వ నియామకాల్లో రిజర్వేషన్ నిబంధనలు అమలు చేయాలని తెలిపారు. మసీదులు, చర్చిలకు సంబంధించిన స్వాధీన ధ్రువపత్రాల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 1[illegible] అనంత జన శక్తి న్యూస్.

**మైనారిటీలకు ప్రత్యేక కళాశాలలు ఏర్పాటు చేయాలి**

కమిటీ సభ్యుడు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మైనారిటీల కోసం ప్రత్యేకంగా ఒక డిగ్రీ కళాశాల, ఒక ఇంటర్మీడియట్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. మైనారిటీల రుణాలు, మసీదులు, చర్చిలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.కమిటీ సభ్యుడు ఇసాక్ బాషా మాట్లాడుతూ మైనారిటీలలో పేదరికం, నిరక్షరాస్యతను తగ్గించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు, అధ్యాపకుల నియామకాల్లో రోస్టర్ విధానం సక్రమంగా అమలయ్యేలా చూడాలని సూచించారు.మరో సభ్యుడు సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అర్హులైన చివరి లబ్ధిదారుడికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారం, నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందిస్తామని తెలిపారు.



**విద్యా వసతులపై ప్రత్యేక దృష్టి**

జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం, విద్యాభివృద్ధికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.అనంతపురంలో చదువుతున్న విద్యార్థుల కోసం వసతి గృహాలు, అదనపు తరగతి గదుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు.మైనారిటీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో పాఠశాలలకు సమీపంలో వసతి గృహాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. మైనారిటీ విద్యాసంస్థల్లో మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, ఇతర మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు.సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ చైర్మన్, సభ్యులను సన్మానించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# 60 ఏళ్ల కలకు శాశ్వత పరిష్కారం




**- సర్వేపల్లి కాలువకట్ట వాసులకు పట్టాల పంపిణీకి లైన్ క్లియర్**
**- మంత్రి నారాయణ చొరవతో 1215 కుటుంబాల్లో వెలగనున్న జీవన్ జ్యోతులు .**
**- ఈనెల 21న వర్చువల్ విధానంలో సీఎం చంద్రబాబు చేతులమీదుగా పట్టాల పంపిణీ**

**నెల్లూరు సెప్టెంబర్ 18,అనంత జనశక్తి న్యూస్**

నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని సర్వేపల్లి కాలువకట్ట వాసుల 60 ఏళ్ల కల సాకారం కాబోతోందని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం 1215 కుటుంబాలకు శాశ్వత పట్టాలు అందించే ప్రక్రియకు మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ లైన్ క్లియర్ చేశారని వెల్లడించారు. శుక్రవారం నెల్లూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సర్వేపల్లి కాలువకట్ట వాసులకు శాశ్వత పట్టాలు ఇప్పించేందుకు మంత్రి నారాయణ అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తూ నిరంతరం కృషి చేశారని రూప్‌కుమార్ తెలిపారు. అధికారుల సూచనల మేరకు దేశంలో తొలిసారిగా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నర్మదా నది పరీవాహక ప్రాంత వాసులకు పట్టాలు ఇచ్చిన విధానాన్ని పరిశీలించి, అదే తరహాలో నెల్లూరు కాలువకట్ట వాసులకు కూడా న్యాయం జరిగేలా మంత్రి ప్రయత్నించారని చెప్పారు. మంత్రి నారాయణ చొరవతో ఈ నెల 3న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం పొందిందని, దీంతో 1215 కుటుంబాలకు శాశ్వత పట్టాల పంపిణీకి మార్గం సుగమమైందన్నారు. ఈ నెల 21వ తేదీ ఆదివారం ఉదయం 11.30 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో పట్టాలను పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించి పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు.

**భగత్‌సింగ్ కాలనీలోనూ 1400 కుటుంబాలకు పట్టాలు**

**పేదల సమస్యలను పరిష్కరించడంలో మంత్రి నారాయణ ముందుంటున్నారని రూప్‌కుమార్ అన్నారు. గతేడాది భగత్‌సింగ్ కాలనీలో 1400 కుటుంబాలకు శాశ్వత పట్టాలు ఇప్పించిన విషయాన్ని గుర్తుచేశారు. పేదలకు అండగా నిలవాలన్న సంకల్పంతో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను మంత్రి నారాయణ చొరవతో పరిష్కరిస్తున్నారని చెప్పారు.**

**అసత్య ఆరోపణలతో ఉనికిని కాపాడుకునే ప్రయత్నం**

**పేదల పక్షపాతిగా పనిచేస్తున్న మంత్రి నారాయణపై వైఎస్సార్‌సీపీ నేతలు సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని రూప్‌కుమార్ విమర్శించారు. రోజుకో అబద్ధం చెప్పి తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.వైఎస్సార్‌సీపీ నేతల దుర్మార్గాన్ని ప్రజలు గమనిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతోనే సమాధానం చెబుతారని పేర్కొన్నారు.విలేకరుల సమావేశంలో నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, టీడీపీ నేతలు బాలాజీ,తిరుమలనాయుడు, జహీర్ పాల్గొన్నారు.**

# ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం



**- ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నాం: ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**

**తనకల్లు సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**

ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని, అధికారులతో సమన్వయం చేసి పరిష్కరిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రతిపక్ష నాయకులు విమర్శించడం హాస్యాస్పదమని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలను పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకుని, అధికారుల సమక్షంలో పరిష్కారం చూపుతున్నామని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. రైతులకు నష్టం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే పరిస్థితులను అంచనా వేసి చర్యలు తీసుకోవడం కూటమి ప్రభుత్వ విధానమని చెప్పారు.ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని, కదిరి నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు.

# రైతన్న... గోష




- వాన జాడలేదు....
- ధైర్యం ఇచ్చే నాథుడు లేడు...
- పలకరించే నేతలు కరువాయే..
- రైతు మొర ఆలకించే వారెవరు..

**యల్లనూరు / పుట్లురు, సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్;**

వాన దేవుని కరుణ కరువాయే... అధైర్యపడవద్దు మేమున్నామంటూ పలకరించే పాలకుల చూపు కరువాయే...కనీసం కష్టాన్ని అయినా చెప్పుకుందాం అంటే అధికారులు సైతం మొహం చాటేస్తే ఇక రైతు తన గోషను ఎవరికి చెప్పుకోవాలి.. ఏలినినో ప్రభావంతో వర్షాలు ఉండవు అంటూ శాస్త్రవేత్తలు పదేపదే చెబుతున్న పాలకులు ఎందుకు అప్రమత్తం అవ్వలేకపోయారు....?. కంచే చేను మేస్తే కాచే వారెవరు అన్నది సామెత... రాబోయే విపత్తును రైతులకు వివరించి వాటి నివారణ చర్యలను చేపట్టడంలో అధికారం విఫలం అయిందా...!. అంటే ఈ రెండు మండలాలలో రైతులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితే నిదర్శనం. అనంతపురం జిల్లా అంటే కరువు జిల్లా అన్నది నానుడి. రాష్ట్రవ్యాప్తంగా ఒక వర్షం కురిస్తే ఈ జిల్లాలో మాత్రం అందుకు భిన్నంగా వర్షాలు కురవడం జరుగుతుంది. అటువంటి ఈ జిల్లాపై కూటమి నేతలు గాని అధికార యంత్రాంగం గాని ముందస్తు చర్యలు లేకపోవడం వల్లే నేడు రైతుకు ఈ పరిస్థితి నెలకొందని ప్రతిపక్షాలు విమర్శలకు దిగుతున్నాయి. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టడం, ప్రతి చెరువును నీటితో నింపుతామంటూ తాడిపత్రి నియోజకవర్గం యాడికి మండలం కు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదేపదే చెప్పడంతో పాటు జలదార పథకాన్ని కూడా ప్రవేశపెట్టాడు. వందరోజుల ప్రణాళిక గల ఈ పథకం ద్వారా ప్రతి వర్షపు నీటి బొట్టు ఒడిసి పట్టడంతో పాటు ప్రతి చెరువును నీటిని నింపాలన్నదే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం. అయితే ప్రస్తుత నెలకొన్న కరువు పరిస్థితి అధికారులు, నేతల నిబద్ధతకు దర్పం పడుతోంది.

**ఎగుమత్తుల స్థాయి నుండి దినస్థితికి....**

అరటి సాగు అంటే కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలోని పుట్లూరు, యల్లనూరు మండలాలే. ఇక్కడి నుండి ఇతర దేశాలకు సైతం అరటిని ఎగుమతి చేసిన ప్రాంతాలుగా గుర్తింపు పొందిన మండలాలు ఇవి. అటువంటి ఈ ప్రాంతాలు ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటి తీవ్ర దుర్భర స్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రైతన్నకు కరువైన భరోసా....**

ఎలినినో ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా కరువు చాయలు అలుము కున్నప్పటికీ అధికార యంత్రాంగంలో గాని అధికార పార్టీ నేతల్లో గాని ఎటువంటి చలనం కనిపించలేదన్న విమర్శలు రైతుల నుండి తీవ్రంగా వ్యక్తమవుతున్నాయి. కనీసం పంటలు ఎండి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటు ఎండిన పంటలను తొలగిస్తున్న జిల్లా స్థాయి అధికారులు కానీ కూటమి నేతలు కాదని రైతులను కలిసి మనోధైర్యాన్ని నింపేందుకు ప్రయత్నించిన దాఖలాలు కూడా లేవన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి

**యల్లనూరు మండలంలో....**

మండల వ్యాప్తంగా రైతులు అధిక మొత్తంలో చీని, అరటి, దానిమ్మ, వరి పంటలను సాగు చేశారు. చిత్రావతి నది పరివాహక గ్రామాలు మినహా మిగిలిన అన్ని గ్రామాలలో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో గత నెల రోజులుగా రైతుల అవస్థలు వర్ణనాతీతం. గతంలో 500 అడుగులలో నుండి నీటిని తవ్వుకుంటున్న రైతులు ప్రస్తుతం 15వందల అడుగుల వరకు మోటార్లను ఏర్పాటు చేసుకున్న ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉంది.

**పుట్లూరు మండలంలో...**

మండలంలో రైతు పరిస్థితి ఎంత అంటే చెప్పలేనంత దుర్భర దీన పరిస్థితి.. మండలానికి కోమటి కుంట్ల, గరుగుచింతలపల్లి, పుట్లూరు చెరువులు ఆధారం. దీనికి తోడు సుబ్బరాయ సాగర్ రిజర్వాయర్ కూడా ఈ మండలానికి జీవనాధారం. అటువంటి ఈ సుబ్బరాయ సాగర్ కు సరైన రీతిలో నీరు రాకపోవడం తద్వారా చెరువులకు నీరు అందకపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయి. లక్షలు వ్యయం చేసి ఏర్పాటు చేసుకున్న బోర్లు సైతం ప్రస్తుతం దిష్టిబొమ్మలుగా మారాయి. కొత్తగా ఎన్ని బోర్లు తవ్వినా ఆశించిన స్థాయిలో నీటి సామర్థ్యం లభించక రైతులు లబోదిబోమంటున్నారు. మండల వ్యాప్తంగా నెలరోజుల వ్యవధిలోనే కొత్త బోర్లతవ్వకానికి కోట్లల్లో ఖర్చు చేశారంటే రైతు పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. సొమ్ము పోగొట్టుకున్న రైతులు ఆశలను వదులుకొని కళ్ళముందే ఎండుతున్న చెట్లను చూడలేక జెసిబిల సాయంతో తొలగించేస్తున్నారు.

**ప్రభుత్వం సహాయం అందించాలి...**

ప్రస్తుతం కరువు చాయల అలముకోగా రైతులు సుదూర ప్రాంతాల నుంచి పైప్ లైన్లు నిర్మించుకున్న ఉద్యాన పంటలకు నీటి కొరత తప్పడం లేదు. వాటిని కాపాడుకునే క్రమంలో రైతులు సుదూర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసుకుంటున్నారు. ప్రభుత్వ అధినేతలు గాని, అధికార యంత్రాంగం గాని స్పందించి ట్యాంకర్ల ద్వారా నీటిని రవాణా చేస్తున్న ఖర్చులను ప్రభుత్వం అందజేసి ఆదుకొని ఉద్యాన పంటలను కాపాడాలని రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. మరి వారి ఆశలకు అధికారులు, కూటమి నేతలు అండగా నిలుస్తారా...! లేక తమకేలా అన్నట్లు గాలికి వదిలేస్తారో వేచి చూడాలి మరి.

**మండల వ్యాప్తంగా రైతులు సాగుచేసిన పంటల వివరాలు ఎకరాలలో ఇలా ఉన్నాయి**



| | |
|---|---|
| నిమ్మ | 25 |
| అరటి | 5769, |
| ఆముదం | 313, |
| పత్తి | 140, |
| కరివేపాకు | 25, |
| మిర్చి | 24, |
| వేరుశెనగ | 57, |
| నేరేడు | 32, |
| మొక్కజొన్న | 1701, |
| మామిడి | 286, |
| వరి | 1877, |
| దానిమ్మ | 1743, |
| గుమ్మడి | 33, |
| ఎండుమిర్చి | 100, |
| కంది | 208, |
| సపోటా | 147, |
| సోయాబీన్ | 400, |
| బత్తాయి | 10014, |
| టమాటా | 166, |

ఇలా వివిధ రకాల పంటలను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం ఎలినినో ప్రభావంతో వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పంట దిగుబడిపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు.

**మండల వ్యాప్తంగా రైతులు సాగుచేసిన పంటల వివరాలు ఎకరాలలో ఇలా ఉన్నాయి.**



| | |
|---|---|
| నిమ్మ | 127, |
| బూడిద గుమ్మడి | 30, |
| అరటి | 9094, |
| ఆముదం | 52, |
| బంతి పువ్వు | 93, |
| పత్తి | 186, |
| కరివేపాకు | 175, |
| చిక్కుడు బీన్స్ | 133, |
| డ్రాగన్ ఫ్రూట్ | 22, |
| మునగ | 51, |
| వేరుశెనగ | 69 |
| నేరేడు | 70 |
| మొక్కజొన్న | 1330 |
| మామిడి | 124, |
| బొప్పాయి | 25, |
| దానిమ్మ | 973, |
| గుమ్మడి | 20, |
| ఎండుమిర్చి | 73, |
| కంది | 1042, |
| బత్తాయి | 4267 |
| టమెటా | 499 |





# పల్లె రఘునాథ్ రెడ్డి జన్మదిన వేడుకలకు భారీగా తరలివచ్చిన అభిమానులు



- అనంతపురంలోని పల్లె ఉమా నివాసం వద్ద సందడి

**అనంతపురం, సెప్టెంబర్ 18: అనంత జనశక్తి న్యూస్**

మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం అనంతపురంలోని వేణుగోపాల్ నగర్‌లో ఉన్న పల్లె ఉమా నివాసంలో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఉమ్మడి అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి పల్లె అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పల్లె నివాసం జనసంద్రంగా మారింది.పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, సౌభాగ్యరాణి దంపతులు, మనవడు వియాన్, మనవరాలు వన్షా తదితర కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి పల్లె రఘునాథ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.పుట్టపర్తి నియోజకవర్గం నుంచి వచ్చిన ప్రజలు, అభిమానులు ఆయనను గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథ్ రెడ్డి అభిమానులు, పార్టీ శ్రేణులతో ఆత్మీయంగా ముచ్చటించి, తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం పల్లె రఘునాథ్ రెడ్డి పల్లె ఉమా ఘాట్ వద్దకు వెళ్లి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.జన్మదిన వేడుకల సందర్భంగా అనంతపురం, పుట్టపర్తి నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పల్లె అభిమానుల్లో సందడి నెలకొంది.

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



- 59వ ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**అనంతపురం సెప్టెంబర్ 18,అనంత జనశక్తి న్యూస్**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో 59వ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమకు ఎదురవుతున్న స్థానిక, మౌలిక వసతులు, రెవెన్యూ, పింఛన్లు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి అర్జీలను సమర్పించారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్వయంగా పరిశీలించి, సమస్య తీవ్రతను బట్టి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే అధికారులకు సూచనలు చేసి, తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ప్రతి అర్జీని బాధ్యతగా పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావడానికి ప్రజా దర్బార్ ఒక వేదికగా ఉపయోగపడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# నల్లచెరువు గ్రామంలో నూతన విద్యుత్ దీపాలు ఏర్పాటు

**నల్లచెరువు సెప్టెంబర్ 18 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రమైన నల్లచెరువు టౌన్ లో ఎన్నో రోజులుగా విద్యుత్ దీపాలు లేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యారని ఈ విషయం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రసాద్ దృష్టికి ప్రజలు తీసుకెళ్లడంతో వెంటనే ఆయన స్పందించి ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డికి ఆదేశాలు ఇవ్వడంతో పంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో పలు వీధుల్లో నూతన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఆసియా క్రీడల్లో భారత పతాకాన్ని రెపరెపలాడించాలి



- రాష్ట్రం తరపున పాల్గొంటున్న క్రీడాకారులకు ప్రత్యేక అభినందనలు తెలిపిన మంత్రి
- క్రీడాకారులకు అండగా కూటమి ప్రభుత్వం...మంత్రి మండిపల్లి
- సీఎం చంద్రబాబు నాయుడు క్రీడలకు పెద్దపీట వేస్తున్నారు

**అమరావతి, సెప్టెంబర్ 18:అనంత జనశక్తి న్యూస్**

జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న 20వ ఆసియా క్రీడలు-2026లో భారత్ తరపున పోటీ పడుతున్న తెలుగు రాష్ట్రాల క్రీడాకారులకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆసియా క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశానికి, తెలుగు రాష్ట్రాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.భారతదేశం నుంచి 492 మంది క్రీడాకారులు 35 క్రీడాంశాల్లో పాల్గొంటున్నారని, ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి సురేఖ వెన్నం (విజయవాడ-ఆర్చరీ), జ్యోతి యర్రాజీ (విశాఖపట్నం-100 మీటర్ల హర్డిల్స్), నితీష్ కుమార్ రెడ్డి (విశాఖపట్నం-క్రికెట్), మొగిలి వెంకట రామ రెడ్డి (విశాఖపట్నం-800 మీటర్లు), సాయి కృష్ణ నల్లూరి (రాజమండ్రి-ఇస్పోర్ట్స్) భారత బృందంలో చోటు దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులు కూడా ఉండటం రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రంలో క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. గ్రామస్థాయి నుంచే క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్ర క్రీడా విధానంలో ప్రతి గ్రామంలో కనీసం ఒక క్రీడా మైదానం ఏర్పాటు చేయడం, పట్టణాల్లో క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించిందని తెలిపారు.చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రంలో క్రీడలకు అనుకూల వాతావరణం, మౌలిక వసతులు, ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహం అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల క్రీడాకారులు ఆత్మవిశ్వాసంతో పోటీపడి విజయాలు సాధించి దేశ కీర్తిని ఇనుమడింపజేయాలని మంత్రి ఆకాంక్షించారు.

# పోషకాహారంతోనే తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యం..

- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సూపర్వైజర్ మౌలాబి అవగాహన..



**గాండ్లపెంట, సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్,**

మహిళా శిశు సంక్షేమ శాఖ సూచనల మేరకు సూపర్వైజర్ మౌలాబి ఆధ్వర్యంలో మండల పరిధిలోని కురుమామిడి పంచాయతీ రెక్కమాను గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

గర్భిణులు, బాలింతలు ప్రతిరోజూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని మౌలాబి సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పప్పధాన్యాలు, పండ్లు, పాలు తదితర పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు శిశువుల ఎదుగుదల కూడా మెరుగ్గా ఉంటుందని తెలిపారు. గర్భధారణ సమయంలో ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటిస్తూ సమయానికి ఆహారం తీసుకోవాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రం ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సంబంధిత లబ్ధిదారులే తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని, దాని వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పోషకాలు అందుతాయని వివరించారు

చిన్నారుల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలించడం ఎంతో ముఖ్యమని మౌలాబి తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రతి నెలా ప్రతి చిన్నారి ఎత్తు, బరువును తప్పనిసరిగా కొలిచి నమోదు చేయాలని సూచించారు. తమ పిల్లల ఎత్తు, బరువు వయస్సుకు అనుగుణంగా పెరుగుతున్నాయా, తగ్గుతున్నాయా అనే విషయాలను తల్లిదండ్రులు అంగన్వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకోవాలని చెప్పారు పిల్లల ఎదుగుదలలో ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే సంబంధిత సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. చిన్నారులకు పరిశుభ్రమైన ఆహారం, సురక్షితమైన తాగునీరు అందించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై కూడా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు భారతి, మాస్మా, అంజినమ్మ, రాణి, ఆరోగ్య కార్యకర్త భవాని, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**ధర్మవరం రాజకీయాల్లో ఏది శాశ్వతం..? ఏది అవసరం..? అన్నది మరోసారి చర్చనీయాంశంగా మారుతోంది. నిన్నటి వరకు ఎడ మొహం, పెడ మొహం గా గుప్పించుకున్న రాజకీయ వర్గాలు.. నేడు ఒకే ఫ్లెక్సీలో చోటు సంపాదించుకోవడం స్థానిక రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఫొటో దర్శనమివ్వడం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. నిన్నటి వరకు దూరం.. నేడు దగ్గర.. ఈ మార్పు వెనుక రాజకీయ అవసరాలే కారణమా? లేక కూటమి సమన్వయానికి ఇది కొత్త అడుగా? లేక సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బిజెపి నాయకులు పరిటాల శ్రీరామ్ ను బుజ్జగించే ప్రయత్నంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. నిన్న, మొన్నటి వరకు పరిటాల శ్రీరామ్ అన్న, టిడిపి నాయకులన్న, అగ్గిమీద గుగ్గిలం మైన బిజెపి నాయకులకు అవసరం మేర ఎంతటి కైనా దిగజారుతారన్న దానికి ఇదో తార్కాణంగా తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో టిడిపిని మచ్చిక చేసుకోవడం లో భాగంగా ఫ్లెక్సీలో శ్రీరామ్ ఫోటో దర్శన ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. టిడిపి సహకారం లేకపోతే గెలుపు బాటలో అట్టడుగుకు దిగజారి పోతుందేమోనన్న భయం వారిలో ఆవహించినట్లయిదో ఏమో? బిజెపి నాయకులలో కూటమి రాగం పట్టారు. ఒక మంత్రిగా నియోజకవర్గంలో బిజెపి స్థానిక ఎన్నికల్లో తారుమారయితే తమ ఉనికిని ఎక్కడ కోల్పోతారేమోనన్న ఆందోళన చెంది శ్రీరామ్ ను దగ్గరకు చేర్చుకుని సార్వత్రిక ఎన్నికలలో మంచి ఫలితాలు సాధించడం కోసం కూటమి రాజకీయం తెరలేపిందోనన్న విమర్శలు టిడిపి నాయకులు ద్వారా తెలుస్తోంది. ఏది ఏమైనా బిజెపి ఫ్లెక్సీ లలో పరిటాల శ్రీరామ్ ఫోటో ఏర్పాటు టిడిపిలోనూ ప్రజలలో ఆసక్తిని రేకెత్తిస్తోందన్న చర్చ జోరందుకుంది.**

# అవసరాల రాజకీయాలకు కేరాఫ్ ధర్మవరం..!





**నిన్నటి వరకు దూరం.. నేడు ఫ్లెక్సీల్లో సన్నిహితం..!**
- **బీజేపీ ఫ్లెక్సీల్లో పరిటాల శ్రీరామ్ ఫొటోపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి**
- **నిన్నటి వరకు విమర్శలు.. నేడు ఫొటోలకు పెద్దపీట.. ఇదేనా మారిన రాజకీయ సమీకరణం?**
- **వినాయక చవితి వేడుకల వేదికగా కూటమి సఖ్యతకు కొత్త సంకేతాలా..?**
- **స్థానిక ఎన్నికల వేళ 'అవసరాల బంధం'కు తెరలేపుతున్నారా..?**
- **ఫ్లెక్సీల్లో మార్పు.. కూటమి రాజకీయాల్లో కొత్త చర్చకు తెర**







**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**
**సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం రాజకీయాల్లో మాటల యుద్ధం కొత్తేమీ కాదు. ఒక దశలో టీడీపీ నాయకత్వంపై, వినాయకుడి సాక్షిగా తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన బీజేపీ శ్రేణులు.. ఇప్పుడు అదే శ్రీరామ్ ఫొటోను తమ ఫ్లెక్సీల్లో ప్రదర్శించడం చర్చకు దారితీస్తోంది. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరనే నానుడికి ఈ పరిణామం మరో ఉదాహరణగా మారిందా? అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నిన్నటి వరకు రాజకీయ దూరాన్ని ప్రదర్శించిన వారు.. నేడు ఆ దూరాన్ని తగ్గించుకుని ఫొటోల ద్వారా సాన్నిహిత్యాన్ని చాటుకోవడం వెనుక ఏదో రాజకీయ లెక్క ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

అయితే ఇది కేవలం పండుగ శుభాకాంక్షల ఫ్లెక్సీలో భాగమేనా? లేక భవిష్యత్ రాజకీయ అవసరాలకు అనుగుణంగా ముందస్తు అడుగులు వేస్తున్నారా? అన్నది మాత్రం స్పష్టత రావాల్సి ఉంది. ఫ్లెక్సీ మారింది.. ఫొటో మారింది.. మరి రాజకీయ వైఖరి కూడా మారిందా? అన్న ప్రశ్న ప్రస్తుతం టీడీపీ, బీజేపీ శ్రేణుల్లోనే కాకుండా స్థానిక రాజకీయాలను పరిశీలిస్తున్న వారిలోనూ ఆసక్తిని కలిగిస్తోంది.

**స్థానిక ఎన్నికలే అసలు టార్గెట్టా..?**

స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు మరింత ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రతి ఓటు కీలకంగా మారే పరిస్థితుల్లో కూటమిలోని భాగస్వామ్య పార్టీల మధ్య పరస్పర సహకారం అవసరం అవుతుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటి నుంచే ఒకరి నొకరు మచ్చిక చేసుకునే ప్రయత్నాలు మొదలయ్యాయా? అన్న చర్చకు తెరలేచింది.

ఒకవైపు అధికారంలో భాగస్వామ్యమైన పార్టీగా బీజేపీ తన స్థానిక బలాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉండగా.. మరోవైపు టీడీపీకి కూడా క్షేత్ర స్థాయిలో బలమైన క్యాడర్, నాయకత్వం ఉంది. ఈ రెండు వర్గాల మధ్య సమన్వయం ఎంత బలంగా ఉంటే అంత రాజకీయ ప్రయోజనం ఉంటుందన్న లెక్కలతోనే ఫ్లెక్సీల్లో సైతం సఖ్యతను చాటుతున్నారా అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఎన్నికల వేళ అవసరం ఒకరిని మరొకరికి దగ్గర చేస్తుందా..?**

రాజకీయ ప్రయోజనం కోసం గత విభేదాలను పక్కన పెట్టే పరిస్థితి వచ్చిందా..? అన్న ప్రశ్నలు ఇప్పుడు ధర్మవరం రాజకీయ చర్చల్లో వినిపిస్తున్నాయి. అయితే రానున్న రోజుల్లో ఈ సాన్నిహిత్యం కేవలం ఫ్లెక్సీలకే పరిమితమవుతుందా.. లేక క్షేత్రస్థాయిలోనూ కనిపిస్తుందా అన్నదే అసలు ప్రశ్నగా మారింది.

**కూటమి రాగం వెనుక వ్యూహమేమిటి..?**

2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో టీడీపీ, బీజేపీ, జనసేన మధ్య రాజకీయ సమన్వయానికి ప్రాధాన్యత పెరిగింది. ధర్మవరం నియోజకవర్గంలో బీజేపీ నుంచి సత్యకుమార్ యాదవ్ ఎమ్మెల్యేగా ఉండగా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పరిటాల శ్రీరామ్ రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక స్థాయిలో రెండు పార్టీల మధ్య సమన్వయం ఎలా కొనసాగుతుందన్నది సహజంగానే ఆసక్తికర అంశంగా మారుతోంది.

ఇలాంటి సమయంలో బీజేపీ ఫ్లెక్సీల్లో శ్రీరామ్ ఫొటోకు చోటు దక్కడం 'కూటమి ధర్మం'కు సంకేతమా? లేక స్థానిక రాజకీయ అవసరాలకు అనుగుణంగా వేసిన వ్యూహాత్మక అడుగా? అన్న చర్చకు బలం చేకూరుస్తోంది. గతంలో ఉన్న రాజకీయ విభేదాలను పక్కన పెట్టి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అడుగులు వేయడం రాజకీయాల్లో సహజమేనని కొందరు చెబుతుండగా.. మరికొందరు మాత్రం ఎన్నికల సమీకరణాల నేపథ్యంలోనే ఈ సాన్నిహిత్యం పెరుగుతోందని వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఫ్లెక్సీల్లో ఫొటోలు.. రాజకీయాల్లో లెక్కలు..!**

ధర్మవరం రాజకీయాల్లో ఇప్పుడు ఫ్లెక్సీలు కూడా ఒక రకంగా రాజకీయ సందేశాలను మోస్తున్నాయన్న చర్చ సాగుతోంది. ఎవరి ఫొటో ఉంది..? ఎవరి ఫొటో లేదు..? ఎవరిని ముందుకు తీసుకొస్తున్నారు..? ఎవరిని పక్కన పెడుతున్నారు..? అనే అంశాలు సైతం నాయకులు, కార్యకర్తల మధ్య చర్చకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ ఫ్లెక్సీలో శ్రీరామ్ ఫొటో కనిపించడం సాధారణ ప్రచార అంశం కంటే ఎక్కువగానే రాజకీయ ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఫొటో అంటే కేవలం ఫొటోనేనా..? లేక రాజకీయ స్నేహానికి సంకేతమా..? అన్నది ఇప్పుడు తేలాల్సి ఉంది. ఒకప్పుడు విమర్శలతో వేడెక్కిన వాతావరణం.. ఇప్పుడు ఫ్లెక్సీల్లో పరస్పర సాన్నిహిత్యంగా కనిపించడం రాజకీయ పరిణామాల్లో వస్తున్న మార్పులకు అద్దం పడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇక ముందేం జరుగుతుంది..?**

వినాయక చవితి ఉత్సవాల ఫ్లెక్సీలతో మొదలైన ఈ కొత్త చర్చ.. రానున్న రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందోనన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది. ఈ ఫొటో కేవలం పండుగ శుభాకాంక్షలకే పరిమితమవుతుందా? లేక స్థానిక ఎన్నికల వరకు ఈ సాన్నిహిత్యం కొనసాగుతుందా? క్షేత్రస్థాయిలో టీడీపీ-బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి అడుగులు వేస్తారా? అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా ధర్మవరం రాజకీయాల్లో ఫ్లెక్సీపై కనిపించిన ఒక్క ఫొటో.. రాజకీయ వర్గాల్లో మాత్రం పెద్ద చర్చకే దారితీసింది. నిన్నటి వరకు ఉన్న దూరం నేడు తగ్గిందా? రాజకీయ అవసరాలు కొత్త బంధాలకు బాటలు వేస్తున్నాయా? లేక కూటమి ఐక్యతను బహిరంగంగా చాటేందుకు చేస్తున్న ప్రయత్నమా? అన్న ప్రశ్నలకు రానున్న రాజకీయ పరిణామాలే సమాధానం చెప్పాల్సి ఉంది. ఫ్లెక్సీపై ఫొటో మారింది.. ఇక రాజకీయ ముఖచిత్రం ఎలా మారుతుందో వేచి చూడాల్సిందే..!

## లోకేష్ పర్యటనకు తరలిరండి



- **రామగిరి పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు**
- **పార్టీ నేతలతో సమావేశం..కార్యక్రమంపై పలు సూచనలు**

**రాప్తాడు సెప్టెంబర్ 18 అనంత జనశక్తి న్యూస్**

ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పర్యటనకు పెద్ద ఎత్తున తరలి రావాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రామగిరి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ శాఖ అతిథి భవనంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు.ఈకార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈనెల 22న నారా లోకేష్‌రాప్తాడుతో పాటు చెన్నేకొత్తపల్లికి రానున్నట్టు ఎమ్మెల్యే సునీత తెలిపారు. రాప్తాడులో ర్యాలీ ఉంటుందని.. అలాగే పార్టీ కార్యకర్తల సమావేశం కూడా ఉంటుందన్నారు. ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహావిష్కరణ ఉన్న నేపథ్యంలో భారీగా తరలివస్తామని నాయకులు చెబుతున్నారన్నారు. రామగిరి మండలం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు వచ్చేందుకు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. దీనిపై నాయకులు చొరవ తీసుకుని పర్యటనకు వచ్చేలా చూడాలన్నారు. నియోజకవర్గంలో అత్యధిక మంది రామగిరి నుంచే రావాలన్నారు. మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం పలికి.. నియోజకవర్గంలో మన పార్టీ బలాన్ని చూపించాలని పిలుపునిచ్చారు.

## పుట్టపర్తి లో ఘనంగా పోషన్ మా

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 18 అనంత జన శక్తి న్యూస్.**

శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్, ఐసీడీఎస్ పీడీ ప్రమీల ఆదేశాల మేరకు పుట్టపర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అయ్యగారి రజిత పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ ఏ వి రమణారెడ్డి, పుట్టపర్తి సీడీపీఓ ఈ జయంతి పుట్టపర్తి ఎమ్ పి డి వో నాగేశ్వరరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవి రమణారెడ్డి మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండాలని మంచి పోషకాహారం అవసరం మనం తినే ఆహారంలో ఎక్కువగా తృణ ధాన్యాలు, ఆకు కూరలు ఉండేలా చూసుకోవాలన్నారు ముఖ్యంగా మనకు పరిసర ప్రాంతాలలో దొరికే మునగాకు బచ్చలి కూర, పాలకూర వంటి ఆకుకూరలు మొలకలు ఎక్కువగా తినడం మంచిదన్నారు.సీడీపీఓ ఈ జయంతి మాట్లాడుతూ పౌస్టికాహార లోపంతో ఏ తల్లి ఏ బిడ్డ ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు మంచి ఆహారం మంచి నిద్ర ఉన్నపుడే మనిషి ఆరోగ్యంగా జీవిస్తాడని తక్కువ చక్కెర తక్కువ ఉప్పు ఎక్కువ ప్రొటీన్ , ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు ఎం పి డి వో మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు ఆహారంలో మార్పులు చేసుకోవాలని తక్కువ ఉప్పు తక్కువ చక్కర తీసుకోవడం చాలా మంచిదని పరిసర ప్రాంతాల్లో విరివిగా లభించే కూరగాయలు చిరుధాన్యాలు ఆకుకూరలు తినడం అందరికీ మంచిది అన్నారు కార్యక్రమంలో నల్లచెరువు ఎంపీడీఓ అశోక్ కుమార్ రెడ్డి పుట్టపర్తి ఐసీడీఎస్ సూపర్వైజర్ అయ్యగారి రజిత, మండల స్థాయి అధికారులు వైస్ ఎంపీపీ హనుమంత రెడ్డి ,ఎంపీటీసీ లు సర్పంచులు పుట్టపర్తి , కొత్తచెరువు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## శ్రీ యోగివేమన ఆలయం నుంచి వినాయకుని నిమజ్జన వేడుకలు..

- **పీఠాధిపతి నంద వేమారెడ్డి..**

**గాండ్లపెంట, సెప్టెంబర్,18, అనంత జనశక్తి న్యూస్,**

మండల పరిధిలోని కటారుపల్లి గ్రామంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన శ్రీ యోగివేమన ఆలయం నుంచి శుక్రవారం వినాయకుని నిమజ్జన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి నంద వేమారెడ్డి ఆధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి నంద వేమారెడ్డి మాట్లాడుతూ వినాయకుని నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులకు ఆహ్లాదకరంగా, వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కేరళకు చెందిన కళాకారుల చండీ మేళం, కేరళ కావిడి ప్రదర్శనలు, కర్నూలు ప్రాంతానికి చెందిన కళాకారుల భరతనాట్యం ప్రదర్శనలు నిర్వహించినట్లు చెప్పారు. కళాకారుల ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు వినాయకుని ఊరేగింపు సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని భక్తిశ్రద్ధలతో స్మరిస్తూ ముందుకు సాగారు. ఊరేగింపు మార్గంలో భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కటారుపల్లిలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తుల కోసం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సుమతి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు పర్యవేక్షించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగియడంతో ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు, భక్తులు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు, భక్తులు, పోలీసు సిబ్బంది, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



## రిటైర్డ్ పి.ఈ.టి గోవర్ధన్ గౌడ్ ఆకస్మిక మృతి

**-సంతాపం తెలిపిన పాఠశాల ఉపాధ్యాయ సంఘం నాయకులు.**

**ధర్మవరం సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్:**



పట్టణంలోని కొత్తపేటలో గల ఎస్ పి సి ఎస్ ప్రభుత్వ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో కోషిని గోవర్ధన్ గౌడ్ పి ఈ టి గా విధులు కొనసాగించి, రిటైర్డ్ అయ్యారు. అనంతరం కొద్ది రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో వారు అనారోగ్యానికి గురయ్యారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు గోవర్ధన్ గౌడ్ ని బెంగళూరులోని సెయింట్ జాన్స్ హాస్పిటల్ లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగిందని కుమారులు తెలిపారు. ఈ సందర్భంగా వారి స్వగృహం అయిన ధర్మవరం లోని యాదవ వీధిలో గల వారి ఇంటికి పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులు, రిటైర్డ్ టీచర్స్, ఎంఈఓ లు, హెడ్మాస్టర్లు, కుటుంబ బంధుమిత్రులు చేరుకొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు పాఠశాలకు చేసిన సేవలను కొనియాడుతూ, గోవర్ధన్ గౌడ్ మృతి తీరని లోటు అని తెలిపారు. అంతేకాకుండా పాఠశాలలో విధులలో ఉన్నప్పుడు పాఠశాల లోని విద్యార్థులకు వివిధ రకాలైన స్పోర్ట్స్ గేమ్స్ నేర్పిస్తూ ఎన్నో రకాలుగా పోటీలలో విజేతలై పాఠశాలకే వన్నెతెచ్చారని వారు తెలిపారు.

## ప్రజా ప్రతినిధులు పార్టీలకు అతీతంగా పని చేయాలి

- **ఎంపీపీ ఏ వీ రమణారెడ్డి.....**

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 18**
**అనంత జన శక్తి న్యూస్.**



స్థానిక సంస్థలలో ఎంపికైన ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా ప్రజలకు సేవ చేయాలని పుట్టపర్తి ఎంపీపీ ఏవి రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆఖరి సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుట్టపర్తి ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, నల్లచెరువు ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి, ఐ సి డి ఎస్ సి డి పి గాయత్రి, వైస్ ఎంపీపీ హనుమంత రెడ్డి కోఆప్షన్ సభ్యులు మహబూబ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఏ వీ రమణారెడ్డి మాట్లాడుతూ రాజకీయం అనేది ఎన్నికల వరకే ఉండాలని ఎన్నికల అనంతరం ఏ పార్టీ అయినా అభివృద్ధి కోసం పోటీ పడాలని, పార్టీలకు అతీతంగా, ప్రజా ప్రతినిధులు ప్రజలకు సేవ చేయాలని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతుల సమస్యల పట్ల వెంటనే స్పందించాలని వారి సమస్యలను పరిష్కరించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. తను స్వతంత్ర సమరయోధుల కుటుంబం నుంచి వచ్చాను కాబట్టే పార్టీలకు అతితంగా సేవ చేశానని తెలిపారు ఐదు సంవత్సరాల పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు నన్ను సహకరించి ఎలాంటి సమస్యలకు తావు లేకుండా పదవీకాలం పూర్తి చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అధికారులు , ప్రజా ప్రతినిధులు సహకారంతో అభివృద్ధి చేశామని భవిష్యత్తు లోకూడా ప్రజా ప్రతినిధులు సైతం ఇలాగే సహకరించాలని తెలిపారు. అనంతరం ఎంపీపీ కుటుంబ సభ్యులను ఉపాధి హామీ,వ్యవసాయ శాఖ, ఐసిడిఎస్,ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఘనంగా సన్మానించారు. అనంతరం మండలంలోని ఎంపీటీసీలను, ఎంపీపీ, రమణారెడ్డి,మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి మండలంలోని ఎంపీటీసీలు అందరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో, శంకర్ రెడ్డి, మండలంలోని ఎంపిటిసి లకు, కోఆప్షన్ సభ్యులు బాబు సాబు ను ఘనంగా సన్మానించారు..ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంపీటీసీలు,మండల స్థాయి అధికారులు పంచాయతీ సెక్రెటరీ సర్పంచులు ,ఉపాధి హామీ సిబ్బంది. పాల్గొన్నారు

## ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవ వేడుకలు

- **ఫార్మసిస్టుల పాత్రపై విద్యార్థుల అవగాహన ర్యాలీ**

**అనంతపురము, సెప్టెంబర్ 18:అనంత జనశక్తి న్యూస్**

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 25న ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూచనల మేరకు కళాశాలలో వివిధ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సోమశేఖర్, నోడల్ అధికారి జి. అర్చన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఫార్మసీ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు వివిధ నినాదాలతో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫార్మసిస్టుల బాధ్యతలు, ఔషధాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల ప్రాధాన్యతపై విద్యార్థులు నినాదాల ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఫార్మసీ వృత్తిపై అవగాహన పెంపొందించడంతో పాటు సమాజ ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల కీలక పాత్రను తెలియజేశారు.



# చేనేత సర్టిఫికెట్లలో "దందా"...!!




- అర్హతకు బదులు సిఫార్సులకే విలువా..?
- అనర్హులకు సర్టిఫికెట్లు కట్టబెడుతున్నారంటూ టీడీపీ ఫైర్....
- నగదు లావాదేవీలపై తీవ్ర ఆరోపణలు..
- రమణారెడ్డిని సస్పెండ్ చేసి సమగ్ర విచారణకు డిమాండ్....




**ధర్మవరం సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం చేనేత పింఛన్ సర్టిఫికెట్ల జారీ వ్యవహారం ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీసింది. నిజంగా చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న అర్హులైన కార్మికులకు పింఛన్ సర్టిఫికెట్లు అందాల్సి ఉండగా.. నిబంధనలను పక్కనపెట్టి అనర్హులకు కూడా సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నారని టీడీపీ నాయకులు తలారి చంద్రమోహన్ బాబు తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ వ్యవహారంలో చేనేత శాఖ అధికారులు, వైసీపీ నాయకులు కలిసి అక్రమాలకు పాల్పడుతున్నారని వారు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

అర్హత ఉన్నవాడికి సర్టిఫికెట్ ఇవ్వడానికి పార్టీ చూడాల్సిన అవసరం లేదు.. కానీ అర్హత లేనివాడికి రాజకీయ సిఫార్సుతో సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వాలి? అని ఆయన ప్రశ్నించారు. వైసీపీ నాయకుల సిఫార్సులతో వచ్చిన వారికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారని, నిజమైన చేనేత కార్మికులు మాత్రం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.

**తనిఖీల పేరుతో అసలు కథ ఇదేనా..?**

చేనేత సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన అధికారులు రమణారెడ్డి, సీనా నాయక్ వ్యవహారశైలిపైనా టీడీపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో అర్హతలను పూర్తిగా పరిశీలించకుండానే అనర్హులకు సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. తనిఖీ చేయాల్సిన అధికారులు నిబంధనలను అమలు చేస్తున్నారా.. లేక సర్టిఫికెట్లు మంజూరు చేయడానికే పరిమితమవుతున్నారా? అని నిలదీశారు.ఈ సర్టిఫికెట్ల జారీ వెనుక భారీగా నగదు లావాదేవీలు, లంచాల వ్యవహారం నడుస్తోందనే ఆరోపణలు ఉన్నాయని టీడీపీ నేతలు పేర్కొన్నారు. డబ్బులు చేతులు మారిన తర్వాతే అనర్హులకు సర్టిఫికెట్లు అందుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. ప్రతి దరఖాస్తు వెనుక జరిగిన పరిశీలనను ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు.





**ఎవరికి ఇచ్చారు..? ఎందుకు ఇచ్చారు..?**

ఇప్పటివరకు ఎన్ని సర్టిఫికెట్లు జారీ చేశారు..? వాటిలో ఎంతమంది నిజమైన చేనేత కార్మికులు..? ఎంతమంది అర్హత లేనివారు..? సర్టిఫికెట్ల జారీకి ఎవరి సిఫార్సులు వచ్చాయి..? అనే వివరాలను బయటపెట్టాలని టీడీపీ నాయకులు కోరారు. గతంలో మంజూరైన సర్టిఫికెట్లను కూడా పునఃపరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన వాటిని గుర్తించాలని అన్నారు.

**రమణారెడ్డిని సస్పెండ్ చేయాలి**

ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న హ్యాండ్లూమ్ అధికారి రమణారెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి, సీనా నాయక్ పాత్రపైనా పూర్తి స్థాయి విచారణ జరపాలని టీడీపీ నేతలు తలారి చంద్రమోహన్ బాబు, బొట్టు కిష్ట, జింకల రాజన్న డిమాండ్ చేశారు. నగదు లావాదేవీల ఆరోపణలు నిజమా.. కాదా అన్నది విచారణలో తేల్చాలని, తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి సర్టిఫికెట్ మంజూరు చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. అయితే రాజకీయ సిఫార్సులు, అక్రమాలకు తావిస్తూ నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తే మాత్రం చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

చేనేత కార్మికుల కోసం ఉద్దేశించిన పింఛన్ పథకం.. కొందరి జేబులు నింపే వ్యవహారంగా మారకూడదని అన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలను బయటపెట్టాలని, లేకపోతే చేనేత కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని టీడీపీ నాయకులు హెచ్చరించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

- నిమజ్జనానికి వెళ్తుండగా విషాదం.. ట్రాక్టర్–ఆటో ఢీ....
- చిన్నారి మృతి.. పలువురికి తీవ్ర గాయాలు...



**ధర్మవరం సెప్టెంబర్ 18 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం వినాయక నిమజ్జన కార్యక్రమానికి వెళ్తున్న వారిని విషాదం వెంటాడింది. ధర్మవరం పట్టణంలోని కదిరి గేటు సమీపంలో శుక్రవారం ట్రాక్టర్-ఆటో ఢీకొన్న ఘటనలో శారదానగర్‌కు చెందిన చిన్నారి వర్షిత మృతి చెందగా, పదిమందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనేందుకు పలువురు ఆటోలో వెళ్తుండగా కదిరి గేటు వద్ద ట్రాక్టర్ ఆటోను ఢీకొన్నట్లు సమాచారం. ప్రమాదంలో పలువురికి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడపడంతో పాటు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే ప్రమాదానికి అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి వివరాలు సేకరించారు.

**బాధితులను పరామర్శించిన మంత్రి సత్యకుమార్......**

ప్రమాద విషయం తెలుసుకున్న మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. గాయపడిన వారికి అండగా ఉంటామని, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

**ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన హరీష్ బాబు...**

ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాద వివరాలను వైద్యులు, బాధితుల నుంచి అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

చిన్నారి వర్షిత మృతి చెందడంతో శారదానగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించాలి!



- పెరిగిన వార్డుల లో ఎస్సీ ,ఎస్టీ లకు సీట్ల సంఖ్య పెంచండి.
- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవరకొండ రమేష్.

**ధర్మవరం సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్:**

పెరిగిన వార్డులలో ఎస్సీ ఎస్టీలకు సీట్ల సంఖ్య పెంచాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవరకొండ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాలమేరకు త్వరలొ జరగబోయే మున్సిపల్ ఎన్నికలలో ధర్మవరం మున్సిపాలిటిలొ గతంలొ ముప్పై రెండు(32)వార్డులు ఉన్నప్పుడు యస్సి02,యస్టి01 రిజర్వేషన్ కల్పించారు అని, మరి నేడు ప్రభుత్వం. 40వార్డులు పెరిగినప్పుడు రిజర్వేషన్ పెంచలేదు అని తెలిపారు. ప్రస్తుతం గ్రేడ్ వన్ మున్సిపాలిటి, నలభై ఎనిమిది(48)వార్డులు పెరిగినందున ఎస్సీలకుఐదు(05), ఎస్టిలకుమూడు(03)సీట్లసంఖ్యను పెంచాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలొ వైయస్సార్ యస్సి సెల్ రాష్ట్ర కార్యదర్శియం.చౌడప్ప,యస్సి సెల్ రూరల్ అధ్యక్షులుకునుతూరు గోపాల్, బత్తుల.నాగార్జున, పి.కుళ్లాయప్ప,పి. శ్రీనివాసులు,సాకే. వెంకటేష్,నామాల రామాంజినేయులు.వెంకటరమణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలలో భరతనాట్యంతో కనువిందు







- సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామంలో వినాయక సందడి.
- పల్లెల్లో ఆప్యాయంగా పలకరించిన పండుగ వేళ.

**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్:**

శ్రీ సత్యసాయి జిల్లా, ధర్మవరం నియోజకవర్గం, గొట్లూరు గ్రామంలోని వినాయక పండుగ సందర్భంగా కురబ కాలనీలో భరత నాట్యం గ్రామంలో కనువిందు కలిగించింది. గిరక స్నేహ, శ్రీ రాఘవి రెడ్డి ,పూర్వశ్రీ భరత నాట్యం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని చిన్నా పెద్దా అందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా కలిసి వినాయక పండుగను ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. చుట్టుపక్కల వాతావరణం మొత్తం పండుగ సందడితో కళకళలాడింది. నవ్వుతూ, ఆనందంగా,చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ కలిసి ఆనందాన్ని పంచుకోవడం, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకోవడం పండుగకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, గ్రామ పెద్దలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా పల్లె రఘునాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు.

- శ్రీనివాస డిగ్రీ మరియు పీజీ కళాశాల ప్రిన్సిపల్ ముసల్ రెడ్డి.

**ధర్మవరం సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఆధ్వర్యంలో బాలాజీ విద్యాసంస్థల అధినేత, కరస్పాండెంట్ డాక్టర్ పల్లి రఘునాథరెడ్డి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ముసలి రెడ్డి తోపాటు అందరూ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... బాలాజీ విద్యాసంస్థల ద్వారా ఎంతో మంది ఉద్యోగాలు పొందడం జరిగిందని, వారి జీవన విధానానికి తోడ్పడడం ఎంతో శుభదాయకమని, సంతోషదాయకమని తెలిపారు. అంతేకాకుండా పలు సేవా సంస్థల్లో ముందడుగు వేస్తూ విద్యార్థుల్లో మంచి విద్యను అభ్యసింపచేసేలా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.



## ఎల్ నినో ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోండి

**రాయదుర్గం, సెప్టెంబర్ 18, అనంత జన శక్తి న్యూస్ :**

ఎల్ నినో ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఉదారంగా ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాయదుర్గం శాఖ. స్థానిక శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు నిర్వహించిన ప్రజాదర్బార్ లో శాసనసభ్యులకు వినతి పత్రం అందించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కు రాయదుర్గం కమ్యూనిస్ట్ కమిటీ ఈ క్రింద కనబరిచిన సమస్యలను ఏ కరువు పెట్టి అర్జీ రూపంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులకు అందించారు.ఈ ఖరీఫ్ లో ఎండిపోయిన పంటలకు ఇన్పుట్ సబ్సిడీ అందించాలి. హెచ్ ఎల్ సి ఆయకట్టు క్రింద పంటలు సాగుచేసే రైతులకు ఈ సంవత్సరం సాగునీరు అందించక పోవడం వల్లన పంటలు సాగు చేయని ప్రతి రైతుకు ఎకరాకు 30 వేల రూపాయలు పంట నష్టపరిహారం అందించాలి. కరువు పరిస్థితుల దృష్ట్యా అప్పులను రద్దు చేయాలి. ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో గడ్డి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కార్మికులు, వ్యవసాయ కూలీలు వలసలు పోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. రాయదుర్గం నియోజకవర్గం లోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి.



# ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం




- పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి
- పుట్టపర్తి క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**పుట్టపర్తి సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**

ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అన్నారు.పుట్టపర్తి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆమె ప్రతి సమస్యను స్వయంగా విని వివరాలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ప్రజల సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా, సమస్యలపై స్పందించి నిర్ణీత సమయంలో పరిష్కారం చూపేలా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి స్పష్టం చేశారు.

# శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ కు రూ.80,116 విరాళం

**యాడికి, సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**



మండల కేంద్రంలో ని ఉన్నత పాఠశాల మైదానం పక్కన నాగులకట్ట వద్ద ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ కు రూ.80,116 విరాళం ను అందచేశారని శుక్రవారం ఆలయ అభివృద్ధి సహాయకుడు గుండా నారాయణస్వామి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తికొండ గ్రామ వాస్తవ్యులు కీర్తిశేషులు చింతా పాండురంగయ్య వారి ధర్మపత్ని లక్ష్మీదేవి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అభివృద్ధి కార్యక్రమాలకు, స్పటిక లింగం ప్రతిష్ఠాపన మహోత్సవానికి రూ. 80,116 ను అందచేశారని తెలిపారు. చింతా పాండురంగయ్య ,ధర్మపత్ని లక్ష్మీదేవి లు , కుటుంబం సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ని ఆలయ కమిటీ సభ్యులు వేడుకోన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# క్రీడా సామాగ్రి ని అందచేసిన ఆదానీ సిమెంట్ ఫ్యాక్టరీ



**యాడికి, సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్:**

మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బోయరెడ్డి పల్లె అదాని సిమెంట్ మేనేజ్మెంట్ రామ్ రాజ్ ఏపీటీఎఫ్ శ్రీనివాస్ యాదవ్ విన్నపం మేరకు శుక్రవారం రూ. 20,000 వేలు విలువ చేసే వాలీబాల్ కు సంబంధించిన క్రీడా సామాగ్రి ని అందచేశారు. షూస్ 12 జతలు, నెట్ 1, బాల్స్ 2, పోల్స్ 2, బాల్స్ 2, సిమెంట్ ఫ్యాక్టరీ నందు శ్రీనివాస్ యాదవ్, వారిస్, పిడి శివశంకర్లకు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు తెలిపారు .పాఠశాలలో పీడీలు చంద్రకళ శివశంకర్ క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పిల్లలను నేషనల్ స్థాయికి తీసుకెళ్లారని తెలిపారు. పిల్లలకు సరిపడా క్రీడా సామాగ్రి లేనందున అదాని సిమెంట్ రామరాజు తో ఈ విషయాన్ని ప్రస్తావించగా వారు అందుకు స్పందించిన పాఠశాల పిల్లలకు క్రీడా సామాగ్రి అందజేసి సహకరించినందుకు ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు తెలిపారు.ఉపాధ్యాయ సిబ్బంది వారిని అభినందించారు.ఆదానీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కు ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# గెట్ టు గెదర్ లో మిత్రులందరూ హాజరు కావాలి

**యాడికి (ఉరవకొండ), సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్ :**




ఉరవకొండ పట్టణంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన 1995 96 పదవ తరగతి విద్యార్థులు ఆదివారం నిర్వహిస్తున్న గెట్ టు గెదర్ లో మిత్రులందరూ హాజరు కావాలి మిత్ర బృందం శుక్రవారం తెలిపారు.ఈ సందర్భంగా మిత్ర బృందం మాట్లాడుతూ 30 సంవత్సరాలు తర్వాత కలుస్తున్న అపూర్వ కలయిక అని, 1995 96 సంవత్సరానికి చెందిన పదవ తరగతి విద్యార్థులు అందరూ ఆదివారం న కొర్రకోడు డ్యాం లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిత్రులందరూ ఉదయం 9గంటల నుండి 10గంటలలోపు నిర్దేశిత ప్రాంతానికి చేరుకోవాలని, 10 గంటల నుండి 10.15 గంటల వరకు వరకు ప్రార్థన తో కార్యక్రమం ప్రారంభం అవుతుందని,10.30 గంటల నుండి 11గంటల వరకు మరణించిన మిత్రుల ఆత్మ శాంతి కోసం మౌనం పాటించడం జరుగుతుందని తెలిపారు .తదుపరి మిత్రులు ఒక్కొక్కరిగా తమను పరిచయం చేసుకొని, వారి పా త జ్ఞాపకాలను గుర్తు చేసుకొనుట (ఒక్కొక్కరికి 3 నిమిషాలు వ్యవధి మాత్రమే)అని, భోజన విరామము మధ్యాహ్నం 1గంట నుండి 2 గంటల వరకు ఉంటుందని,2 గంటల నుండి 2.30 గంటలకు ఫోటో సెషన్ (గ్రూప్ ఫోటో దిగడం) ఉంటుందని, 2.30 గంటల నుండి 3.30 గంటల వరకు మన గ్రూపు తరపున జరపబోవు భవిష్యత్ కార్యాచరణ పై చర్చించడం జరుగుతుందని తెలిపారు. సాయంకాలం 4గంటవకు వందన సమర్పణతో కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు.కావున ప్రతి ఒక్కరు దీనిని తమ వంతు గురుతర బాధ్యతగా తీసుకుని దిగ్విజయం చేయాలని కోరారు . *ముఖ్య గమనిక: ఈ కార్యక్రమం కు విచ్చేయుచున్న ప్రతి మిత్రుడు మద్యపానమునకు దూరంగా ఉండాలని పదే పదే విన్నవించు కుంటున్నాము.

# కరువు నివారణకు తక్షణమే ప్రణాళిక ప్రకటించాలి

- రైతులకు ఎకరాకు రూ.45 వేల నష్టపరిహారం ఇవ్వాలి
- పంట, ప్రైవేటు రుణాలు మాఫీ చేసి రైతులను ఆదుకోవాలి
- రైతు సంఘాల నాయకుల డిమాండ్

**రాప్తాడు, సెప్టెంబర్ 18 అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం జిల్లాను కరువు బారి నుంచి ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కరువు ప్రణాళిక ప్రకటించాలని సీపీఎం, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 22న జిల్లాకు వస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న కరువు పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు భరోసా కల్పించాలని కోరారు. రాప్తాడు మండల కేంద్రంలో శుక్రవారం సీపీఎం, రైతు సంఘాల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలరంగయ్య, రామాంజనేయులు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులతో పంటలు వేసుకుని నష్టపోయిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.45 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.అలాగే పాడి రైతులను ఆదుకునేందుకు గ్రామాల్లో దాన, పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట పొలాలు, ఉద్యాన తోటలను సందర్శించి రైతుల వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం తెలుసుకోవాలని సూచించారు. రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలతో పాటు ప్రైవేటుగా చేసిన అప్పులను కూడా మాఫీ చేసి రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. బోరుబావుల కింద సాగు చేస్తున్న పంటలు సైతం ఎండిపోతున్న నేపథ్యంలో విద్యుత్ కోతలను నివారించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా పగటిపూట 9 గంటల నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని కోరారు.

**రైతులు తమ సమస్యలు తెలియజేయాలి**

జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను పరిశీలించి, గ్రామాల్లో రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకునేందుకు రైతు సంఘాల రాష్ట్ర నాయకులు జిల్లాకు వస్తున్నారని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రాప్తాడు మండలంలోని రైతులు, గొర్రెలు-పశువుల కాపరులు, ప్రజలు, నిరుద్యోగులు తమ సమస్యలను రైతు సంఘాల బృందం దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఒత్తిడి తెస్తామని తెలిపారు .ఈ కార్యక్రమంలో పోతులయ్య, పుష్పరాజు, సుబ్బిరెడ్డి, ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నిక ఏదైనా విజయం కూటమిదే

- మంత్రి కందుల దుర్గేష్
- గుంటూరులో జరిగిన కూటమి పార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- కూటమి ధర్మాన్ని పాటిస్తూ నూటికి నూరు శాతం స్ట్రైక్ రేట్‌తో గెలుపే లక్ష్యం

**గుంటూరు సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**



ఎన్నిక ఏదైనా విజయం కూటమిదేనని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.గుంటూరులోని 'ది క్యాపిటల్' హోటల్‌లో శుక్రవారం జరిగిన కూటమి భాగస్వామ్య పక్షాల (టీడీపీ, జనసేన, బీజేపీ) నాయకుల సమన్వయ సమావేశంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సంపూర్ణ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ క్షేత్రస్థాయిలో సమైక్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.రాష్ట్ర స్థాయిలో ఇదివరకే ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీల మార్గదర్శకత్వంలో ప్రతి జిల్లాలో భాగస్వామ్య పార్టీల బలాబలాలను బేరీజు వేసుకుంటూ సమన్వయ భేటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ అధిష్ఠానం ఎవరిని అభ్యర్థిగా ప్రకటిస్తే వారి గెలుపునకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పని చేయాలని, అధిష్టానానిదే అంతిమ నిర్ణయమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల ప్రగతి, ప్రజా ఆకాంక్షలు నెరవేర్చడం, 'సూపర్ సిక్స్' పథకాల అమలు తీరును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి మద్దతు కూడగడతామన్నారు.. ముందుగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు, అనంతరం పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయని... ఎన్నిక ఏదైనా, అభ్యర్థి ఎవరైనా కూటమి విజయం తథ్యమని పేర్కొన్నారు. నూటికి నూరు శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని, ఈ సెప్టెంబర్‌లోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, అక్టోబర్‌లో ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. నాటి వైకాపా పాలనలో ప్రతిపక్షాలను ఎన్నికల్లో పోటీ చేయనివ్వకుండా బలవంతపు ఏకగ్రీవాలకు పాల్పడ్డారని విమర్శించారు. నేడు వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో పోటీ పడలేక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం మాత్రం పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను ఎదుర్కొని ప్రజల మనసు గెలుచుకుంటుందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. మీడియా సమావేశం అనంతరం నాయకులంతా కలిసి జై కూటమి అని నినదించారు.ఈ సమావేశంలో టీడీపీ తరఫున కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పిల్లి మాణిక్యాలరావు, రాజు, బీజేపీ తరఫున తిరుపతిరావు, సూర్యనారాయణ, జయప్రకాష్, జనసేన తరఫున చిల్లపల్లి శ్రీనివాసరావు, బిట్రగుంట మల్లిక్, షేక్ నాయక్ కమల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# భూ వివాదాలు లేని ఏపీనే చంద్రబాబు సంకల్పం : ప్రభుత్వ విప్ కాలవ



**రాయదుర్గం, సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్:**

భూ వివాదాలు లేని ఆంధ్రప్రదేశ్ గా తయారు కావడమే సీఎం చంద్రబాబు సంకల్పమని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం రాయదుర్గం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారి వేదిక ద్వారా రైతులు, పేదలు తమ సమస్యలు పరిష్కరించుకుంటున్నారని తెలిపారు. నేను నిర్వహించిన ప్రజాదర్బాల్లో 1088 అర్జీలు స్వీకరించగా అందులో 988 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందన్నారు. ప్రతి దరఖాస్తును నాణ్యమైన పరిష్కార దిశగా అంటే ప్రతి దరఖాస్తును ఎమ్మెల్యే లాగిన ద్వారా సంబంధిత అధికారులకు పంపించడం జరుగుతుంది. ఎమ్మెల్యే లాగిన్ ద్వారా వెళ్లడం వల్ల సంబంధిత అధికారులు సత్వర పరిష్కారం చూపుతూ రిప్లై ఇవ్వడం జరుగుతుంది. దరఖాస్తులు పరిష్కార విషయంలో అధికారులు చర్యలు తీసుకోవడం వల్ల రాయదుర్గం అగ్రభాగాన ఉందని అన్నారు. ప్రజా దర్బారు వల్ల అర్జీదారులకు స్వాంతన లభిస్తుంది. కనేకల్, ఇప్పుడు రాయదుర్గం, గుమ్మగట్ట, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లో కూడా ప్రజా దర్బార్ నిర్వహించడం జరిగింది. ప్రజా దర్బార్ నిర్వహించడం వల్ల జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పీజిఆర్ఎస్ వ్యవస్థను పర్యవేక్షించే అధికారులు ఎమ్మెల్యే లాగిన్ ద్వారా పంపించిన దరఖాస్తులు ఎలా పరిష్కారం అవుతున్నాయి. ఎక్కడ పెండింగ్ ఉన్నాయి అనే విషయం తెలుసుకోవడానికి వీలుంటుందని అన్నారు. ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయి.అన్నదమ్ముల మధ్య చిన్న చిన్న గొడవలు చాలా రోజుల నుంచి ముటేషన్లు కాకపోవడం. కోర్టులో పెండింగ్ ఉండడం ఇలాంటి సమస్యలు ఉన్నాయి వాటిని కూడా 2027 లోపు అధిగమించి భూ సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సూర్య ప్రతాప్, ఎంపీడీవో కొండన్న తదితరులు పాల్గొన్నారు.

# రూ.5వేలు ఇస్తే అరగంటలో చేనేత సర్టిఫికెట్ మంజూరు

- రూ.3వేలు ఇస్తే గంటలో మంజూరు
- డబ్బులు ఇవ్వకపోతే నో సర్టిఫికేట్
- అనంతపురం చేనేత జౌళి శాఖలో డబ్బుల దందా....
- చేనేత ఫించన్ మంజూరు కోసం పోటాపోటీ
- అనర్హతలకేనా చేనేత సర్టిఫికెట్ లు .....?
- చూసిచూడనట్లుగా అధికారులు
- నిజమైన చేనేత కార్మికులకు సర్టిఫికెట్ లో తీరని అన్యాయం
- చేనేత ఫించన్ మంజూరు లో నిబంధనలు గాలికి వదిలేస్తారా..... లేదా... వేచిచూడాలి
- కాళ్లు అరిగేలా తిరిగిన మంజూరు కాని సర్టిఫికెట్

**యాడికి, సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్:**



రాష్ట్రంలో ఉన్న చేనేత కార్మికులను ఆదుకోనేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశిష్టాత్మకంగా "నేతన్న సేవ" పథకం ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేశారు. అంతే గాక 50 సంవత్సరాల నిండా చేనేత కార్మికులను ఆదుకునేందుకు చేనేత కార్మిక ఫించన్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారు.చేనేత కార్మిక ఫించన్ ను చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకోమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. చేనేత కార్మిక ఫించన్ లో నిబంధనలను కొన్ని సడలింపు చేశారు. చేనేత ఫించన్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే జిల్లా చేనేత జౌళి శాఖ నుండి చేనేత సర్టిఫికెట్ ను పోందాలి, దీంతో అనంతపురం జిల్లా కేంద్రంలో ఉన్న చేనేత జౌళి శాఖ లో డబ్బుల దందా ఊపు అందుకోందని, జౌళి శాఖ లో రూ.5 వేలు ఇస్తే అరగంటలో చేనేత సర్టిఫికెట్ మంజూరు చేస్తున్నారని, రూ.3వేలు ఇస్తే గంటలో మంజూరు చేస్తున్నారని నిజమైన చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలో ఉన్న చేనేత జౌళి శాఖ లో చేనేత కార్మిక సర్టిఫికెట్ కోసం నిజమైన చేనేత కార్మికులు అవస్థలు పడుతున్నారని, చేనేత జౌళి శాఖ డబ్బుల శాఖ గా మారిందని పలువురు చేనేత కార్మికులు తెలిపారు. చేనేత కార్మిక ఫించన్ మంజూరు లో కూడా తీవ్ర అన్యాయం జరుగుతున్నదని నిజమైన చేనేత కార్మికులు వాపోయారు. జౌళి శాఖలో అధికారులకు చేయి తడపకపోతే నో సర్టిఫికేట్ అంటున్నారని, చెయి తడిపితే ఉన్న చోటుకే అధికారులు సర్టిఫికెట్ ను పంపుతున్నారని నిజమైన చేనేత కార్మికులు కన్నీరు పెట్టుకున్నారు. చేనేత ఫించన్ మంజూరు కోసం పోటాపోటీ ఏర్పడిందని, జౌళి శాఖలో ఎక్కువ మందికి అనర్హులకే సర్టిఫికెట్ ఇస్తున్నారని,చూసిచూడన్నట్లుగా కొందరు ఉన్నత అధికారులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. నిజమైన చేనేత కార్మికులకు చేనేత సర్టిఫికెట్ మంజూరు లో తీరని అన్యాయం జరిగిందని, న్యాయం చేయాల్సిన అధికారులే.... అన్యాయం చేస్తే ఎలా..... అని చేనేత కార్మికులు ప్రశ్నిస్తున్నారు. చేనేత ఫించన్ మంజూరు లో ఉన్న నిబంధనలు గాలికి వదిలేస్తారా....లేదా వేచి చూడాలని ,50 సంవత్సరాల వయస్సు లేని వారు కూడా కొందరు చేనేత కార్మిక ఫించన్ కోసం దరఖాస్తు చేసుకోన్నారని, అటువంటి వారికి జౌళి శాఖలో చేనేత సర్టిఫికెట్ ను అందచేశారని తెలిపారు. కాళ్లు అరిగేలా రెండు రోజుల పాటు తిరిగిన, చేనేత సర్టిఫికెట్ మంజూరు కాలేదని చేనేత కార్మికులు వాపోయారు. అవినీతి కి పాల్పడితే రాష్ట్ర ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు వస్తుందని, రాజకీయ నాయకులు చేనేత ఫించన్ మంజూరు విషయంలో ఏమి చేస్తారో వేచి చూడాలని తెలిపారు.ప్రస్తుతానికి చేనేత ఫించన్ దరఖాస్తు శుక్రవారం తో ముగిసిందని,ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని,మా భాధలు ఎవరికి తెలియచేయాలో అర్థం కాలేదని నిజమైన చేనేత కార్మికులు కన్నీరు పెట్టుకున్నారు.

సర్టిఫికెట్



# పోలవరం ఎత్తు విషయంలో జగన్ దుష్ప్రచారం

**అమరావతి సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**

పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న దుష్ప్రచారాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రంగా ఖండించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకే పరిమితం చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు అథారిటీకి పలుమార్లు ప్రతిపాదనలు పంపిందని, ఇప్పుడు ఆ తప్పులను కూటమి ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.2022 జనవరిలో వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును ఫేజ్ 1, ఫేజ్ 2గా విభజిస్తూ, 41.15 మీటర్ల ఎత్తును ప్రతిపాదించిందని మంత్రి తెలిపారు. అప్పటి స్పెషల్ సీఎస్ పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవోకు లేఖ రాసి రూ.10,911.15 కోట్ల నిధులు కోరారని చెప్పారు. అనంతరం జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పోలవరం ప్రాజెక్టు సీఈ తదితరులు కూడా వైసిపి పాలనలో పలుమార్లు లేఖలు రాశారని, ఆ లేఖల్లో పోలవరం ఎత్తు 41.15 మీటర్లుగా స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు.పోలవరం నీటి నిల్వను 41.15 మీటర్లు, 45.72 మీటర్లుగా విభజించి ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేసింది జగన్ ప్రభుత్వం కాదా? అని మంత్రి నిమ్మల ప్రశ్నించారు. 2024 ఫిబ్రవరి 16న వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ పోలవరం ప్రాజెక్టు ఫేజ్ 1 అంచనా వ్యయాన్ని రూ.30,436.95 కోట్లుగా నిర్ధారించిందని మంత్రి గుర్తు చేశారు.201419 మధ్య టీడీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును ఎప్పుడూ ఫేజ్ 1, ఫేజ్ 2గా విభజించలేదని స్పష్టం చేశారు. నాటి టిడిపి ప్రభుత్వం హయాంలోనే 11.02.2019 న జరిగిన 141 వ సాంకేతిక సలహా కమిటీ (టిఏసి) సమావేశంలో 201718 ధర స్థాయి (పిఎల్) ప్రకారం రూ. 55, 548. 87 కోట్లకు 45.72 మీటర్ల ఎత్తుకు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం లభించిందని చెప్పారు. "నాడు మా ప్రభుత్వ హయాంలో ఫేజ్ 1, ఫేజ్ 2 అనే ప్రతిపాదన ఎక్కడైనా ఉందా? జగన్ చేసిన పాపానికి మా ప్రభుత్వాన్ని బాధ్యులను చేయాలని చూస్తున్నారు. నాడు వైసిపి ఫేజ్ 1, ఫేజ్ 2 ప్రతిపాదన అంగీకారం కు సంబందించి అన్ని ఆధారాలు ఉన్నాయి." అని మంత్రి నిమ్మల అన్నారు.

**45.72 మీటర్ల ఎత్తుతోనే పోలవరం నిర్మాణం**

గోదావరి వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ అవార్డు 1980 ప్రకారం పోలవరం స్పిల్‌వే, ఈసీఆర్ఎఫ్ డిజైన్లు 45.72 మీటర్ల ఎత్తుతో, 194.60 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యానికి అనుగుణంగానే రూపొందించబడ్డాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా పోలవరం నిర్మాణ పనులను 45.72 మీటర్ల ఎత్తు, 194.60 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతోనే పూర్తి చేస్తోందని స్పష్టం చేశారు. "పోలవరం ఎత్తు విషయంలో కూటమి ప్రభుత్వం, గత ప్రభుత్వం మాదిరిగా, ఏమాత్రం రాజీపడదు అని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, గోదావరి ట్రిబ్యునల్ అనుమతించిన మేరకు 45.72 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేసేలా, ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తవుతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మొదట 41.15 మీటర్లకు నీరు నిల్వ చేసి, తర్వాత 45.72 మీటర్ల కాంటూరుకు నిల్వ చేసేందుకు అవసరమైన ఆర్అండ్ఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రం నుండి ఆమోదం కోరతామని అన్నారు

**పోలవరాన్ని విధ్వంసం చేసింది వైసీపీ ప్రభుత్వమే.**

పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసి, ప్రాజెక్టు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది గత వైసీపీ ప్రభుత్వమే నని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 8,122 క్యూసెక్కులకు తగ్గించడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు గండికొట్టారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసి ఉంటే ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించగలిగేవారమని మంత్రి తెలిపారు. సుమారు 400 టీఎంసీల నీటిని రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు తరలించి ప్రయోజనం కల్పించే అవకాశం ఉండేదని చెప్పారు. "పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేం" అని స్వయంగా నాడు అసెంబ్లీలో ప్రకటించిన వారు ఇప్పుడు పోలవరం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు.

**డయాఫ్రం వాల్‌ను ధ్వంసం చేసి ప్రాజెక్టు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశారు**

వైసీపీ హయాంలో పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో ప్రాజెక్టు నిర్మాణం మరింత క్లిష్టంగా మారిందని మంత్రి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో డయాఫ్రం వాల్ ప్రాధాన్యత కూడా తెలియని విధంగా నాటి పాలకులు వ్యవహరించారని విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్రం నుంచి నిధులు సాధించి పోలవరం పనులను తిరిగి గాడిలో పెట్టామని మంత్రి తెలిపారు. ప్రశ్నార్థకంగా మారిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామనే భరోసాను ప్రజలకు కల్పించామని అన్నారు.

**పట్టిసీమతో కృష్ణా డెల్టాకు జీవనాడి**

పట్టిసీమ ప్రాజెక్టును గతంలో వృథా ప్రాజెక్టుగా విమర్శించిన వారు, తాము అధికారంలోకి వస్తే పట్టిసీమ, పురుషోత్తమపట్నం పంపులు పీకేస్తామని చెప్పారని మంత్రి గుర్తు చేశారు. అయితే పట్టిసీమ ద్వారా వచ్చిన 500 టిఎంసిల గోదావరి జలాలతో కృష్ణా డెల్టాలో ఐదేళ్లలో సుమారు రూ.50 వేల కోట్ల ఆదాయం సృష్టించగలిగామని తెలిపారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా పట్టిసీమ కృష్ణా డెల్టాకు ఊపిరి పోస్తోందని చెప్పారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు పట్టిసీమ నుంచి 45 టీఎంసీలకు పైగా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం కృష్ణా డెల్టాలో సుమారు 6.80 లక్షల ఎకరాల్లో పంట సాగు జరుగుతోందంటే అందుకు పట్టిసీమ నీరు కీలక కారణమని చెప్పారు. పట్టిసీమ నీరు కృష్ణాడెల్టాకు అందడం వలనే శ్రీశైలం నుండి కృష్ణా నీరు పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా ద్వారా రాయలసీమ అవసరాలకు ఇవ్వగల్గుతున్నామన్నారు. పట్టిసీమ లేకపోతే శ్రీశైలంకు వచ్చిన కృష్ణానీటిని కృష్ణా డెల్టాకు ఇవ్వవలసి వచ్చి ఉండేదన్నారు. చంద్రబాబు నాయుడు ముందుచూపుతో నిర్మించిన పురుషోత్తపట్నం, పుష్కర లిఫ్ట్ స్కీమ్‌ల వల్లే నేడు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించగలుగుతున్నామని మంత్రి తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీమ్ ద్వారా 16.6 టీఎంసీల నీటిని ఎత్తిపోశామని మంత్రి వెల్లడించారు.






# యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

## కలెక్టర్ శ్యాం ప్రసాద్ కి వినతి

**పుట్టపర్తి రూరల్, సెప్టెంబర్ 18 (అనంత జనశక్తి న్యూస్)**

గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్కు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు రెండేళ్ల నుండి (ఏహెచ్ఏ) ఉద్యోగ అవస్థలు తప్పడం లేదనీ. ప్రొబేషనరీ కాలపరిమితి ముగిసినా ప్రభుత్వం ఇంతవరకు డిక్లరేషన్ ఇవ్వకపోవడంతో వారు ఆందోళన బాట పట్టారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉద్యోగు లు కలెక్టరేట్ చేరుకుని అక్కడ
తమకు ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని కోరుతూ ఏహెచ్ఏ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ శ్యాం ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు, మూడవ బ్యాచ్ ఏహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ (ఐకానిక్ భవనం) నిర్మాణానికి రూ.661 కోట్లకు పరిపాలనామోదం



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన 66వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం వివరాలను ఏపీ సచివాలయం లోని ప్రచార విభాగంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి వెల్లడించారు.రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఒక వ్యక్తికి 135 లీటర్లు అందించడానికి అవసరమైన పైపుల సామర్థ్యం పెంపు, మెయిన్ డ్రైనేజీకి లింక్ డ్రైనేజీ పైపులు ఏర్పాటు, ఎన్ఎస్పీ(నెగోషియేటివ్ సెటిల్మెంట్ పాలసీ) తో కలిపి రూ. 1548 కోట్లు తో టెండర్లు పిలవడానికి పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు.రాష్ట్రంలో స్టాండర్డ్స్ ప్రైవేట్ స్కూల్స్ కూడా రాజధాని ప్రాంతంలో నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. అందులో భాగంగానే నలందా ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ వారికి 5 ఎకరాలు కృష్ణాయపాలెంలో ఇవ్వడం జరిగిందన్నారు. ఏడాదిన్నరలో స్కూల్ నిర్మాణం పూర్తవనుందని మంత్రి తెలిపారు. హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కార్యాలయ నిర్మాణానికి నేలపాడులో 50 సెంట్లు భూమి కేటాయించడం జరిగిందన్నారు. ల్యాండ్ పూలింగ్ కు భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు కౌలు జరీబు అయితే రూ. 50వేలు, నాన్ జరీబు అయితే రూ. 40వేలు అందిస్తున్నామన్నారు. 2014 19 మధ్యలో భూ సమీకరణలో భాగంగా భూములు ఇచ్చిన ఎకరం కంటే తక్కువ ఉన్నా గతంలో వారికి రూ. 30వేలు ఇచ్చామన్నారు. రెండో విడత భూ సమీకరణ సందర్భంగా రైతుల విజ్ఞప్తి మేరకు వారికి కూడా కౌలు రూ. 40వేలు ఇవ్వడానికి అథారిటి అనుమతి లభించిందన్నారు. అక్టోబర్ చివరి నాటికి రెవెన్యూ సమస్యలను సైతం పరిష్కరించి ల్యాండ్ పూలింగ్ 80 శాతం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'సేవా సంకల్ప్ అభియాన్'

- మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ.. నెల రోజుల పాటు నిర్వహణ
- బీజేపీ స్టేట్ చీఫ్ పీవీఎన్ మాధవ్
- సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు

**అమరావతి, సెప్టెంబర్ 18 (అనంత జనశక్తి న్యూస్)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 వసంతాల ప్రజా సేవను పూర్తి చేసుకున్నారని బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ అన్నారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల్లోకి కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, వివిధ సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నామని చెప్పారు. సమాజ సేవలో నిమగ్నమై పనిచేస్తున్న టీచర్లు, అంగన్వాడీ వర్కర్లు, శానిటరీ వర్కర్లు తదితరులను సన్మానించి వారి సేవలకు గుర్తింపు, గౌరవం కల్పిస్తామన్నారు. యువతలోని సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు 'ఇన్నోవేషన్ ఛాలెంజ్' నిర్వహించి, కొత్త ఆవిష్కరణలు చేస్తున్న యువతకు ప్రోత్సాహం అందించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో చిత్రలేఖనం, ఎలక్యూషన్ వంటి పోటీలు నిర్వహించేలా కార్యక్రమాలను రూపొందించామని మాధవ్ తెలిపారు. మొత్తం 13 రకాల కార్యక్రమాలను నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. అక్టోబర్ 17న ఢిల్లీలో దేశవ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా భారీ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. నిన్న(గురువారం) దేశవ్యాప్తంగా 'ఆశీర్వాద దీపం' కార్యక్రమాన్ని ప్రజలు స్వచ్ఛందంగా నిర్వహించారని తెలిపారు.
మోదీ ప్రజా సేవకు గుర్తింపుగా, ఆయనకు భగవంతుడి ఆశీస్సులు లభించి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజలు ఇళ్ల ముందు దీపాలు వెలిగించారని మాధవ్ అన్నారు. 'సేవా సంకల్ప్ అభియాన్ పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాదని.. ప్రజలందరికీ సంబంధించిన కార్యక్రమం' అని స్పష్టం చేశారు. మోదీ కుటుంబ సభ్యులు, ప్రజలు, యువత, సేవా సంస్థలు ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని పీవీఎన్ మాధవ్ కోరారు.

# చెత్త దోపిడీపై మంత్రి నారాయణ బహిరంగ చర్చకు రావాలి: కాకాణి

**నెల్లూరు, సెప్టెంబర్ 18:అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో చెత్త నిర్వహణ పేరుతో రూ.1,200 కోట్ల అవినీతి జరిగిందంటూ తాము చేస్తున్న ఆరోపణలపై మంత్రి నారాయణ బహిరంగ చర్చకు రావాలని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరు నగరంలోని వీఆర్సీ కూడలిలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.చెత్త నిర్వహణకు సంబంధించిన వ్యవహారాల్లో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ తమ వద్ద ఆధారాలు ఉన్నాయని కాకాణి తెలిపారు. మంత్రి నారాయణకు డబ్బుతో సంబంధం లేదని చెబుతున్నప్పటికీ, తాము అడిగిన పన్నుల వివరాలు, లెక్కలపై ఎందుకు స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆధారాలతో సహా తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, మంత్రి కూడా బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు.నెల్లూరు నగర ప్రజలు, పేదలపై ఒత్తిడి తెచ్చి పన్నులు వసూలు చేశారని కాకాణి ఆరోపించారు. విద్యుత్ కనెక్షన్లు తొలగించడం,మంచినీటి సరఫరాను నిలిపివేయడం వంటి చర్యలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు.లెగసీ చెత్త నిల్వలకు సంబంధించిన లెక్కలు రూ.85 లక్షల నుంచి రూ.1.65 కోట్లకు పెంచిన విధానంపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఈ అంశానికి సంబంధించిన వివరాలను శాసనమండలి సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి గత మూడు, నాలుగు నెలలుగా సేకరించారని చెప్పారు. చెత్త నిర్వహణలో అవినీతి, అక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ఆధారాలతో సహా ప్రజల ముందుకు తీసుకువస్తామని ప్రకటించారు.మంత్రి నారాయణ తమ ఆరోపణలకు సమాధానం ఇవ్వకుండా కేవలం విలేకరుల సమావేశాల్లో వివరణ ఇస్తున్నారని కాకాణి విమర్శించారు. నెల్లూరు ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు రావాలని మరోసారి డిమాండ్ చేశారు.



**ప్రతి కేంద్రంలో నిరసనలు**

నెల్లూరు నగరంలో చెత్త నిర్వహణలో జరిగినట్లు తాము ఆరోపిస్తున్న అవినీతి, దోపిడీని ప్రజలకు సవివరంగా తెలియజేస్తామని కాకాణి తెలిపారు. సేకరించిన సమాచారాన్ని పరిశీలించి, ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకువస్తామని చెప్పారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.అధికార పార్టీ నాయకులు ఆత్మవిశ్వాసం ప్రదర్శించడం కాకుండా, తమ వద్ద ఉన్న ఆధారాలపై బహిరంగ చర్చకు రావాలని కాకాణి కోరారు. రాజ్యాంగ స్ఫూర్తిని, పేద ప్రజల హక్కులను పరిరక్షించేందుకు అంబేద్కర్‌తో పాటు ఇతర మహనీయుల విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రైమ్ రేట్ తగ్గింది

- ఈగల్ టీమ్ పటిష్టంతోనే సాధ్యమైంది
- హోంమంత్రి అనిత వెల్లడి
- శాంతి భద్రతల బాధ్యత ప్రజలది కూడా..
- పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి

**అమరావతి, సెప్టెంబర్ 18 (అనంత జనశక్తి న్యూస్)**

ఈగల్ ప్రధాన కార్యాలయంలో '20262029 మాదక ద్రవ్యాల నియంత్రణ విజన్ డాక్యుమెంట్' అమలుపై హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ఈగల్ టీమ్‌స్‌తో జూమ్ కాల్ ద్వారా సమీక్షించారు. గంజాయి నిర్మూలనలో పురోగతి, భవిష్యత్ కార్యాచరణను అనితకు ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ వివరించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. భావితరాల బంగారు భవిష్యత్తు కోసమే సీఎం చంద్రబాబు ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం ఇచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరిట 1972 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీవ్యాప్తంగా 900 గంజాయి హాట్‌స్పాట్లను జియో ట్యాగింగ్ నిఘాతో గత 4 నెలల్లోనే 20 వేలకు పైగా కేసులు నమోదు అయినట్లు హోం మంత్రి వెల్లడించారు. ఈగల్ టీమ్ పటిష్ఠ నిఘాతోనే రాష్ట్రంలో క్రైమ్ రేట్ 14 శాతం తగ్గిందని అనిత పేర్కొన్నారు.

# ఆశా వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## ఏపీ ఆశ వర్కర్ల సంఘం

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 18
అనంత జన శక్తి న్యూస్.**

జిల్లాలో ఆశా వర్కర్స్ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఫైరోజ్ బేగం కి వినతిపత్రం అందజేశారు. పుట్టపర్తి డిఎంహెచ్వో కార్యాలయం లో వినతి పత్రం అందజేశారు.
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆశా వర్కర్స్‌తో రికార్డులు రాయిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఆశా వర్కర్స్‌పై అనవసరమైన పనిభారం మరియు ఒత్తిడి లేకుండా చూడాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆశా వర్కర్స్‌తో రికార్డులు రాయిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి.2025 డిసెంబర్‌లో ఆశా వర్కర్స్‌గా విధుల్లో చేరిన వారికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి. అర్హులైన ఆశా వర్కర్స్‌కు వితంతు పెన్షన్, తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి.అనారోగ్యంతో మరణించిన ఆశా వర్కర్స్ కుటుంబాలకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ మొత్తాన్ని వెంటనే చెల్లించాలి.మరణించిన ఆశా వర్కర్స్ కుటుంబాల్లో అర్హులైన వారికి ఆశా వర్కర్స్‌గా అవకాశం కల్పించాలి.ఆశా వర్కర్స్‌కు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని హక్కులు, ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలనీ, కోరారు.
వినతిపత్రం స్వీకరించిన అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం స్పందిస్తూ, ఇకపై ఆశా వర్కర్స్‌తో రికార్డులు రాయించవద్దని అధికారులకు ఆదేశాలు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆశా వర్కర్స్‌తో రికార్డులు రాయిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
అక్టోబర్ 10వ తేదీ నుంచి 20వ తేదీలోపు జిల్లా ఆశా నోడల్ ఆఫీసర్, జిల్లా అధికారులు మరియు ఆశా యూనియన్ నాయకులతో సంయుక్త సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ విషయంపై జిల్లాలోని అన్ని మెడికల్ ఆఫీసర్లతో శుక్రవారం జూమ్ సమావేశం నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని చెప్పారు.*
అదేవిధంగా 2025 డిసెంబర్‌లో విధుల్లో చేరిన ఆశా వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వచ్చే నెల 5వ తేదీలోపు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ జిల్లా నోడల్ ఆఫీసర్ త్రిలోక్‌నాథ్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీకే రాధమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. సౌభాగ్యమ్మ, జిల్లా కోశాధికారి పి. రమాదేవి, జిల్లా గౌరవ అధ్యక్షులు బి. సాంబశివ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంకె ముత్యాలు, జిల్లా నాయకులు రామ్మోహన్, సిద్ధు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు ముంతాజ్, అంజినమ్మ, మహాలక్ష్మి, చంద్రకళ, సుశీల తదితరులు పాల్గొన్నారు.



# దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్

## ఎండీఎల్‌తో ఏపీ సర్కార్ ఎంవోయూ

**అమరావతి, సెప్టెంబర్ 18 (అనంత జనశక్తి న్యూస్)**

**ఏపీలోని దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఎండీఎల్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈ ఎంవోయూ చేసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రూ.15,000 కోట్ల పెట్టుబడితో 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏడాదికి 12 లక్షల టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యాన్ని ఈ గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ కలిగి ఉంది. కాగా, సీఎం చంద్రబాబు అధ్యక్షతన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం ఈరోజు (శుక్రవారం) సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 29 పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన పెట్టుబడులపై సీఎం చర్చించారు. దాదాపు రూ.22 వేల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన ప్రాజెక్టులపై ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నాయి. తద్వారా దాదాపు 20 వేల మందికి ఉద్యోగాలను కల్పించనున్నారు. ఇప్పటివరకు జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల్లో 359 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. రూ.13.84 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.59 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాశ్, పి.నారాయణ, కందుల దుర్గేశ్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి, సీఎస్ సాయిప్రసాద్, పరిశ్రమలు, ఐటీ, ఐ అండ్ ఐ శాఖల కార్యదర్శులు హాజరయ్యారు.**

# 6నెలల్లో వెయ్యికోట్లు

'పుష్పా' ఫ్రాంచైజీ, యానిమల్, ఛావా, సికిందర్, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలతో ఒకే ఏడాది వేలకోట్ల వసూళ్లు రాబట్టి సినీ సామ్రాజ్యానికి క్వీన్‌గా అవతరించింది రష్మిక మందన్న. ఇక ఏ హీరోయిన్‌కైనా ఈ స్థాయి ట్రాక్ రికార్డు కష్టమే అని అంతా అనుకుంటున్న తరుణంలో ఉన్నట్టుండి మలయాళ భామ మమితాబైజు ఊడిపడింది. ఆర్నెల్ల క్రితం ధనుష్‌తో ఆమె నటించిన 'కర' సినిమా పెద్దగా ఆడలేదు. కానీ 50కోట్ల వసూళ్లు రాబట్టింది. ఇక అక్కడ్నుంచి మొదలైంది మమితాబైజు విజయవిహారం.

ప్రదీప్ రంగనాథ్‌తో ఆమె నటించిన 'డ్యూడ్' సినిమా వందకోట్ల వసూళ్లు రాబట్టింది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి నటించిన 'జననాయగన్' 300కోట్లు, రీసెంట్‌గా విడుదలైన మలయాళ చిత్రం 'బెత్లహోమ్ కుటుంబ యూనిట్' చిత్రం 300కోట్లు, సూర్య తాజా బ్లాక్‌బస్టర్ 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో 260కోట్లు.. ఇలా కేవలం ఆరు నెలల వ్యవధిలోనే తన సినిమాల వసూళ్లతో వెయ్యికోట్ల మార్క్‌ని దాటేసింది మమితా బైజు. ఆమె నటించిన మూడు సినిమాలు వరుసగా 200కోట్ల వసూళ్లు రాబట్టడం విశేషం.



# హీరో సుహాస్‌పై వర్ణ వివక్ష విమర్శలు



గ్లామర్ ప్రపంచమైన సినిమా రంగంలో టాలెంట్ ముఖ్యం కానీ రంగు, రూపాలు కాదనే విషయం మరోసారి చర్చనీయాంశమైంది. తాజాగా 'మండాడి' సినిమా సక్సెస్ ఈవెంట్‌లో ఆ చిత్ర దర్శకుడు చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో సంచలనం సృష్టించాయి. తన సినిమాలో నటించిన టాలీవుడ్ నటుడు సుహాస్ కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న అవమానాల గురించి ఆ దర్శకుడు ప్రస్తావించారు. సుహాస్ నల్లగా ఉన్నాడంటూ కొందరు తీవ్రమైన కామెంట్లు చేశారని, తన సొంత ఊర్లోనూ రంగును బేస్ చేసుకుని కొందరు ఎద్దేవా చేశారని సుహాస్ ఎమోషనల్ అయిన విషయాన్ని ఆ డైరెక్టర్ గుర్తుచేసుకున్నారు. తమిళనాడు వంటి ప్రాంతాల్లో రంగు ఆధారంగా వివక్ష చూపించరని, ఏ నటుడిని వారి కలర్ ఆధారంగా అంచనా వేయకూడదని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ వ్యాఖ్యలు టాలీవుడ్‌ని ఉద్దేశించి దర్శకుడు చేశాడని పలువురు తప్పుబడుతున్నారు. తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ నటుల రంగును బట్టి వారిని అంచనా వేయరని. స్నేహితుల మధ్య సరదాగా లేదా చిన్నతనంలో రంగును ఉద్దేశించి చేసుకునే కామెంట్లను కొందరు పెద్దవి చేసి చూడటం సరికాదని అభిప్రాయపడుతున్నారు.

## అమ్మాయిల చదువు కోసం..
# సెలబ్రిటీల 'సంకల్ప్'



ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబరు 17 వరకు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటిల్లో సినీ సెలబ్రిటీలూ భాగమవుతున్నారు. తాజాగా ముంబయిలో లాల్‌బాగ్‌చా రాజాను దర్శించుకున్న రణవీర్ సింగ్ , రణబీర్ కపూర్, అలియా భట్ వారు చేయనున్న మంచి పనుల గురించి వివరించారు. "నేను 'సేవా సంకల్ప్ అభియాన్'లో చేరి 1,000 మంది బాలికలను చదివిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఈ మంచి పనిని వినాయకుడు నా వెనక ఉండి నడిపిస్తాడని నమ్ముతున్నాను" అని రణవీర్ తెలిపారు. అలియా భట్ , రణబీర్ కపూర్ కూడా ముందుకు వచ్చి.. ముంబయిలోని 20 పాఠశాలలను పునరుద్ధరించే బాధ్యతను స్వీకరించనున్నట్లు చెప్పారు. ఇక ఇప్పటికే ఈ కార్యక్రమంలో అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ కూడా భాగమైన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 17న మోదీ పుట్టినరోజు సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన చేశారు. 1000 మంది మహిళలకు ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్ (నైపుణ్యాభివృద్ధి) శిక్షణ అందించనున్నట్లు ప్రకటించారు.

# కత్రినాకు మద్దతుగా నిలిచిన నటి



బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ ప్రసవానంతరం బరువు పెరిగారంటూ సోషల్ మీడియాలో పలువురు విమర్శలు గుప్పించారు. వీటిపై నటి సోనారికా భదోరియా స్పందించారు. తల్లి అయిన తర్వాత మహిళల శరీరంలో వచ్చే మార్పులను ప్రశ్నించడం సరికాదన్నారు. కత్రినాకు మద్దతు తెలుపుతూ పోస్ట్ పెట్టారు. ఇది కేవలం కత్రినాకు సంబంధించిన విషయం మాత్రమే కాదని.. ప్రతి మహిళా ఇలాంటి ట్రోలింగ్‌ను ఎదుర్కొంటున్నారన్నారు. "బిడ్డకు జన్మనివ్వడం చిన్న విషయం కాదు. ఆ సమయంలో మహిళ శరీరం ఎన్నో మార్పులకు లోనవుతుంది. ప్రసవం తర్వాత కోలుకునేందుకు ఒక్కొక్కరికి ఒక్కో సమయం పడుతుంది. అలాంటప్పుడు ఆమె ఎలా కనిపిస్తోంది? ఎంత బరువు పెరిగింది? అనే దానికంటే.. ఆమె బిడ్డకు జన్మనివ్వడం కోసం ఎంత కష్టపడింది.. ఆ బిడ్డను పెంచడం కోసం ఎన్ని నిద్రలేని రాత్రులు గడపనుంది.. వంటివి అర్థం చేసుకోవడం ముఖ్యం. తల్లి కావడానికి మహిళలు సర్వస్వం త్యాగం చేయాలని చెప్పే ఈ ప్రపంచంలో.. మాతృత్వం అనంతరం ఆమె శరీరంలో ఎలాంటి మార్పు రాకూడదని ఆశించే వాళ్లు కూడా ఉండడం సిగ్గుపడాల్సిన విషయం" అని అన్నారు.

# వైభవ్ ఇంకొంత కాలం వేచి చూడాల్సిందే..: గంభీర్




అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లోనూ వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కలేదు. సంజు శాంసన్ వైపే టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ మొగ్గు చూపింది. ఈ క్రమంలో వైభవ్‌ను ఎందుకు ఎంపిక చేయలేదనే ప్రశ్నలు తలెత్తాయి. జింబాబ్వే టూర్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచిన సంగతి తెలిసిందే. దీనిపై భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సమాధానం ఇచ్చాడు. అలాగే ఇంగ్లాండ్ సిరీస్‌లో సంజుకు బదులు వైభవ్‌కు అవకాశం కల్పించడం కూడా తన కోచింగ్ కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన నిర్ణయమని వ్యాఖ్యానించాడు. "సంజు శాంసన్ సత్తా ఏంటో మనందరికీ తెలుసు. టాలెంట్ లేకుండా ఎవరూ వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలవలేరు. జట్టుకు కావాల్సింది చేశాడు. అందుకే, అతడిని పక్కన పెట్టడమనేది నా కెరీర్‌లో అత్యంత కఠినమైన నిర్ణయం. ఇంగ్లాండ్ సిరీస్‌లో ఆడించలేకపోయా. అయితే, కొన్నిసార్లు ఆటగాళ్ల ప్రస్తుత ఫామ్‌ను కూడా పరిగణనలోని తీసుకోవాలి. నా దృష్టిలో వరల్డ్ కప్ కాంబినేషన్‌నే కొనసాగిస్తే మంచిదనిపించింది. ఏదో మూడు, నాలుగు సార్లు విఫలమైనంత మాత్రాన అకస్మాత్తుగా చెత్త ఆటగాళ్లుగా మారిపోరు. ప్రపంచ కప్ నుంచి మరో ప్రపంచ కప్ వరకు అజేయంగా నిలిచి, టైటిల్ గెలిచిన జట్టు అది. కేవలం ఒక సిరీస్ ఫలితం ఆధారంగా జట్టును తక్కువ అంచనా వేయలేం" అని గంభీర్ తెలిపాడు.

# మహిళా అథ్లెట్.. పురుష కోచ్‌కు ఒకే రూమ్?




ఆసియా గేమ్స్ లో వసతి ఏర్పాట్లపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. భారత బృందం అక్కడ అడుగు పెట్టినప్పటి నుంచి.. వసతి కోసం గంటల తరబడి వేచి చూడటంతో అథ్లెట్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాజాగా మరో అంశం వెలుగులోకి వచ్చింది. మహిళా జిమ్నాస్టిక్ ప్రణతి నాయక్, ఆమె కోచ్ అశోక్ మిశ్రాకు ఒకే గది కేటాయించడం గమనార్హం. క్రూయిజ్ షిప్‌లో ఇద్దరికీ ఒకే గదిని కేటాయించినట్లు నిర్వాహకులు భారత అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో మహిళ-పురుషుడికి కలిపి ఒకే గదిని ఎలా ఇస్తారని తీవ్ర విమర్శలు వచ్చాయి. వెంటనే సమస్యను నిర్వాహకులకు తెలియజేసినా.. గంటల తరబడి పరిష్కారం చూపించలేదని భారత వర్గాలు పేర్కొన్నాయి. చివరికి భారత ఒలింపిక్ అసోషియేషన్ కలగజేసుకొని ఏర్పాట్లు చేసింది. అది అయ్యేసరికి అర్ధరాత్రి ఒకటిన్నర అయినట్లు సమాచారం.

# చరిత్రకు అడుగు దూరంలో!



టేబుల్ టెన్నిస్ + ఫుట్‌బాల్‌ను కలిపి ఆడితే టెక్‌బాల్ అవుతుంది. టీటీ టేబుల్‌పైన చేతులతో కాకుండా మిగతా శరీరంతో ఫుట్‌బాల్‌లా తలపడటమే టెక్‌బాల్. 2017లో తొలిసారి టెక్‌బాల్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. 2018-19లో భారత్‌లో ప్రవేశించిన ఈ ఆటకు.. ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. భారత్ నుంచి ఈసారి ఆసియా క్రీడల్లో ముగ్గురు బరిలోకి దిగారు. మెన్స్ డబుల్స్‌లో ఓడిపోగా.. మహిళల సింగిల్స్‌లో క్విమ్సి డిసౌజా సెమీస్‌కు చేరి ఆశ్చర్యపరిచింది. శనివారం కూడా గెలిస్తే.. ఫైనల్‌కు చేరుకుంటుంది. అప్పుడు పతకం ఖాయం కానుంది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ అనాస్ ఇమ్రాన్ బెగ్‌తో కలిసి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ముంబయిలో జన్మించిన క్విమ్సి డిసౌజా తన కెరీర్‌ను ఫుట్‌బాల్ ప్లేయర్‌గా మొదలుపెట్టింది. మహారాష్ట్ర తరఫున అండర్-19 ఫుట్‌బాల్ మ్యాచులు ఆడింది. అయితే, 2022 నుంచి టెక్‌బాల్ గేమ్‌కు మారిపోయింది. కేవలం నాలుగేళ్ల వ్యవధిలోనే ఆసియా గేమ్స్‌లో తలపడేంత స్థాయికి ఎదిగింది. ఫుట్‌బాల్ ఆటలో అనుభవం ఉండటం ఆమెకు కలిసొచ్చింది. ఏడుసార్లు జాతీయ ఛాంపియన్‌గా అవతరించింది. భారత్‌లో టెక్‌బాల్ విస్తరణలో కీలక పాత్ర పోషించే బెంగళూరు క్లబ్‌తో కలిసి పని చేసింది. మరోవైపు డెకాథ్లాన్‌లో టెస్ట్ ఇంజినీర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించనుండటం గమనార్హం.

# ఆసియా గేమ్స్‌లో అథ్లెట్లకు వసతి కష్టాలు

నగోయా: భారీ అంచనాలతో, పతక ఆశలతో ఆసియా గేమ్స్ కోసం ఆతిథ్య జపాన్‌లోని ఐచి నగోయాకు చేరుకున్న భారత్‌తో పాటు పలు దేశాల క్రీడాకారులకు సమస్యలు స్వాగతం పలికాయి. సరైన సౌకర్యాలు లేకపోవడం, వేదికలకు సుదూర ప్రాంతాల్లో వసతి కేటాయించడంతో వేలాది మంది అథ్లెట్లు, కోచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగోయా పోర్ట్‌లో నిలిపి ఉంచిన 'కోస్టా సెరెనా' క్రూయిజ్ షిప్‌లోఇద్దరు ఉండే చిన్న గదిలో ముగ్గురు అథ్లెట్లను ఉంచడంతో భారత రోయింగ్, ఉషూ, టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. థాయిలాండ్ అథ్లెట్లు గదులు దొరక్క క్రూయిజ్ షిప్ వెల్కమ్ సెంటర్‌లోని నేలపైనే నిద్రించారు. మను భాకర్, ఇషా సింగ్ వంటి స్టార్లతో కూడిన భారత షూటింగ్ బృందానికి షూటింగ్ రేంజ్ నుంచి 50 కి.మీ దూరంలో హోటల్ కేటాయించారు. దీంతో రోజూ 2 గంటల ప్రయాణం చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.







PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314